



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా ఈ ఏడాదిలో ప్రభుత్వం మరింత ముందుకు సాగుతుందని ఆశిస్తున్నా. రైతులు, మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుంది. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, ప్రజలందరూ ఆనందంతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు..

– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సంపుటి 09, సంచిక: 35 | గురువారం | 01-01-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## శుభాకాంక్షలు




పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' నూతన సంవత్సర శుభాకాంక్షలు

## సెలవు

నూతన సంవత్సరం సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి గురువారం సెలవు. శుక్రవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

- ఎడిటర్



ఉద్యోగుల పెండింగ్ బిల్లులు

## రూ.713 కోట్లు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులలో డిసెంబర్ నెలకు సంబంధించి రూ.713 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ సిఎం ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు డిసెంబర్ నెలకు సంబంధించిన రూ.713 కోట్ల బిల్లులను తరువాయి 2లో



న్యూజిలాండ్ నుండి బ్రెజిల్ వరకూ

# న్యూ ఇయర్ సందడి

**వెల్లింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా 2026 కొత్త సంవత్సరం సందడి ప్రారంభమైంది. చాలా యూరప్ దేశాలలో ఈ క్రిస్మస్ మాసం నుండీ ఈ సందడి మార్కెట్లలో కొనసాగుతూ వస్తోంది. ప్రపంచంలో కొత్త సంవత్సరం పొద్దు పొడుపుకోసం ప్రజలంతా ఎంతో భావోద్వేగంతో ఎదురుచూస్తున్నారు. కానీ భౌగోళికంగా దక్షిణ హవాయ్ సమీపం పసిఫిక్ సముద్రంలోని కిరితిమతి దీవిలో 2026 కొత్త సంవత్సరం కాలమానం ప్రారంభమైంది. ఆ తర్వాత న్యూజిలాండ్ ఛాత్తం దీవిలో, ఆక్లాండ్, టోగాన్‌లలో ప్రజలు సంగీత వాయిద్యాలతో, బాణసంచాతో స్వాగతం పలికారు. శాంతి వెల్లివిరియాలని దేవుడు ఆశీర్వదించాలని ప్రజలు కోరుకున్నారు. ఇండోనేసియాలో ప్రజలు తమదైన తరువాయి 2లో

# మోదీ విధ్వంస పాలన



కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ధ్వజం

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది (2025) కూడా బిజెపి 'దోపిడీ, అవినీతి, దుర్మార్గపాలన' సాధారణ పౌరుల జీవితాలను శాసించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంవత్సరం చివరి రోజున అన్నారు. 2025లో మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశంలో జరిగిన పరిణామాలపై కాంగ్రెస్ ఒక జాబితా విడుదల చేసింది. సోషల్ మీడియా వేదికగా అధికార పార్టీపై సుదీర్ఘ ఆరోపణల జాబితాను ఖర్గే బుధవారం వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, సామాజిక న్యాయం, జాతీయ భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను ప్రభుత్వం నిర్వహించిన తీరుపై ఆయన మోదీ ప్రభుత్వాన్ని తరువాయి 12లో

మూడేళ్లలో

# డిండి పూర్తి

- పదేళ్ల బిఆర్‌ఎస్ హయాంలో ప్రాజెక్టుపై పూర్తి నిర్లక్ష్యం
- నీళ్లు ఎక్కడి నుంచి ఎక్కడికి పోవాలో డిపిఆర్ లేకుండా కాలయాపన చేసిన ఘనత గత ప్రభుత్వానిదే
- మా ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1800 కోట్లు కేటాయించింది
- మరో ఐదేళ్లు కూడా రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/చండూరు

సాగు నీటి రంగంలో రాష్ట్రంలోనే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగు నీరు అందించే ఎస్‌ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టును రానున్న మూడు సంవత్సరాల కాలంలో పూర్తి చేసి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఓ న్యూస్ ఛానల్ రిపోర్టర్ బోయపల్లి రమేష్ తండ్రి మాజీ సర్పంచ్ బోయపల్లి సురేందర్ దశదినకర్మ కార్యక్రమం మండల పరిధిలోని అంగడిపేట బిఆర్‌సి ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బోయపల్లి సురేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాలగూడెం ఎమ్మెల్యే బిఎల్‌ఆర్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తరువాయి 2లో



- రూ. 3వేల కోట్ల ఆస్తి పన్ను లక్ష్యం
- వేగంగా హెచ్‌సిటీ ప్రాజెక్టు పనులు
- జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

పారిశుద్ధ్యంలో హైదరాబాద్‌ను

# అగ్రగామిగా నిలుపుతాం

ప్రజాపక్షం/హైదరాబాద్

పారిశుద్ధ్యంలో హైదరాబాద్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు 2026ను లక్ష్యంగా చేసుకుని పని చేస్తామని మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ 2025లో జాతీయ స్థాయిలో జిహెచ్‌ఎంసి 6వ ర్యాంకు సాధించడంతో పాటు 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీగా గుర్తింపు పొందిందన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్‌పాటిల్, అపూర్వ చౌహాన్, అదనపు సి.ఎన్.రఘుప్రసాద్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ 27 పట్టణ స్థానిక సంస్థల విలీనంతో జిహెచ్‌ఎంసి పరిధి 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్లకు విస్తరించిందని, ప్రస్తుతం 300 వార్డుల్లో రోజుకు సుమారు 9 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని చెప్పారు. చెత్త నిర్వహణ కోసం కొత్త డంపింగ్ యార్డుల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి తరువాయి 2లో

ఎస్‌ఎస్‌ఎల్‌వి... 3వ దశ

# 'పరీక్ష సక్సెస్'

- శ్రీహరికోట సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలోని ఎస్‌ఎంఎస్‌టిసి వేదికగా ప్రయోగం
- చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి వేగంగా ప్రయోగించేందుకు ఈ మూడవ దశ రూపకల్పన



**బెంగళూరు :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరొక ముందడుగు వేసింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్‌ఎస్‌ఎల్‌వి) మూడవ దశ(ఎస్‌ఎస్3)ను విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డిఎస్‌సి)లో తరువాయి 12లో

యూరియా సరఫరాపై

# నిరంతర పర్యవేక్షణ

- జిల్లాల్లో సమృద్ధి నిల్వలున్నా రైతుల్లో ఆందోళనలు సృష్టించే కుట్రలు
- ఇప్పటి వరకూ 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశాం : మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేపడుతోందని, అన్ని జిల్లాల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నప్పటికీ రైతులలో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రబీ సీజన్‌కు అవసరమైన మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో ఇప్పటికే సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల తరువాయి 12లో

సిపిఐ వందేళ్ళ బహిరంగసభకు

# ఎపి నుంచి 50 వేల మంది

**విజయవాడ నుండి ఒకటి, రాయలసీమ నుంచి ఐదు ప్రత్యేక రైళ్ళు**




**విజయవాడ :** కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రజాతంత్రవాదులను, ప్రజాతంత్ర సంస్థలను, ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు కుట్రలు పన్నుతున్నదని, దానిని ప్రజాస్వామిక వాదులందరూ ఏకోన్ముఖంగా తిప్పికొట్టాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో ప్రజా సమస్యలపై సమ్మెలు, పోరాటాలు దేశంలో ఎక్కడా జరగకూడదనే కుతంత్రాలకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఒడిగడుతోందని ధ్వజమెత్తారు. విజయవాడ దాసరిభవన్‌లో మంగళవారం సిపిఐ తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎపి రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావులతో కలిసి రామకృష్ణ విలేకరుల సమావేశం నిర్వహించారు.వీటన్నిటిపై చర్చించేందుకు జనవరి 19, 20, 21 తేదీల్లో తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## నేటి నుండి భారత్,చైనా,కొరియాపై మెక్సికో టారిఫ్‌లు

**మెక్సికోసిటీ :** ఆసియా దేశాల నుండి దిగుమతయ్యే సరుకులపై మెక్సికో దేశం టారిఫ్‌లు పెంచింది. గణనీయంగా పెరిగిన టారిఫ్‌లు కొత్త సంవత్సరం మొదటి రోజు నుండి అమలులోకి వస్తాయి. మెక్సికోలో దేశీయంగా 3.50 లక్షలమంది ఉద్యోగాలను కాపాడేందుకే ఈ టారిఫ్‌లు పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యంగా విదేశాల నుండి దిగుమతయ్యే వస్తువులు దేశీయంగా కూడా తయారవుతున్నాయి. ఈ పరిశ్రమలలో ఉద్యోగులను కాపాడేందుకే ఈ చర్య తీసుకున్నారు. ముఖ్యంగా చైనా, భారత్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ఇండోనేసియా దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ టారిఫ్‌లు విధించింది. ఐతే చైనా సహా మెక్సికోలని పలు పరిశ్రమలు కూడా ఈ పెరుగుదలను వ్యతిరేకించాయి. ఈ టారిఫ్‌లు విధించడానికి మెక్సికో కాంగ్రెస్ డిసెంబరు మొదటివారంలోనే ఆమోదం తెలియజేసింది.

## ఖలీదాజియాకు కన్నీటి వీడ్కోలు



**ఢాకా :** లక్షల మంది ప్రజల సమక్షంలో బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖలీదాజియా (80) అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం అధికార లాంఛనాలతో పూర్తిచేశారు. ఆమె భర్త జియావుర్ రెహ్మాన్ సమాధి పక్కనే ఆమెను ఖననం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ సెలవుదినం పాటించారు. జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. అనేకచోట్ల ఆమె సంస్మరణ కార్యక్రమాలు జరిగాయి. విభిన్న జీవనరంగాలకు చెందిన లక్షలమంది ఆమె అంత్యక్రియల ప్రార్థనల్లో (నమాజ్ ఏ జనజ) పాల్గొన్నారు. జాతీయ మసీదు బైతుల్ ముక్రమ్ ఖాతిబ్ ముఫ్తీ మహ్మద్ అబ్దుల్ మలెక్ ఈ అంత్యక్రియల ప్రార్థనలు నిర్వహించారు. మానిక్ మియా ఎవెన్యూ పశ్చిమ శివారులో ఈ కార్యక్రమం జరిగింది. ఖనన ప్రదేశానికి ప్రజలను అనుమతించలేదు. బుధవారం ఉదయం నుండే ప్రజలు పెద్ద ప్రవాహంలా అంత్యక్రియల ప్రదేశానికి చేరుకోవడం ప్రారంభించారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకుడు, స్థాయీ సంఘం కమిటీ సభ్యుడు నజ్రుల్ ఇస్లాం ఖాన్ ఈ సందర్భంగా ఖలీదాజియా జీవిత చరిత్రను సంగ్రహంగా చదివి వినిపించారు. ఖలీదాజియా మంగళవారం ఉదయం ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో కన్నుమూశారు. దేశ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ప్రొఫెసర్ మహ్మద్ యూనుస్, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జుబయర్ రెహ్మాన్ చౌధురి, ఖలీదా జియా కుమారుడు, బిఎన్‌పి పార్టీ తాత్కాలిక చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ తదితరులు ఈ అంత్యక్రియల ప్రార్థనల్లో పాల్గొన్నారు. పలు దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారత్ తరపున హాజరైన కేంద్ర మంత్రి జైశంకర్ ఖలీదాజియా అంత్యక్రియల కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరపున కేంద్ర విదేశీమంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పంపించిన సంతాప సందేశాన్ని ఖలీదా జియా కుమారుడు, బిఎన్‌పి తాత్కాలిక చైర్మన్ తారిఖ్ రెహ్మాన్‌కు జైశంకర్ అందజేశారు. ఢాకా విమానాశ్రయంలో బుధవారం ఉదయం దిగిన వెంటనే జైశంకర్ వెళ్ళి రెహ్మాన్‌ను కలుసుకున్నారు. ఆయనకు భారత ప్రజల తరపున సంతాపం తెలియజేశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో ఉన్న ఖలీదాజియా మంగళవారం ఉదయం మరణించారు. ఆమె దార్శనికతను, ఆమె పాటించిన విలువలను దేశం కొనసాగిస్తుందన్న ఆశాభావం ప్రధానమంత్రి మోదీ తన సందేశంలో వ్యక్తం చేశారు. ఇరుదేశాల భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళ్ళగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ''మరణవార్త విని తీవ్రంగా కలత చెందాను, మీ కుటుంబానికి, ప్రజలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం'' అని సోషల్ మీడియాలో మోదీ పేర్కొన్నారు. భారత్‌తోపాటు పలు ఆసియా దేశాల ప్రతినిధులు,నాయకులు కూడా అంత్యక్రియలకు హాజరయ్యారు. భూటాన్ విదేశీ వ్యవహారాల మంత్రి లయోన్‌పో ధుంగ్యేల్, శ్రీలంక విదేశీమంత్రి విజిథ హెరత్ కూడా హాజరై ఖలీదాజియాకు నివాళులు అర్పించారు. మాల్దీవుల తరపున ఉన్నతవిద్యా, కార్మిక మంత్రి అలీ హైదర్ అహ్మద్, పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిక్ నేపాల్ విదేశీ మంత్రి బాలానంద శర్మ పాల్గొన్నారు.

## యుద్ధ ఖైదీలను విడుదల చేసిన థాయ్



**బ్యాంకాక్ :** సరిహద్దు వివాదం, ఘర్షణలతో అతలాకుతలమవుతున్న ఇరుగుపొరుగు దేశాలు కాంబోడియా–థాయ్‌లాండ్ ఇరవై రోజుల భీకర యుద్ధానికి తెరదించాయి. తాజాగా కుదిరిన కొత్త ఒప్పందంలో భాగంగా థాయ్‌లాండ్ చెరలో ఉన్న 18 మంది కాంబోడియా యుద్ధ ఖైదీలను బుధవారం విడుదల చేసింది. ఈ యుద్ధ ఖైదీలు ఐదు నెలలుగా థాయ్‌లాండ్ చెరలో మగ్గుతున్నారు. రెండు దేశాలమధ్యా వినాశకరమైన పోరాటం తర్వాత ఈ సైనికుల విడుదల ఒక పెద్ద ఆటంకాన్ని తొలగించింది. రెండు దేశాల సరిహద్దుల్లో ఉన్న చారిత్రక కట్టడాలు తమవంటే తమవంటూ ఈ రెండు దేశాలమధ్యా దీర్ఘకాలంగా వివాదం కొనసాగుతోంది. ఆ వివాదమే యుద్ధాలకు ఆజ్యం పోస్తోంది. జెనీవా చట్ట నిబంధనల ప్రకారం పురుషులను నిర్బంధంలో ఉంచుకోవచ్చుననీ, రెండు దేశాలమధ్యా శత్రుత్వం పూర్తిగా ముగిసిపోయేవరకూ ఈ యుద్ధ ఖైదీలను విడుదల చేసేదేలేదని ఇప్పటివరకూ థాయ్‌లాండ్ మంకుపట్టు పట్టింది. ఎట్టకేలకు ఈ ఆటంకం మంచుతెరలా తొలగిపోయింది. జులైలో చెలరేగిన ప్రాణాంతకమైన యుద్ధ ఘర్షణల సందర్భంగా థాయ్‌లాండ్ ఈ సైనికులను నిర్బంధంలోకి తీసుకుంది. ''ఏసియన్'' కూటమి మధ్యవర్తిత్వ చర్యల్లో భాగంగా చైనా నుండి దౌత్యపరమైన ఒత్తిడి పెరగడంతో రెండు దేశాలమధ్యా తాజా ఒప్పందం కుదిరింది. ఈ యుద్ధం వల్ల రెండు దేశాల సరిహద్దు గ్రామాల్లో నివసించే 5,00,000 మంది ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోయారు.

2025 జులైలో ఈ రెండు పొరుగుదేశాలమధ్యా యుద్ధం ప్రారంభమైన తర్వాత ఒప్పందం కుదిరినప్పటికీ విడతలవారీగా నిన్నమొన్నటివరకూ మూడుసార్లు యుద్ధం జరిగింది. 'మీరంటే మీరే...' కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ రెండు దేశాలు తగవులాడుకుంటూ అమెరికాసహా ఇతర మధ్యవర్తుల సహాయంతో కాల్పుల విరమణ ఒప్పందాలకు దిగాయి. డిసెంబరు 27న రెండు దేశాల రక్షణ మంత్రులమధ్యా కుదిరిన ఒప్పందం ప్రకారం థాయ్‌లాండ్ ఛాంతబురి రాష్ట్రం, కాంబోడియా పైలియన్ రాష్ట్రం మధ్య ఉన్న సరిహద్దు ప్రాంతం వద్ద యుద్ధ ఖైదీలు స్వదేశంలోకి కాలుపెట్టారు. రెండు దేశాలమధ్యా సుహృద్భావం, విశ్వాస పునరుద్ధరణకు, అంతర్జాతీయ మానవతా సూత్రాలకు అనుగుణంగా 18 మంది కాంబోడియా సైనికులను విడుదల చేశామని థాయ్‌లాండ్ విదేశీ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది.

అదేవిధంగా కాంబోడియా విదేశీ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ, ఈ సైనికుల విడుదలతో రెండు దేశాలమధ్యా శాంతి, స్థిరత్వ సాధనకు, సాధారణ సంబంధాల పునరుద్ధరణకు, ఇరు దేశాల ప్రయోజనాలకు దోహదం చేస్తాయని తెలిపింది.

## టర్కీలో ఐఎస్ వ్యతిరేక దాడులు

### వారం రోజుల్లో 600 మంది అరెస్టు

**అంకారా :** టర్కీలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమంకొనసాగుతోంది. వరుసగా బుధవారం కూడా టర్కీ ప్రభుత్వ దళాలు దేశవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో 125 మందిని అరెస్టు చేశాయి. మొదటిరోజు 327 మందిని అరెస్టు చేశారు. గడచిన వారం రోజుల్లో మొత్తంగా 600 మందిని అరెస్టు చేశారు. 21 రాష్ట్రాలలో దాడులు చేసినట్లు హోంమంత్రి ప్రకటించారు. సెలవుదినాల్లో జనసమ్మర్థమైన ప్రాంతాల్లో దాడులు చేసేందుకు ఐఎస్ ఉగ్రవాదులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ ఏరివేత కార్యక్రమం కొనసాగుతోంది. మొదట క్రిస్మస్ రోజున 115 మందిని అరెస్టు చేశారు. కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా దాడులు ఉద్ధృతం చేయాలని ఉగ్రవాదులు నిర్ణయించుకున్నట్లు సమాచారం తెలియడంతో టర్కీ ప్రభుత్వం అప్రమత్తమైంది.

## మయన్మార్ తొలిదశలో 50 శాతం ఓటింగ్

**ప్యాంగ్‌యాంగ్ :** మయన్మార్ పార్లమెంటుకు జరిగిన తొలిదశ ఎన్నికల్లో యాభై శాతం పోలింగ్ నమోదైనట్లు జుంటా సైనిక ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. తొలిదశలో 11.6 మిలియన్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారని సైనిక ప్రభుత్వ ప్రతినిధి జామిన్‌తున్ రికార్డెడ్ సందేశంలో చెప్పారు. విజయవంతమైన ఈ ప్రక్రియ తమ ప్రభుత్వ విజయం కాదని, దేశ విజయం, ప్రజల విజయమని ఆయన పేర్కొన్నారు. కాగా 2020లో జరిగిన ఎన్నికల్లో ఆంగ్‌సాన్ సూకీ నేషనల్ లీగ్ పార్టీ పోటీ చేసినప్పుడు ఒకేవిడత ఎన్నికల్లో 70 శాతం పోలింగ్ జరిగింది. కానీ ఈ ఎన్నికల్లో మోసం, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సైనిక నాయకుడు ఆంగ్ హ్లైంగ్ ఎన్నికైన ప్రజాతీర్పును రద్దుచేసి అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మయన్మార్‌లో మూడుదశల్లో పోలింగ్ జరుగుతోంది. ఫిబ్రవరి రెండోవారంనాటికి ఎన్నికల ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. 2021లో సైనికులు ప్రభుత్వాధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇక అప్పటి నుండి దేశంలోని పలు ప్రాంతాలలో అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఇప్పటికీ అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. సైనిక పాలకులు తమ అధికారాన్ని స్థిరీకరించుకోవడంకోసమే బూటకపు ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఐక్యరాజ్యసమితి కూడా పరోక్ష విమర్శలు చేసింది. పాశ్చాత్య దేశాల దౌత్యవేత్తలు ఈ ఎన్నికల తీరును ఖండిస్తున్నారు.

## నేటి నుండి బల్గేరియాలో యూరో కరెన్సీ

**సోఫియా :** ఆగ్నేయ యూరప్ ప్రాంత దేశం బల్గేరియాలో 2026 జనవరి ఒకటో తేదీ నుండీ యూరో కరెన్సీ చెలామణీలోకి వస్తుంది. దీనికోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఒక దేశం యూరో కరెన్సీ జోన్‌లో చేరాలా? వద్దా? అనే విషయాన్ని యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ నిర్దేశిత ఆర్థిక ప్రామాణిక సూత్రాల ద్వారా ఆమోదం తెలియజేస్తుంది.

యూరోపియన్ యూనియన్ కమిషన్, యూరో సెంట్రల్ బ్యాంక్ 2025 జూన్ నాలుగో తేదీన ఆమోదం తెలియజేసిన తర్వాత, దేశంలో యూరో కరెన్సీని అమలులోకి తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన మూడు చట్టాలను 2025 జులై 8వ తేదీన బల్గేరియా చట్టసభ ఆమోదించింది. దీంతో యూరో జోన్‌లో చేరిన 21వ సభ్యదేశంగా బల్గేరియా రికార్డుల్లోకి ఎక్కింది. 60.70 లక్షలు జనాభా గల ఈ బాల్కన్ దేశం 2007 జనవరి ఒకటో తేదీ నుండి యూరోపియన్ యూనియన్‌లో సభ్యురాలుగా కొనసాగుతోంది. యూరోపియన్ యూనియన్ కామన్ కరెన్సీలో చేరడం ద్వారా బల్గేరియా ఇకమీదట అనేక ప్రయోజనాలు అందుకోనున్నది.

## ఎపి నుంచి 50 వేల మంది

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం నగరంలో సిపిఐ జాతీయ కార్యవర్గ, సమితి సమావేశాలు జరగనున్నాయని వెల్లడించారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఈనెల 26వ తేదీన సిపిఐ శత వార్షికోత్సవాలను దేశ వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించి, ఎర్ర జెండాలను రెపరెపలాడించినట్లు తెలిపారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వందేళ్ళ చరిత్ర గల సిపిఐ నిత్యం పేద, శ్రామిక వర్గాల ప్రజల కోసం ఉద్యమిస్తోందన్నారు. స్వాతంత్రోద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీతోపాటు కాంగ్రెస్ మాత్రమేనన్నారు. సిపిఐ 1925లో ఆవిర్భవించి ఒక్క శక్తిగా శ్రామిక, పేద వర్గాల తరపున పోరాడుతోందని వివరించారు.

ఘనమైన చరిత్రగల సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు వేడుకలు జనవరి 18న తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం గడ్డపై జరుగనున్నాయన్నారు. ఈ శత వార్షికోత్సవ ముగింపు వేడుకల సందర్భంగా జరిగే ప్రదర్శన, బహిరంగసభలకు దేశ నలుమూలల నుండి 5 లక్షల మంది పార్టీ శ్రేణులు తరలిరానున్నారని తెలిపారు. మరో 40 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని, ఖమ్మం ఎర్ర సముద్రంలా మారనుందని చెప్పారు.

**ఎపిలో అన్ని జిల్లాల నుంచి తరలివస్తాం : గుజ్జుల ఈశ్వరయ్య**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ వందేళ్ళ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం, దాని పోరాటం, త్యాగం, సాధించిన లక్ష్యాలను వివరించేందుకుగాను ఖమ్మం గడ్డంపై జరగబోయే శత వార్షికోత్సవ ముగింపు సభ ఒక చారిత్రాత్మకంగా నిలవనుందని తెలిపారు. దీనికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 50 వేల మంది తరలివెళ్లనున్నట్లు ప్రకటించారు.

విజయవాడ నుంచి ఒకటి, రాయలసీమ నుంచి 5 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులందరికీ ఖమ్మం సభ ఒక జవాబు చెప్పనుందన్నారు. దోపిడీ వ్యవస్థ ఉన్నంత వరకు ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందని వెల్లడించారు. సిపిఐ శతవార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ జనవరి 10, 11, 12 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను జీపు జాతాలు, మోటారు సైకిల్ జాతాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

## అగ్రగామిగా నిలుపుతాం

(మొదటి పేజీ తరువాయి)

2026–27 రూ. 3,000 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

**పారిశుధ్యంలో కీలక విజయాలు**

స్వచ్ఛ సర్వేక్షణ 2025లో 6వ ర్యాంకు, 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ గుర్తింపు, వాటర్ ప్లస్, ఓడిఎఫ్ రీ సర్టిఫికేషన్‌తో పాటు 'ప్రామిసింగ్ స్వచ్ఛ శహర్ తెలంగాణ' అవార్డు హైదరాబాద్‌కు దక్కిందని కమిషనర్ తెలిపారు. సిఎం ఆదేశాల మేరకు 300 వార్డుల్లో నిరంతరం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కొనసాగిస్తామని చెప్పారు.

**వ్యర్థాల నిర్వహణలో ఆధునిక సదుపాయాలు**

జవహర్‌నగర్‌లో 24 మెగావాట్ల ఆర్‌డిఎఫ్ ఆధారిత వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ (ఫేజ్2), రోజుకు 1000 టన్నుల సామర్థ్యం గల ఆర్‌డిఎఫ్ తయారీ యూనిట్ ప్రారంభించామన్నారు. ఖైత్లాపూర్‌లో 300 టన్నుల బయోమెథనేషన్, బయో సీఎన్‌జీ ప్లాంట్లతో నగర వ్యర్థాల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 10 వేల టన్నులకు చేరిందన్నారు. పారిశుద్ధ్య నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 10,752 చలాన్లు జారీ చేసి రూ.2.34 కోట్ల జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. అందిన ఫిర్యాదుల్లో 99 శాతం పైగా పరిష్కరించినట్లు చెప్పారు.

**మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్**

నగరమంతటా మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని, ఇందులో భారీ చెత్త, లెగసీ వ్యర్థాలు, నిరుపయోగ వాహనాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలు సమాచారం అందించేందుకు జిహెచ్‌ఎంసి వాట్సాప్ నెంబర్ 81259 66586, కాల్ సెంటర్ 0402111 1111లను సంప్రదించాలని సూచించారు. నగరంలో వినియోగంలోని లేని వాహనాలను నగర ప్రజలు తొలగించుకొవాలని, వాటిని రహదారులపై పెడితే వాటిని తాము తొలగిస్తామని చెప్పారు. ఇలాంటివి ఎక్కడైన తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

**ప్రజారోగ్యం, మౌలిక వసతులు**

2025లో డెంగీ కేసులు గత ఏడాదితో పోలిస్తే 30 శాతం తగ్గి 1,977కు చేరాయని తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరంలో రూ.2,706 కోట్లతో 9,993 ఇంజినీరింగ్ పనులు చేపట్టగా, ఇప్పటికే రూ.1,023 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని, హెచ్ సిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన 32 పనులకు త్వరలోనే ప్రారంభోత్సవం చేస్తామని వెల్లడించారు. వ్యూహాత్మక నాలా అభివృద్ధి (ఎస్‌ఎన్‌డిపి) రూ.667 కోట్ల వ్యయంతో రెండో దశ నాలా పనులు వేగంగా జరుగుతున్నాయి.

1,121 కిలోమీటర్ల మేర స్టామ్ వాటర్ డ్రైన్ మ్యాపింగ్ పూర్తి చేశామన్నారు. పిజెఆర్ ఫ్లైఓవర్, ఫలక్‌నుమా ఆర్.ఓ.బి (ఆర్‌ఓబి), ఆరాంఘర్ ఫ్లైఓవర్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. నగరం అంతటా 400 అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్ (ఎటిఎస్‌సి) ఏర్పాటు చేశామన్నారు.

**ఆస్తి పన్ను, డిజిటల్ గవర్నెన్స్**

వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జిఐఎస్ సర్వే ద్వారా 14 లక్షల ఆస్తులను సర్వే చేయగా, కొందరు చెల్లించాల్సిన పన్ను కంటే తక్కువ చెల్లిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మధ్యవర్తుల అవసరం లేకుండా జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్, యాప్ ద్వారా నేరుగా పన్ను చెల్లించాలని ప్రజలకు సూచించారు. 2025 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.1,512 కోట్ల ఆస్తి పన్ను వసూలు కాగా, ఇది గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అధికమన్నారు.

నగర పాలనను డేటా ఆధారితంగా మార్చేందుకు సమగ్ర జిఐఎస్ ఆధారిత మ్యాపింగ్‌ను చేపట్టామన్నారు. 650 చదరపు కిలోమీటర్ల మేర 5 సెంటీమీటర్ల స్పష్టతతో హైరిజల్యూషన్ మ్యాపింగ్ పూర్తి చేశామని, ఆస్తిపన్ను డేటాను విద్యుత్ శాఖ వివరాలతో అనుసంధానించడం ద్వారా రూ. 7.40 కోట్ల అదనపు ఆదాయాన్ని రాబట్టామని తెలిపారు.

**పర్యావరణం – పౌరుల భాగస్వామ్యం**

వనమహోత్సవంలో 25లక్షల మొక్కలు నాటడం, 40 కొత్త పార్కుల అభివృద్ధి, రహదారులు, ఫ్లైఓవర్ల సుందరీకరణతో నగరానికి హరిత శోభ పెరిగిందన్నారు. నగరాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం. పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పిలుపునిచ్చారు.

**వినూత్న ఐటీ కార్యక్రమాలు**

క్షేత్ర స్థాయి సిబ్బంది, ప్రధాన కార్యాలయం ఉద్యోగుల కోసం ఎఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. త్వరలో సర్టిఫికెట్లు, దరఖాస్తులు, ఫిర్యాదుల కోసం వాట్సాప్ ఆధారిత సేవలు, ఎఐ చాట్‌బాట్ లనుఅందుబాటులోకి తీసుకురానున్నామన్నారు.

**వెహికల్ ట్రాకింగ్:** 5,000 మున్సిపల్ వాహనాలకు జిపిఎస్ ఆధారిత ట్రాకింగ్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నామన్నారు.

## డిండి పూర్తి (మొదటి పేజీ తరువాయి)

మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎస్‌ఎల్‌బిసి, డిండి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల నిర్మాణంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టుకు గత 10 సంవత్సరాల కాలంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించలేదని ఆరోపించారు. నీళ్ల ఎక్కడి నుండి ఎక్కడికి పోవాలో అనే దానిపై డిపిఆర్ లేకుండా కాలయాపన చేసిన ఘనత బిఆర్‌ఎస్‌ది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ప్రాజెక్టుకు వెంటనే 18వందల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని అన్నారు. వచ్చే మూడు సంవత్సరాలకాలంలోనే పూర్తి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఏ ఒక్క ప్రాజెక్టును నిర్మించక పోయిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టడం కట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అధిక భారం పడుతుందని అన్నారు. తెలంగాణ తెచ్చుకున్న సంతోషం లేకుండా కెసిఆర్ గత 10 సంవత్సరాల కాలంలో తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని అన్నారు. ఏది ఏమైన రానున్న కాలంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, మరో ఐదు సంవత్సరాలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాల గూడెం ఎమ్మెల్యే బిఎల్‌ఆర్ , చల్లమల్ల కృష్ణారెడ్డి, నల్పరాజు రామలింగయ్య , నారబోయిన రవి, నల్పరాజు సతీష్ కుమార్, పల్లె వెంకన్న, నరహరి , వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రూ.713 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం విడుదల చేశారు. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత ఆగస్టు నెల నుంచి ప్రతినెల కనీసంగా రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. విడుదల చేసిన బిలుల్లలో ఉద్యోగుల గ్రాట్యూటీ, జిపిఎఫ్, సరెండర్ లీవులు అడ్వాన్స్ లకు సంబంధించిన బిల్లులు ఉన్నాయని ఆర్థిక శాఖ కార్యాలయం తెలియజేసింది.

## న్యూ ఇయర్ సందడి

(మొదటి పేజీ తరువాయి)

దేశీయ పురాతన సంస్కృతీ వారసత్వ దుస్తులు,నృత్యాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.ఆక్లాండ్‌లో స్కైటవర్ వేదికగా వేడుకలు నిర్వహించారు. కిరితిమతిదీవిలో కొత్తఏడాది కాలమానం ప్రవేశించిన 15నిమిషాలకు ఫిజి,టోంగా,సమోయా,న్యూజిలాండ్‌లలో నూతన సంవత్సర కాలమానం ప్రారంభమైంది.

గ్రీన్‌విచ్ మీన్‌టైమ్ ప్రకారం కిరితిమతిలో పది గంటలకు, న్యూజిలాండ్‌లో 11 గంటలకు, ఆస్ట్రేలియా తూర్పుతీరంలో ఒంటిగంటకు, జపాన్,దక్షిణ కొరియాలలో మూడు గంటలకు కొత్త సంవత్సరం కాలమానం ప్రారంభమైంది. అన్నిదేశాలకంటే ఆలస్యంగా బేకర్ ఐలాండ్స్‌లో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కొత్త సంవత్సర కాలమానం ప్రారంభమైంది. కొత్త సంవత్సరం వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని దేశాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటగా సిడ్నీలో 2,500 మంది దళాలను మోహరించారు. మంచు, చలి నుండి జాగ్రత్తలు పాటించాలని పలు దేశాల ప్రభుత్వాలు ట్రావెలర్స్‌ను హెచ్చరించాయి.

దక్షిణ హవాయ్‌లోని కిరితిమతి దీవిని కిరిబాస్ అనీ, కిరిబతి అంటారు. ఈ కిరిబాస్ ప్రాంతం 1979లో బ్రిటన్ నుండి స్వాతంత్ర్యం పొందింది. ఈ కిరితిమతి దీవిని క్రిస్మస్ దీవి అని కూడా పిలుస్తారు. ఈ దీవిలో ఎలాంటి శబ్దాలు ఉండవు. సముద్రపు ఒడ్డున చిన్న చిన్న జీవుల కదలికలు తప్ప...ఇక్కడ తాము ఎంతో ప్రశాంతంగా ఆనందంగా కొత్త సంవత్సరాన్ని గడుపుతామని చేపల వ్యాపారి బ్రేయన్ డన్ చెప్పారు. ఇక ఛాత్తందీవిలో కేవలం 600 మంది మాత్రమే జనాభా ఉన్నారు. ఈ దీవిలో ఎక్కువమంది ప్రజలు సాయంత్రం నుండే హోటల్ ఛాత్తం బార్‌లో గడుపుతారు. దీంతో ఓసియానాలోని న్యూజిలాండ్ దేశంలో బుధవారం నుండే కోలాహలం ప్రారంభమైంది. ఆస్ట్రేలియాలోని సిడ్నీ హార్బర్ దగ్గర నుండి బ్రెజిల్‌లోని రియో డీ జనేరియో వరకూ వివిధ దేశాల్లో ప్రజలు సందడిగా వేడుకల మధ్య స్వాగతం పలికారు.

అనేక దేశాలలో క్రిస్మస్–న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో భారీ కొనుగోళ్ళతో మార్కెట్లు లాభాల్లో నడుస్తున్నాయి. ప్రతి దేశంలోనూ ఈ పేరుతో ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు, తీపి పదార్థాలే ఎక్కువగా అమ్ముడుపోతున్నాయి. అనేక దేశాలలో ప్రజలు బాణసంచా సమకూర్చుకుని కొత్త సంవత్సరం వేడుకలు చేసుకున్నారు. అర్ధరాత్రి స్వాగత సత్కారాలు పలికేందుకు అనేక దేశాలలో భారీ హోర్డింగులు, రంగు రంగుల తోరణాలు, విద్యుత్ అలంకరణలు, నిశీథిలో బాణసంచా కాల్చారు. డెన్మార్క్‌లో ప్రజలు తమ పొరుగింటివారికి పలహారాలు అందజేసేందుకు గంటలు కొట్టేందుకు ప్లేట్లు గరిటెలుతో శబ్దాలు చేశారు. రాబోయే 12 నెలల్లో గుడ్ లక్ కలగాలని పరస్పరం ప్రజలు అభినందించుకున్నారు. అమెరికా న్యూయార్క్‌లో క్లాక్ టవర్ వద్ద వేలాదిమంది ప్రజలు బాల్‌రోల్ కోసం ఎదురుచూస్తున్నారు. విస్సెన్సెస్, ఇండియానాలలో ప్రజలు పుచ్చకాయలను నేలపై దొర్లించి వేడుక చేసుకునేందుకు సిద్ధమయ్యారు. స్పెయిన్ దేశంలో కొత్త సంవత్సరం అర్ధరాత్రి కొత్త సంవత్సరం ప్రారంభంకాగానే ద్రాక్షపళ్ళు ఆరగించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఒకే సారి త్వరత్వరగా 12 ద్రాక్షపండ్లు నోట్లోవేసుకుని నమిలి మింగుతారు. రాబోయే 12 నెలల్లో శుభం జరగాలనేదే దీని వెనుక అంతరార్థం. దీనికి భిన్నంగా జపాన్, దక్షిణ కొరియా దేశాల్లో రణగొణ ధ్వనులతో కొత్త సంవత్సరం ప్రారంభమైంది. కొత్త సంవత్సరం ప్రవేశించగానే 108 సార్లు జపాన్, దక్షిణ కొరియా దేశాల్లోగంటలు మోగించారు. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇక బ్రెజిల్ దేశంలో కొత్త సంవత్సర వేడుకల చిహ్నంగా తృణధాన్యాలను ఆరగించారు. ఎంత ఎక్కువ తింటే అంత శుభంగా వారు భావిస్తారు.

## సత్తా చాటిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్

### పన్నుగవేతదారుల నుంచి రూ.213 వసూలు
### రూ.114 పిడిఎస్ రైస్ జప్తు
### వివరాలు వెల్లడించిన డిజి శిఖాగోయల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గణనీయమైన విజయాలను నమోదు చేసిందని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ తెలిపారు. 2025లో విజిలెన్స్ విభాగం చేసిన కార్యక్రమాలను బుధవారం శిఖాగోయల్ వెల్లడించారు. ఏడాది కాలంలో పన్ను ఎగవేతను గుర్తించడం, రాబడిని తిరిగి పొందడం, అక్రమాలను నిరోధించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. ఈ ఏడాదిలో ఆయా ప్రభుత్వ శాఖల నుంచి 292 విచారణలు రాగా, ఫీల్డ్ యూనిట్లు 480 విచారణలను పూర్తి చేసి నివేదికలను సమర్పించామన్నారు.ఇక సుమారు రూ.228.31 కోట్ల పన్ను ఎగవేతను గుర్తించగా, అందులో రూ.213.58 కోట్లను వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం జరిగిందన్నారు. 203 రూట్ చెక్‌ల ద్వారా 18,137 వాహనాలను తనిఖీ చేశారు. దీని ఫలితంగా 3,994 కేసులు నమోదు చేసి, రూ.12.51 కోట్ల పెనాల్టీలు మరియు పన్నులను వసూలు చేశారు. రేషన్ షాపులు (ఎఫ్‌పిఎస్),మిల్స్ పాయింట్లు, ప్రైవేట్ ప్రాంగణాల్లో 451 తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 53 సెక్షన్ 6A కేసులు, 38 IPC కేసులు మరియు 24 ఇతర కేసులు నమోదయ్యాయి. అలాగే 24 వాహనాలను సీజ్ చేసి, రూ.114.95 కోట్ల విలువైన నిత్యావసర వస్తువులను జప్తు చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం మరియు ప్రజా భద్రత కోసం ఈ క్రింది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పత్తి, వరి మరియు విత్తనాల కొనుగోలు, యూరియా పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ప్రయాణీకుల, రవాణా వాహనాల ఓవర్‌లోడింగ్ నియంత్రణతో పాటు ప్రభుత్వ నిధుల దుర్వినియోగం లేదా అక్రమాలకు సంబంధించి సమాచారం ఉన్నట్లయితే, ప్రజలు 14432 అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని శిఖాగోయల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి సేవా పతకాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నూతన సంవత్సరం 2026ను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, యాంటీ కరప్షన్ బ్యూరో (ఎసిబి), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్), అగ్నిమాపక విపత్తు స్పందన సేవల విభాగాలకు చెందిన అధికారులకు పోలీస్ సేవా పతకాలు ప్రకటించింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక విభాగం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తమ విధుల్లో విశిష్ట సేవలు, అత్యుత్తమ పనితీరు, ధైర్యసాహసాలు ప్రదర్శించిన అధికారులు, సిబ్బందిని గుర్తించి ఈ అవార్డులు ప్రకటించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. డిసెంబర్ 31, 2025న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జనవరి 1, 2026న ఈ పతకాలు అందజేయనున్నారు. ఈ అవార్డుల్లో తెలంగాణ శౌర్య పతకం,తెలంగాణ మహోన్నత సేవ పతకం,తెలంగాణ ఉత్తమ సేవ పతకం,తెలంగాణ కఠిన సేవ పతకం,తెలంగాణ సేవ పతకం ఉన్నాయి.పతకాలు పొందిన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు నెలవారీ పునరావృత గ్రాంట్‌తో పాటు ఒకేసారి చెల్లించే నగదు ప్రోత్సాహకాన్ని కూడా అందించనున్నారు. ఆయా విభాగాల బడ్జెట్ కింద ఈ వ్యయాన్ని మంజూరు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల గడువు పొడిగింపు
### 2026 మార్చి 31 వరకు అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇప్పటీ వరకు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువును 2026 మార్చి 31 వరకు పొడిగించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ నుంచి ఆ పై చదువులు చదువుతున్న అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఈబిసి మైనార్టీ విద్యార్థిని విద్యార్థులు 2025–26 విద్యా సంవత్సరంలో పోస్టుమెట్రిక్ (రెన్యువల్, ఫ్రెష్) స్కాలర్ షిప్‌లకు దరఖాస్తులకు సంబంధించి విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి కోరారు. అభ్యర్థులు తమ దరఖాస్తులు https://telanganaepass.cgg.gov.in. ద్వారా చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. 10,89,233 మంది విద్యార్థులకు గాను 7,82,779 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోవడంతో గడువును మరోసారి మార్చి 31 వరకు పొడింగించినట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని కళాశాలల ప్రిన్సిపల్స్‌కు సూచించారు.

## రాష్ట్ర ప్రజలకు పలువురు ప్రముఖులు నూతన సంవత్సర శుభాకాంక్షలు



ప్రజాపక్షం /హైదరాబాద్ : రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా నూతన సంవత్సర (2026) శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేసి, కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. బిపి, షుగర్, ఒబెసిటీ, కిడ్నీ, గుండె జబ్బులు, కేన్సర్లకు కారణమైతున్న అనారోగ్యకర అలవాట్లను మానుకోవాలని, కొత్త సంవత్సరంలో ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని మంత్రి సూచించారు. నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని, అనవసరమైన తగాదాలకు తావు ఇవ్వకూడదని మంత్రి సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని యువతను కోరారు.

### మరింత సమగ్ర అభివృద్ధి సాధించాలి : వాకిటి



రాష్ట్ర ప్రజలకు క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు వ్యవసాయం,పాడిపరిశ్రమ ఇతర అన్నిరంగాల్లో మరింత సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఇందిరమ్మ రాజ్యం ఇప్పటికే సంక్షేమం, అభివృద్ధిపథంలో దూసుకెళ్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం యొక్క విజన్తో,ప్రజలందరి సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు.

### ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి : మంత్రి జూపల్లి

రాష్ట్ర ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆశలు, ఆకాంక్షలతో ఉత్సాహంగా నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు నిండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

### రాష్ట్ర అభివృద్ధికి ఆదర్శంగా నిలవాలి : అడ్లూరి లక్ష్మణ్



ఆంగ్ల నూతన సంవత్సరం2026ను పురస్కరించుకుని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దూరదృష్టి గల నాయకత్వం, ప్రజాపక్ష పాలన, అభివృద్ధి సంకల్పంతో తెలంగాణ రాష్ట్రం సరికొత్త ప్రగతి దిశగా ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు.నూతన సంవత్సరంలో ధర్మపురి నియోజకవర్గ ప్రజలు అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించి, రాష్ట్ర అభివృద్ధికి ఆదర్శంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.





నాగోల్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో 2025 సంవత్సర ముగింపు, 2026 సంవత్సర ఆరంభ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి విచ్చేసి నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షుడు పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రజాపక్షం దిన పత్రిక క్యాలెండర్, పాకెట్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన సమితి గవర్నింగ్ బాడీ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, కార్యదర్శి బిఎస్ఆర్ మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, జీఎం మధుకర్, ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్ బి.లక్ష్మీనారాయణ, బ్యూరో చీఫ్ చంద్రశేఖర్, న్యూస్ ఎడిటర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, నవచేతన విజ్ఞాన సమితి, ప్రజాపక్షం సిబ్బంది పాల్గొన్నారు.

# మతోన్మాదులే దేశానికి ప్రమాదకరం

- దేశ సంపద కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం
- జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి..
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి..



ప్రజాపక్షం/వలిగొండ : మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగి పోయారని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి విమర్శించారు. వలిగొండ మండలం వేములకొండ గ్రామంలో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశానికి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రధాని మోడీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బిజెపి యుద్ధోన్మాదానికి కూడా తెరలేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరం అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు. దేశభక్తి ముసుగులో బిజెపి కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతున్నదన్నారు. కోట్ల సంవత్సరాలు చరిత్ర కలిగిన అరావళి పర్వతాలను ఆదాని మైనింగ్ కంపెనీకి బిజెపి ప్రభుత్వం కట్టబెడుతున్నదని విమర్శించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ వర్గాలకు దోచి పెడుతున్న బిజెపి ప్రభుత్వం చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో ఐదు లక్షల మంది ప్రజలతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు జిల్లా నుండి వేలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి నూరు సంవత్సరాలు డిసెంబర్ 26కు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు.

దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదని అన్నారు. దున్ని వా డికి భూమి దక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకం గా సాయుధ రైతాంగ పోరాటాన్ని చేపట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. దేశంలో వామపక్ష పార్టీల ఐక్యతా పోరాటాలను ఉధృతం చేస్తూ, లౌకిక ప్రజాస్వామిక శక్తుల్ని ఏకం చేస్తూ ప్రజాస్వామ్య పోరాటాలను నిర్వహించడం జరుగుతున్నదన్నారు.

**జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగసభ..**

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జనవరి 18న సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగౌని గాలయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, పెరబోయిన మహేందర్, ఏశాల అశోక్, చిగుళ్ల లింగం, చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మి నరసయ్య, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఎలగందుల అంజయ్య, ఎల్లంకి మహేష్, గాదెగాని మాణిక్యం, అన్నెపు వెంకట్, దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, మారుపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్ల డిమాండ్ల సాధనకు 3న చలో అసెంబ్లీ
### ఆటో జెఎసి పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. ఆటోడ్రైవర్ల డిమాండ్ల సాధన కోసం ఈనెల3వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించింది. తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జెఎసి అధ్వర్యములో బుధవారంసుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జెఎసి కన్వీనర్ ఎఐటియుసి నాయకులు బి. వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బిఆర్ఎస్ శాసనమండలి పక్ష నేత మ ధుసూదనాచారి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, నర్సింహ రెడ్డి (సిఐటియు) దయానంద్ (ఐఎన్‌టియుసి), ఎ.మారయ్య (బిఆర్‌టియు), యాదగిరి(టిఎన్‌టియుసి) రమాదేవి (సిపిఎంఎల్ మాస్ లైన్ ) వి.ప్రవీణ్ (టియుసిఐ) గటుష్ నాయకులు శ్రీనివాస్, శివానంద్ (టిఎఎండియు) ఎం.ఎ సలీం( తెలంగాణ జాగృతి) సత్తి రెడ్డి( టిఏడిఎస్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలు శాసనమండలి లో చర్చకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఆటో మీటర్ చార్జెస్ వెంటనే పెంచాలని డి మాండ్ చేశారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యముగా రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప ఆటో కార్మికులకు ప్రభుత్వం హామి ఇచ్చిన ఏడాదికి రూ. 12 వేలు తక్షణమే చెల్లించాలనిడిమాండ్ చేశారు. ఈనెల 3న నిర్వహించనున్న చలో అసెంబ్లీ కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు.

## స్కిల్స్ యూనివర్సిటీలో 1000 మందికి శిక్షణ

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులను చదివిన విద్యార్థులకు ఉద్యోగాలకు సరిపడే నైపుణ్యం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో డిసెంబర్ నాటికి 1000 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ అందించింది. నైపుణ్య విద్యా రంగంలో ఇంత తక్కువ టైమ్‌లో ఈ స్థాయి లక్ష్యాన్ని అందుకోవటం విశేషం. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పడిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ 2024 ఆగస్టు 1న యూనివర్సిటీకి శంకుస్థాపన జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన ఈ యూనివర్సిటీ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో దీనిని నిర్వహిస్తున్నారు. ఈ యూనివర్సిటీకి ఛాన్సలర్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బోర్డు చైర్మన్‌గా పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహింద్రా వ్యవహరిస్తుండగా, పరిశ్రమల రంగానికి చెందిన ప్రముఖులతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీని పర్యవేక్షిస్తోంది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ వి.ఎల్.వి.ఎస్.ఎస్. సుబ్బారావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీకి సంబంధించిన శాశ్వత క్యాంపస్ హైదరాబాద్ సమీపంలోని కందుకూరు మండలం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉంది.

## బిసి రిజర్వేషన్లు పెంచకుండా ‘పరిషత్తు’ఎన్నికలకెళ్తే అసెంబ్లీని ముట్టడిస్తాం
### అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాల సమావేశంలో జాజుల



ప్రజాపక్షం /ఖైరతాబాద్ : బిసి రిజర్వేషన్లను పెంచకుండా ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలకెళ్తే వేలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తామని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. బుధవారం హైదరాబాదు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బిసి రిజర్వేషన్ల పెంచాలని డిమాండ్‌చేస్తూ జాజుల అధ్యక్షతన అఖిలపక్ష పార్టీలు బిసి సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా శాసనమండలి ప్రతిపక్ష నేత వి.మధుసూదనాచారి, రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు, మాజీ గవర్నర్‌బండారు దత్తాత్రేయ, సిపిఐ నేత ధనుంజయ నాయుడు, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, టిజెఎస్ నేత పల్లె వినయ్ హాజరయ్యారు. ముందుగా, జాజుల మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్లు పెంచే బాధ్యత కాంగ్రెస్, బిజెపి పార్టీలదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిసి రిజర్వేషన్లపై చర్చించి, కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి రాజకీయ పోరాటాన్ని ప్రకటించాలని డిమాండ్‌చేశారు. బిసి రిజర్వేషన్ల పెంపునకు జనవరిలో బిసి సర్పంచుల రాష్ట్ర సమాచారం ఏర్పాటు, ఫిబ్రవరి రెండో వారం నుండి బిసిల రథయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి ఏప్రిల్‌లో లక్షల మందితో హైదరాబాద్‌లో సభ నిర్వహిస్తామన్నారు. దత్తాత్రేయ మాట్లాడుతూ బిసి సంఘాలు ఒక్కతాటి మీదికొచ్చి బిసి రిజర్వేషన్ల పెంపు కోసం జాతీయస్థాయిలో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. వి హనుమంతరావు మాట్లాడుతూ వచ్చే బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రైవేటు బిల్లు ప్రవేశపెడతామన్నారు. ఈ బిల్లుతో బిసిల అనుకూలురు, వ్యతిరేకులు ఎవరో తేలిపోనున్నదన్నారు. ధనుంజయ నాయుడు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల పెంపునకు బిసి హక్కుల సాధన సమితి నిరంతరంగా పోరాడుతుందన్నారు. తమ పోరాటానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాడుతామన్నారు. సమావేశంలో బిసి జెఎసి కో–చెర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేశాచారి, నేతలు విక్రమ్‌గౌడ్, శ్యాంకుర్మ, మణిమంజరి సాగర్, దీటి మల్లయ్య, కాటేపల్లి వీరస్వామి, పిట్ల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## దూకుడు పెంచిన ఎసిబి
### 2025లో 199 కేసులు, రూ.96కోట్ల అక్రమ ఆస్తుల వెలికితీత



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఎసి బి) 2025 సంవత్సరంలో అవినీతిపై ఉక్కుపాదం మోపింది. ఈ ఏడాది మొత్తం 199 కేసులు నమోదు చేసి, 273 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఎసిబి అదనపు డిజిపి చారు సిన్హా బుధవారం మీడియాకు వెల్లడించింది. ఇందులో 157 ట్రాప్ కేసులు ఉండగా, వాటిలో 224 మంది నిం దితులు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వీరిలో 176 మంది ప్రభుత్వ ఉద్యోగులు కావడం గమనార్హం. అలాగే ప్రభుత్వ ఉద్యోగులపై 15 ఆదాయానికి మించి ఆస్తుల (డిఎ) కేసులు, 26 క్రిమినల్ మిస్‌కండక్ట్ కేసులు నమోదు చేసి, మొత్తం 34 మంది ని అరెస్టు చేశామన్నారు. ఈ ఏడాది నమోదైన ట్రాప్ కేసుల్లో ఎసిబి అధికారులు మొత్తం రూ. 57,17,500 లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.35,89,500ను ఫిర్యాదుదారులకు తిరిగి చెల్లించారు. అసమాన ఆస్తు ల కేసుల్లో రూ.96,13,50,554 విలువైన అక్ర మ ఆస్తులను వెలికితీశారు, ఇది ఏసీబీ దర్యాప్తులో కీలక విజయంగా పేర్కొన్నారు. కాగా అవినీతిపై నియంత్రణ కోసం ఎసిబి 26 రెగ్యులర్ ఎన్‌క్వైరీస్, 54 ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. స బ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆర్‌టిఎ చెక్‌పోస్టులు, సంక్షేమ హాస్టళ్లలో ఈ తనిఖీలు చేపట్టారు. నిందితులపై చర్యలకు ప్రభుత్వం నుం చి 115 ప్రాసిక్యూషన్ అనుమతులు పొందిన తరువాత ఎసిబి సంబంధిత కేసుల్లో చార్జ్ షీట్లు దాఖలు చేశామన్నారు. ఎసిబి సిబ్బంది సామర్థ్యవృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. 73 మంది అధికారులకు ప్రాథమిక శిక్షణ అందించామని, బినామీ ఆస్తుల చట్టం, డిజిటల్ లావాదేవీల ట్రేసింగ్, ట్రాప్ కేసుల న్యాయపరమైన అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. డిసెంబర్ 3 నుంచి 9 వరకు అవినీతి నిరోధక వా రోత్సవం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా క్యూర్ కోడ్ ఆధారిత ఫిర్యాదు వ్యవస్థను సైతం ప్రారంభించామని చారుసిన్హా తెలిపారు. దూర ప్రాంతాల ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

**లంచం అడిగితే 1064కు ఫోన్ చేయండి**

లంచం డిమాండ్ చేసిన ఏ ప్రభుత్వ ఉద్యోగిపై అయినా టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేయాలని ఎసిబి అదనపు డిజి చారుసిన్హా సూచించారు. వాట్సాప్: 9440446106, **ఫేస్‌బుక్:** Telangana ACB, ఎక్స్ (ట్విట్టర్): @Telangana ACB ద్వారా కూడా ఫిర్యాదు చే యవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, చట్టప్రకారం కఠి న చర్యలు తీసుకుంటామని చారు సిన్హా స్పష్టం చేశారు.

## నేటి నుంచి రోడ్డు భద్రతా మాసోత్సవాలు
### ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇంటినుంచి రోడ్డు మీదకు వచ్చిన వ్యక్తి సంక్షేమ తిరిగి ఇంటికి వెళ్లాడమే లక్ష్యంగా గురువారం (నేటి) నుంచి నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 2026 జనవరి 1 నుండి 31 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం ఇవ్వాలని, ప్రతి పాఠశాల రోడ్ భద్రతా క్లబ్ లో చేరాలని కోరారు. హెల్మెట్ ధరించకపోవడం, మద్యం తాగి వాహనం నడపడం రాంగ్ రూట్లో ప్రయాణం , అతివేగంతో వాహనం నడపడం వల్లే రోడ్డు ప్రమాదాల జరిగి అధిక మరణాలు సంభవిస్తున్నాయని అధికారక లెక్కలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. వీటిపై రవాణా శాఖ పూర్తి అవగాహన కల్పించడంతో పాటు రోడ్డు భద్రతపై సూచనలు చేయనుందని వీటిని ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.



## కొండాపూర్‌లో రూ.1,000 కోట్ల పెట్టుబడితో నూతన పరిశ్రమలు
### ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: మెదక్ జిల్లా కొండాపూర్ ఇండస్ట్రియల్ పార్కులో వెయ్యి కోట్ల పెట్టుబడితో నిర్మాణాలు పూర్తి చేసుకున్న పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సచివాలయంలో బుధవారం తనను కలిసిన కొండాపూర్ పారిశ్రామికవేత్తల సంఘం ప్రతినిధులతో శ్రీధర్ బాబు బేటీ అయ్యారు. సమావేశంలో టిజిఐఐసి ఎండి శశాంక ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇండస్ట్రియల్ పార్కులో మొత్తం 64 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో 36 పరిశ్రమలు నిర్మాణాలు పూర్తి చేసుకుని కార్యకలాపాలు మొదలు పెట్టడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాయని శ్రీధర్ బాబు చెప్పారు. ఇవి ప్రారంభమైతే 5 వేల మంది యువతకు తక్షణం ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. మరో నెల రోజుల్లోగా విద్యుత్తు సంబంధిత సమస్యలన్నిటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇండస్ట్రియల్ పార్కును జాతీయ రహదారితో కలిపే అప్రోచ్ రోడ్డును త్వరితిగతిన పూర్తి చేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరలో అన్ని పరిశ్రమలు ఉత్పాదన మొదలు పెట్టేలా మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ పెట్టుబడుల విభాగం డైరెక్టర్ మధుసూదన్, పరిశ్రమల యజమానుల సంఘం అధ్యక్షుడు కె.శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎం. శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శి ఎ.సాంబశివరావు, ట్రెజరర్ సిహెచ్. అశోక్ కుమార్, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ స్వామి, ఎ.వి.రమణ, నవనీత్ జైన్, సంతోష్ కుమార్, కెవిఆర్. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
టెండర్ నోటీసు
NIT No. 03/EE/PD-NZ/GHMC/2025-26 తేది: 30.12.2025
పని పేరు : మూసీ నదిపై మూసారాంబాగ్‌లో కొత్త హై లెవల్ వంతెన నిర్మాణంలో భాగంగా, నది ఎగువ భాగంలో ఉన్న 27 ఆస్తులను కూల్చివేయడం. అంచనా విలువ: రూ. 38.00 లక్షలు, బిడ్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం: 31.12.2025న మ.03.00గం.ల నుండి 08.01.2026న మ.03.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఒ/ఒ. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్ డివిజన్ - ఎన్‌జెడ్), జిహెచ్‌ఎంసి. 9959442013. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పిడి-ఎన్‌జెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 12818-PP/CL/ADVT/1/2025-26, Date: 31-12-2025

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ డివిజన్, భువనగిరి.
షార్ట్ టెండర్ నోటీసు నెం.03/2025-26
యాదాద్రి సర్కిల్‌లోని భువనగిరి డివిజన్‌లో వివిధ ఎలక్ట్రికల్ పనుల కోసం టెండర్ స్పెసిఫికేషన్స్. దయచేసి www.tgsouthernpower.org వెబ్‌సైట్‌ను సందర్శించండి. సంప్రదించవలసిన ఫోన్ నెం. 8712471794.
సం/- డివిజనల్ ఇంజనీర్ : ఎలక్ట్రికల్., ఆపరేషన్: డివిజన్: భువనగిరి.
DIPR R.O. No. : 12841-PP/CL/ADVT/1/2025-26, Date: 31-12-2025

కొత్తకోట మున్సిపాలిటీ కార్యాలయం - వనపర్తి జిల్లా
ఆసక్తి వ్యక్తీకరణ (EOI)
కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలోని సెంట్రల్ మీడియన్‌లో ప్లాంటేషన్ కోసం అవసరమయ్యే మొక్కలు కొరకు అనుభవజ్ఞులైన సంస్థల నుండి వ్యక్తీకరణ పత్రం (EOI) ను ఆహ్వానించుచున్నాము. ప్రారంభ తేది: 01.01.2026న ఉ. 10.00 గం. దాఖలుకు చివరి తేది: 03.01.2026 న 4:00గం. డాక్యుమెంట్ల పరిశీలన మరియు ఆర్థిక బిడ్ తెరుచు తేది: 03.01.2026 న సా. 5:00 గం.
సం/- కమిషనర్, మున్సిపాలిటీ, కొత్తకోట.
DIPR R.O. No. : 12859-PP/CL/ADVT/1/2025-26, Date: 31-12-2025

# మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

## మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మత్స్యకార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామం రుద్రప్ప చెరువులో బుధవారం చేప పిల్లను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార్మికులు చేపల పెంపకంలో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం చేప పిల్లల పంపిణి చేపట్టిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# మట్టిని తరలిస్తున్న వాహనాలు సీజ్



**ప్రజాపక్షం/మర్రిగూడ:** చర్లగూడెం ప్రాజెక్టు నుంచి కొందరు అక్రమార్కులు మట్టి దందా జోరుగా సాగిస్తున్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విశేషం.ప్రాజెక్టు నుంచి జోరుగా మట్టి దందాచర్లగూడెం ప్రాజెక్టు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్,జేసీబీని బుధవారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు రెవిన్యూ,పోలీస్,ఇరిగేషన్ అధికారులతో కలిసి వాహనాలను సీజ్ చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు తమ నిఘాను మరింత పెంచుతామని,వాల్టా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆయన వెంట ఇరిగేషన్, పోలీస్ అధికారులు ఉన్నారు.

# నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు



**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించేందుకు కృషి చేస్తానని నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం లో నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించారు.అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తాను అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించేందుకు కృషి చేస్తాననిన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించి బి.చంద్రశేఖర్‌కు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి తదితరులు పూల మొక్కలు,పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

# బుద్ధుడి సందేశాలను ప్రపంచానికి చాటి చెప్పే కేంద్రంగా బుద్ధవనం

## వియత్నాం బౌద్ధ భిక్షువులు -భిక్షునీలు బుద్ధవనం సందర్శన



**ప్రజాపక్షం/నందికొండ:** వియత్నాం దేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు, బౌద్ధ భిక్షునీలు బుధవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని బౌద్ధ అధ్యయన కేంద్రంలో పరిశోధనలు నిర్వహిస్తున్న వియత్నాం బౌద్ధ భిక్షువులు, భిక్షునీలు ఈ సందర్భంగా బుద్ధవనంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను దర్శించారు.నాగార్జునకొండ , మ్యూజియం సందర్శన, ముందుగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నాగార్జునకొండలోని మహాస్తూపాన్ని దర్శించిన వారు,అక్కడి మ్యూజియంలో ప్రదర్శితమైన విలువైన చారిత్రక శిల్పాలను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి చేరుకున్నారు. బుద్ధవనంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన,ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్రలు వారికి ఘన స్వాగతం పలికారు. బుద్ధవనం విశేషాలు, నిర్మాణ ప్రత్యేకతలు,ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని వారు వివరించారు.ఈ సందర్భంగా భిక్షువులు త్రీరత్న పూజ,దాతు పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహాస్తూపం సమావేశ మందిరంలో బుద్ధవనంపై రూపొందించిన లఘు చిత్రాన్ని వీక్షించారు. బుద్ధవనాన్ని సందర్శించిన వియత్నాం బౌద్ధ భిక్షువులు,భిక్షునీలు ఇక్కడి శిల్పకళ,ఆధ్యాత్మిక వాతావరణంపై ప్రశంసలు వ్యక్తం చేశారు.బుద్ధుని సందేశాలను ప్రపంచానికి చాటి చెప్పే కేంద్రంగా బుద్ధవనం నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బుద్ధవనం వివరాలను తెలియజేసే సమాచార బ్రోచర్లను వారికి అందజేశారు.అంతర్జాతీయ బౌద్ధ భిక్షువుల సందర్శనలతో బుద్ధవనానికి మరింత అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని అధికారులు తెలిపారు.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** రోడ్లు, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.బుధవారం నాంపల్లి మండలంలో తుమ్మలపల్లి ఓ లో ప్రైవేట్ కార్యక్రమానికి పాల్గొని వచ్చి తిరిగి హైదరాబాదుకు వెళ్ళుచుండగా యరంగడ్లపల్లి గ్రామం వద్ద మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పులిమామిడి నర్సింహా రెడ్డి, శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గిరిజన గ్రామపంచాయతీ తండా లో కొత్తగా చౌక ధరల దుకాణాల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లయితే వెంటనే రేషన్ దుకాణాన్ని మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట రామదాస్ శ్రీనివాస్,పులి మామిడి నరసింహా రెడ్డి, ఏడు దొడ్ల కృష్ణారెడ్డి,మాల్ డైరెక్టర్ జమ్ముల వెంకటేశ,మాజీ ఉపసర్పంచ్ వనపర్తి యాదయ్య,ఆకారపు శ్రీను,సిలువేరు యాదయ్య ఉన్నారు.

# నల్లగొండ జిల్లా ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక





**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లా ఎస్‌టియు టిఎస్ జిల్లా కౌన్సిల్ అత్యవసర సమావేశం ఎస్‌టియూ భవన్ నల్లగొండ నందు జిల్లా అధ్యక్షులు కొనకంచి వీరరాఘవులు అధ్యక్షతన నిర్వహించారు..ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ తండు భానుప్రకాష్ గౌడ్ మరియు మురారి శెట్టి రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశానికి ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర స్థానిక కార్యదర్శి వై.కరుణాకర్ రెడ్డి,యాదాద్రి జిల్లా ఎస్‌టియూ అధ్యక్షులు రమేష్ గార్లు పాల్గొనడం జరిగింది.పెండింగ్ లో ఉన్న 5డిఏను వెంటనే ప్రకటించాలని,నూతన పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని,ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిలు వెంటనె చెల్లించాలని,టెట్ నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించాలని,టెట్ పరీక్షకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు ఓడి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నరేంధర్ రెడ్డి,జిల్లా మండల బాధ్యులు,జిల్లా కౌన్సిల్ సభ్యులు కె దత్తేశ్వర్,ఉదయరాణి,ప్రమీల,నాగేశ్వర్ రావు , వెంకటేశ్వర్లు,అశోక్ రెడ్డి,సైదానాయక్,విజయప్రసాద్,జాన్ ఖాన్,తావుర్యనాయక్,రామ్ సింగ్,వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కెసిఆర్‌దే

## రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను 10 ఏళ్లు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. బుధవారం యాదాద్రి జిల్లా అడ్డగూడూరు మండలకేంద్రంలో ఐటిఐ,(ఏటిసి) అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్, కొడుకు, కూతురు, అల్లుడు నేడు ఆస్తుల కోసం కొట్లాడుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో 65 ఐటిఐ కాలేజీలు ఉండగా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో వాటికి నిధులు ఇవ్వకుండా నాశనం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ కాలేజీల అన్నింటిని గాడిలో పెట్టి నడిపిస్తున్నామని, విద్యార్థులు, యువతలో అడ్వాన్స్ టెక్నాలజీ, స్కిల్స్ పెంచి వారికి ఉద్యోగాలు కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి మరో 46 ఐటిఐ, అడ్వాన్స్ సెంటర్లు ప్రారంభించాలని చెప్పారని, ఆ దిశగా తాము పని చేస్తున్నామని చెప్పారు. ఐటిఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో 540 మంది ట్రైనీలు అవసరం ఉన్నారని, వారి నియామకం కోసం సీఎం రేవంత్ రెడ్డి అనుమతి ఇచ్చారని తెలిపారు. ఐటిఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో చదువుకునే విద్యార్థులకు సబ్సిడీ కూడా ఇస్తామని, ప్రతి నెల వారికి రూ.2 వేల స్టై ఫండ్ ఇస్తామని ప్రకటించారు. నకిరేకల్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో కూడా ఐటిఐ సెంటర్లు మంజూరు చేసి త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్యం కోసం సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, టీచర్లు లేని ప్రభుత్వ స్కూల్ ఉండవద్దన్న లక్ష్యంతో 50 వేల టీచర్ల పోస్టులు కూడా భర్తీ చేశారని తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు కోరిక మేరకు తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో మరో ఐటిఐ సెంటర్ మంజూరు కోసం సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మందుల సామేలు, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి అత్యధిక నిధులు ముఖ్యమంత్రి ఇచ్చారని తెలిపారు. బునాదిగాని కాల్వ పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆలేరు ఎమ్మెల్యే (ప్రభుత్వ విప్) బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరెకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, అడ్డగూడూరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, అడ్డగూడూర్ సర్పంచ్ పూజారి వనజ, సైదులు, మోత్కూర్ మార్కెట్ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ముసాయిదా ఓటరు జాబితా విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నల్గొండ మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను జనవరి1, గురువారం ఉదయం 11:00 గంటలకు అధికారికంగా విడుదల చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఓటరు జాబితాను మున్సిపల్ కార్యాలయంతో పాటు, నల్గొండ తహసీల్దార్ , జిల్లా కలెక్టర్ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.ఈ ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు,చిరునామా,లేదా ఇతర వివరాలలో ఏవైనా తప్పులు ఉన్నా, లేదా అభ్యంతరాలు ఉన్నా ఈ నెల1 నుండి 5 వరకు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడంలో భాగంగా ఈ ప్రక్రియను చేపడుతున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.పట్టణ ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఓటరు జాబితాను తనిఖీ చేసుకోవాలని ఆయన కోరారు.

# రూ.6 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

## నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్** : నకిరేకల్ పట్టణంలో రూ.6 కోట్లతో సీసీరోడ్లు,డ్రెయినేజీ నిర్మాణాల పనులు చేపడుతున్నట్లు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణాన్ని దశల వారిగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.బుధవారం నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 02,05,10,11,12,20 వార్డుల్లో నూతనంగా చేపట్టనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పట్టణంలోని వివిధ వార్డుల్లో డ్రెయినేజీతో పాటు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశామని ఆయన తెలిపారు.త్వరలో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్‌తో పాటు డయాలసిస్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు త్వరలో శంకుస్థాపనకార్యక్రమాలునిర్వహించనున్నట్లు వెల్లడించారు.గత ప్రభుత్వపదేళ్లపాలనలోరాష్ట్రాన్నిఅప్పులపాలుచేశారని ఆయన విమర్శించారు ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యంగా అమలు చేస్తోందన్నారు. నకిరేకల్ పట్టణంలోని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్నిర్మాణాన్నికూడాత్వరలో ప్రారంభించనున్నట్లుఆయనతెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ చౌగోని రజితశ్రీనివాస్, వైస్ చైర్మన్ మూరారిశెట్టిఉమారాణికృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్ , పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచవెంకటేశ్వరరావు,కౌన్సిలర్లు, రాచకొండ సునీల్ ,గాజుల సుకన్య, చౌగొని అఖిల లక్ష్మణ్, నాబోతు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వాన్ని మరిచిన మాతృత్వం

## మురుగు కాల్వలో మృతిచెందిన పసికందు లభ్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మానవత్వాన్ని మరిచిన ఓ మాతృమూర్తి తనకు జన్మించిన బిడ్డ ఆడ శిశువు అని తెలిసి అభం శుభం తెలియని ఆ నవజాత శిశువును నిర్ధాక్షిణ్యంగా కవర్‌లో కట్టి మురుగు కాల్వలో పడేసిన సంఘటన బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో వెలుగుచూసింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటి కార్మికులు రోజువారి పనుల్లో భాగంగా ఉదయం షాబునగర్‌లో మురుగుకాల్వలను శుభ్రపరుస్తున్న క్రమంలో ఒక కవర్‌లో చుట్టిన పెద్ద వస్తువుగా భావించి మున్సిపల్ కార్మికుడు బయటకు తీశాడు. ఆ సమయంలో కవర్‌లో నుంచి ఒక అవయ వం బయటకు కనపడడంతో అనుమానం వచ్చి కవర్ మొత్తం తీసి చూడగా బొడ్డుతాడు కోయకుండా ఉన్న నవజాత శిశువు మృతదేహం కనిపించింది. వెంటనే ఉన్నతాధికారులకు, పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోని నవజాత శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంత ప్రజలను వివరాలను వివరాలను అడిగి తెలుసుకున్నా రు. ఏమాత్రం దయ దాక్షిణ్యాలు లేకుండా ఆడబిడ్డ అని తెలిసి ఆ నవజాత శిశువును కర్కశకంగా మానవత్వాన్ని మరిచి మురుగు కాల్వలో పడి వేయ డం పట్ల పలువురు కంటతడి పెట్టారు. మృతిచెందిన నవజాత శిశువును పో స్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలిచినట్లు పోలీసులు తెలిపారు.



# శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకతకు సైన్స్‌ఫెయిర్

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత అలాగే పరిశోధన దృక్పదాన్ని పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్ ప్రదర్శన ఉపయోగపడుతుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల పవార్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని వివిఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన 53వ జిల్లాస్థాయి విద్యా, బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025ముగింపు కార్యక్రమంకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తక్కువ వయసులోనే విద్యార్థులు సుస్థిర వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నయం, గ్రీన్ ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీ, వినోద్మాతక గణిత నమూన నిర్మాణం, ఆరోగ్య పరిశుభ్రత, నీటి సంరక్షణ నిర్వహణలో సమస్యలు గుర్తించి నూతన ఆలోచనలతో విన్నూత్న పద్దతిలో సమస్యలను పరిష్కరించడం అభినందనీయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఈ చిన్నారులు ఇప్పుడే మధర్ బోర్డు, సెన్సార్, కోతుల బెడద కోసం పరికరాలను ఉపయోగించి సమస్యల పరిష్కారిస్తున్నారంటే రాబోయే 10 ఏళ్ల తర్వాత వారి నూతన ఆలోచనలతో రోబోటిక్స్‌ను తయారు చేసే విధంగా ఉపాధ్యాయులు వారికి సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం తో 2025 సంవత్సరంతో ముగుస్తుందని, 2026 నూతన సంవత్సరం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉండాలని కోరుకుంటూ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు జూనియర్ విభాగంలో 121, సీనియర్ విభాగంలో 133 మంది, ఇన్స్‌పెయిర్ 64 మంది విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను కలెక్టర్ విక్షించారు ఈలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో టెక్నాలజీపై ఆసక్తి పెరిగి, సమస్య పరిష్కార నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చినవిద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు, ప్రశాంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డిఈవో అశోక్, తహసిల్దార్ కవిత, ఎంపిడివో సుమంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఎంఈవోలు సైదానాయక్, సలీంషరీఫ్, చత్రునాయక్, జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లను ఆకట్టుకున్న చామల


## రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌లకు న్యూ ఇయర్ కానుక

## వినూత్న నిర్ణయంతో ఆకట్టుకున్న చామల కిరణ్ కుమార్ రెడ్డి

## మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తండ్రికి కూడా గ్రీటింగ్స్







**ప్రజాపక్షం/యాదాద్రి** : రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమైన 'ప్రజా పాలన' విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో సర్పంచుల భాగస్వామ్యం ఎంతో కీలకమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సర, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ఆయన తన నియోజకవర్గ పరిధిలో ఒక వినూత్నమైన సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. భువనగిరి లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 968 గ్రామ పంచాయతీల నూతన సర్పంచులకు ఎంపీ స్వీట్ బాక్సులను, గ్రీటింగ్ కార్డులను పంపించారు. సాధారణం గా రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వైరుధ్యాలు సహజం. కానీ ఎంపీ చామల కిరణ్ రెడ్డి పార్టీలకతీతంగా అందరు సర్పంచులను గౌరవించాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ సర్పంచులతో పాటు బిఆర్ఎస్, బిజెపి , స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన వారందరికీ వ్యక్తిగతంగా ఈ కానుకలను చేరవేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా జగదీష్ రెడ్డి తండ్రికి శుభాకాంక్షలు**

బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తండ్రి, నాగారం సర్పంచ్ అయిన గుంటకండ్ల రామ చంద్రారెడ్డికి కూడా ఎంపీ చామల స్వీట్ బాక్స్ పంపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి, పదవిలో ఉన్న ప్రజా ప్రతినిధులను గౌరవించే ఈ సంస్కృతిపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

**తెలంగాణ రైజింగ్లో గ్రామాల పాత్రే కీలకం**

'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలి. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే గ్రామాలు బాగుండాలి. అందుకే రాజకీయాలకు తావు లేకుండా సర్పంచులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.' అని గ్రీటింగ్ కార్డులో ఎంపీ చాముల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

**సర్పంచుల హర్షం..** తమ గ్రామాల అభివృద్ధికి ఎంపీ సహకారం ఉంటుందని భరోసా కల్పించినందుకు, పండుగ వేళ తమను గుర్తుపెట్టుకుని శుభాకాంక్షలు తెలిపినందుకు నూతన సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ స్వీట్ బాక్సుల పంపిణీ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# చండూరులో డిసిసి అధ్యక్షుడికి అవమానం



**ప్రజాపక్షం/చండూరు** : నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాస్ నేతకు బుధవారం చండూరులో తీవ్ర అవమానం జరిగింది. బుధవారం చండూరు మున్సిపాలిటీని అంగడిపేట బిఆర్‌సి ఫంక్షన్ హాల్‌లో నల్లగొండ జిల్లా బిగ్ టీవి స్టాఫ్ రిపోర్టర్ బోయపల్లి రమేష్ తండ్రి బోయపల్లి సురేందర్ దశదిన కార్యక్రమానికి డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత హాజరకాగ కొట్టి సేపట్లోనే శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అక్కగికి రాగ స్వాగతం పలికి వారిని గుర్చోబెట్టారు. ఆసేపటికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అక్కడికి రాగానే అందరూ కలిసి దివంగత సురేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమానికి స్టేజీ ఎక్కే క్రమంలో డిసిసి అధ్యక్షుడిని స్టేజీ మీదికి వెళ్లకుండా అక్కడ ఉన్న సిఐ అడ్డుకున్నారని సమాచారం. స్టేజీ ఎక్కకుండా నన్ను ఎందుకు అడ్డుకుంటున్నారు అని ప్రశ్నించిన సమాధానం చెప్పకుండా ఎదురు ప్రశ్నించడంతో మంత్రి హస్తం ఉన్నట్లు అక్కడ చర్చించుకోవడం జరిగింది. పున్న కైలాస్ నేత డిసిసి అధ్యక్ష పదవి వచ్చినప్పటినుండి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కావాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాడని విమర్శ ఉంది. అక్కడ అవమానించిన పోలీస్‌లపై ఆగ్రహం వ్యక్తం చేసి అక్కడి నుండి వెళ్ళిపోయారు. డిసిసి అధ్యక్షుడిని పోలీసులు అడ్డగించడంపై స్థానిక కాంగ్రేస్ నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత మధ్య ఉన్న ఈ తతంగం ఎటువైపు దారితీస్తుందో వేచిచూడాలి మరి.




# సుదీర్ఘ సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : పోలీసు డిపార్ట్‌మెంట్ నందు సుదీర్ఘకాలం సేవలు అందించడం అభినందనీయమని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ నందు ఏఎస్‌ఐగా పనిచేస్తున్న రాములు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఎస్‌పి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లిష్టమైన పోలీసు ఉద్యోగ విధుల నిర్వహణలో గృహిణిగా భర్తకు సహాయ సహకారాలు అందించడంలో భార్య సేవలు విలువైనవన్నారు. కానిస్టేబుల్‌గా చేరి ఈ స్థాయికి చేరడం, జీవిత ప్రయాణంలో సంపూర్ణ సంతోషకరమైన ఉన్నత కుటుంబాన్ని ఏర్పాటు చేసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, ఏఆర్ అదనపు ఎస్‌పి జనార్థన్ రెడ్డి, ఏఓ మంజుభార్గవి, డిఎస్‌పి నరసింహ చారి పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం పోలీస్ స్టేషన్ నందు పని చేస్తూ కానిస్టేబుల్ కమలాకర్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల అకాలంగా మృతి చెందగా పోలీసు చేయూత పథకం ద్వారా కమలాకర్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల చెక్కును జిల్లా ఎస్‌పి కె నరసింహ జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అందించారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కొత్త ఉపాధి చట్టం రద్దు చేయండి:మోదీకి సిద్ధరామయ్య లేఖ

**బెంగళూరు:** ఉపాధి హామీ చట్టం స్థానంలో ప్రవేశపెట్టిన వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య డిమాండ్ చేశారు. కొత్త చట్టం ఉపాధి హక్కును హరించి వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని నిలిపివేయాలని కోరుతూ మంగళవారం ప్రధాని మోదీకి ఆయన లేఖ రాశారు. కొత్త చట్టం ఉపాధి హామీ చట్టాన్ని బలహీన పరుస్తుందని, సహకార సమాఖ్య విధానాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ కుటుంబాలకు కీలకమైన జీవనోపాధి భద్రతా వలయంగా పనిచేసిన డిమాండ్‌ఆధారిత, హక్కులఆధారిత అర్హతను కొత్త చట్టం నిర్వీర్యం చేస్తుందని అన్నారు. వీబీజీ రామ్ జీ చట్టం ఉపాధి హామీ చట్టం ఉద్దేశాన్ని దెబ్బతీస్తుందని లేఖలో పేర్కొన్నారు.

### సంఘసంస్కర్త శ్రీ నారాయణగురు ఫిలాసఫీ హైజాక్‌కు...
## కొందరు స్వార్థపరుల ప్రయత్నాలు

- కేరళ సిఎం పినరయి విజయన్ హెచ్చరిక
- వర్కలలో 93వ శివగిరి యాత్రికుల సమ్మేళన ప్రారంభించిన అనంతరం కీలక ప్రసంగం



**వర్కల (కేరళ):** సాధువు, సంఘ సంస్కర్త శ్రీ నారాయణ గురు తత్వాలను వక్రీకరించి హైజాక్ చేసేందుకు కొంతమంది స్వార్థపరులు చేసే ప్రయత్నాల గురించి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హెచ్చరించారు. నారాయణ గురును ఒక నిర్దిష్ట మతం లేదా సమాజం పరిధుల్లోకి పరిమితం చేయడానికి చేస్తున్న ఇటువంటి ప్రయత్నాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. బుధవారం ఇక్కడి వర్కలలో నారాయణ గురు స్థాపించిన శివగిరి మఠంలో 93వ శివగిరి యాత్రికుల సమ్మేళనాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడారు. నారాయణగురు తత్వాన్ని హైజాక్ చేయడానికి కొన్ని శక్తులు చేస్తున్న ప్రయత్నాలపట్ల ఆందోళనల మధ్య ఈ విధమైన శివగిరి యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నారాయణగురును ఏదైనా ఒక కులం లేదా మతం పరిధుల్లో బంధించే రహస్య ప్రయత్నాలపట్ల మనం అప్రమత్తంగా ఉండాలన్నారు. కులం, మతపరమైన అంశాలకు అతీతంగా మానవ ఐక్యత, సోదరభావం, స్నేహం మార్గాన్ని మానవాళికి చూపించిన నిజమైన ప్రపంచ గురువు శ్రీ నారాయణ గురు అని ఆయన చెప్పారు. గురును ఆధ్యాత్మిక ప్రకాశంగా అభివర్ణించిన ముఖ్యమంత్రి విజయన్ ఆయన తాత్వాక గొప్పతనం యావత్ ప్రపంచ విముక్తికి దార్శనికతను అందించిందన్నారు. నారాయణగురు దార్శనికత ఆధునిక కేరళ నిర్మాణంపై తీవ్ర ప్రభావాన్ని చూపించిందన్నారు. వివిధ కుల, మత, సమూహాల విచ్చిన్న సమీకరణ ప్రజాస్వామ్య, లౌకిక ఆదర్శాలను బలహీనపరుస్తుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. దేశ రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి నారాయణ గురు సందేశాన్ని ప్రగతిశీల శక్తుల దృఢంగా అనుసంధానించాలని అవసరాన్ని కూడా సిఎం పినరయి విజయన్ నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యం, సామాజిక రాజ్యాంగ చట్టం మనుగడ గురు బోధనలను సమానత్వాన్ని సమర్థించే రాజీలేని ప్రగతిశీల ఆదర్శాలతో సమన్వయం చేయడంపై ఆధారపడి ఉంటుందన్నారు. శ్రీ నారాయణ గురు బోధనలలో పాతుకుపోయిన ప్రజాస్వామ్య లౌకిక సంప్రదాయాలను బలోపేతం చేయడానికి, గుర్తింపు ఆధారంగా ప్రజలను విభజించే ప్రయత్నాన్ని నిరోధించడానికి సమిష్టి కృషి చేయాలని విజయన్ పిలుపునిచ్చారు. గురువు ఆదర్శాల ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్యులుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, ఎస్ఎన్‌డిపి యోగం జనరల్ సెక్రటరీ వెల్లప్పల్లి నటేశన్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆరావళిపై స్వతంత్ర కమిటీ వేయాలి

- ❑ గనుల తవ్వకాలు పూర్తిగా నిలిపివేయాలి
- ❑ కేంద్రమంత్రి భూపేందర్ రాజీనామా చేయాలి
- ❑ ఎఐకెఎస్ డిమాండ్



**న్యూఢిల్లీ:** ఆరావళి పర్వతశ్రేణుల రక్షణకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వ జోక్యం లేని ఒక స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయాలని, ఈ పర్వతశ్రేణుల్లో పూర్తిగా అన్ని రకాల తవ్వకాలను నిలిపివేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. కార్పొరేట్ శక్తులను పెంచిపోషించేందుకు న్యాయస్థానాన్ని తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేసిన కేంద్ర పర్యావరణ,అటవీ,వాతావరణ మార్పులశాఖామంత్రి భూపేందర్ యాదవ్ నైతిక బాధ్యత వహించి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఈ పర్వతశ్రేణుల్లో జీవావరణ సమతుల్యాన్ని సంరక్షించాలని కోరింది. రాజీలేని నాలుగు డిమాండ్ల సాధనకోసం తదుపరి పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపు ఇచ్చింది. ఇకమీదట ఈ విషయంలో ప్రభుత్వ వివరణలకు, ప్రభుత్వ కమిటీలకు కాలం చెల్లిందని, ఇప్పుడు ఒక నిర్ణయాత్మకమైన కార్యాచరణకు సమయం ఆసన్నమైందని ఎఐకెఎస్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీర్‌సాగర్, రావుల వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అందువల్ల రాజీలేని ఈ డిమాండ్ల సాధనకోసం అన్ని రైతు సంఘాలు, పౌర సంఘాల వేదికలు, పర్యావరణవేత్తలు తదుపరి ఆందోళనను మరింత ఉద్ధృతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఆరావళీపర్వతశ్రేణులకోసం జరిగే పోరాటం అంటే రైతుల సాగునీటి భద్రత కోసం ఒక భరోసా పొందడమేననీ, ఈ పర్వతశ్రేణుల ద్వారా జీవనాధార మద్దతుపొందే ప్రజల కోసం, జాతి పర్యావరణ భవిష్యత్‌కోసం చేసే పోరాటమేనని వారు ప్రకటించారు. ఆరావళీ పర్వతశ్రేణుల కోసం పాటుపడే అన్ని పర్యావరణ పరిరక్షణ గ్రూపులు, పౌరుల పక్షాన అఖిలభారత కిసాన్ సభ ఐక్యంగా నిలబడుతుందని తెలియజేశారు. గనుల తవ్వకం ప్రయోజనాలకోసం బొబ్బలుపెట్టే వారికి వ్యతిరేకంగా దీనివల్ల నష్టపోయే రాష్ట్రాలలో ఉన్న రైతు సంఘాల సభ్యులను సమీకరిస్తామని, ఆరావళీ పర్వతశ్రేణులను శాశ్వత ప్రాతిపదికపై సమగ్రంగా సంరక్షించడం తప్ప మరో అంశాన్ని అఖిల భారత కిసాన్ సభ సమ్మతించేదిలేదని వారు తెగేసి చెప్పారు. ఈ ప్రకటన ఇంకా ఈ క్రింది విధంగా ఉంది.''ప్రభుత్వ ప్రభావం లేని ఒక ఉన్నతస్థాయి అధికారాలుగల స్వతంత్ర కమిటీని ఆరావళీ పర్వతశ్రేణుల దర్యాప్తు, సమీక్షకోసం ఏర్పాటు చేయాలి. గుర్తింపు పొందిన స్వతంత్ర జీవావరణ,పర్యావరణవేత్తలు, భూగర్భవేత్తలు,ప్రజా ఉద్యమాలకు చెందిన ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, అటవీ, అటవీప్రాంత జాతుల ప్రతినిధులు ఈ కమిటీలో సభ్యులుగా ఉండాలి. ప్రభుత్వంలో ఉన్న కార్యనిర్వాహకవర్గీయులు,అధికారగణం లేదా ప్రభుత్వ సంబంధిత నిపుణులకు ఈ కమిటీలో ఆస్కారం ఇవ్వకూడదు, ఈ కమిటీలో జరిగే సంప్రదింపులు, సంభాషణలన్నీ బాహాటంగా అందరికీ అందుబాటులో ఉండాలి, ప్రజలు వాటిని పరిశీలించి సమీక్షించేందుకు వీలుగా ఈ సంప్రదింపులు ఉండాలి.2. ఆరావళీ పర్వతశ్రేణుల్లో జరుగుతున్న అన్ని రకాల తవ్వకాల కార్యకలాపాలను పూర్తిస్థాయిలో నిలిపివేయాలి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ డిసెంబరు 25 వ తేదీన కేవలం కొత్తగా ఎలాంటి గనుల తవ్వకాలు చేపట్టేందుకు లీజుల అనుమతులు రద్దు చేస్తూ మాత్రమే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యలు ఎంతమాత్రం సరిపోవు. దానికి బదులుగా కొత్త–పాత సహా ప్రస్తుతం కొనసాగుతున్న అన్ని తవ్వకాలు పూర్తిస్థాయిలో నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మేం డిమాండ్ చేస్తున్నాం. ఈ పూర్తిస్థాయి నిలిపివేత ఆరావళీ పర్వతశ్రేణులు విస్తరించి ఉన్న రాజస్థాన్, గుజరాత్, హర్యానా,ఢిల్లీ అన్ని రాష్ట్రాలలో ఉన్న ప్రాంతాలకూ వర్తించాలి. సుప్రీంకోర్టు విచారణ పూర్తిచేసి పర్యావరణ, జీవావరణ సమతుల్యంపై నిర్వచనాన్ని నిర్ధారించి తుది తీర్పు వెలువడేవరకూ ఈ నిలిపివేత చర్యలు కొనసాగాలి. న్యాయస్థానం కూడా ప్రభుత్వం వైపు నుండి తీసుకునే అరకొర చర్యలు, నిర్లక్ష్యపు చర్యల గురించి ఆందోళన వ్యక్తం చేసింది.3. కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ నైతిక బాధ్యత వహించి తన పదవికి వెంటనే రాజీనామా చేయాలి. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు కాపాడటంకోసం ఆయన వాదనలతో ప్రజలను న్యాయస్థానాన్ని కూడా తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేశారు. అందువల్ల ఆయన నైతిక బాధ్యతతో రాజీనామా చేయాలి. ఆయన అధికారంలో కొనసాగే నైతికత కోల్పోయారు. స్వప్రయోజనాలకోసం చేతులు కలిపే మంత్రిత్వ శాఖ ఆరావళీ పర్వతాలకు భరోసా ఇవ్వలేదు.4.ఆరావళీ పర్వతశ్రేణులను ఒక అజరామరమైన జీవావరణ,పర్యావరణ వ్యవస్థగా గుర్తించేవిధంగా ఒక అనివార్యమైన నిర్వచనం ఇవ్వాలి. ఎందుకంటే కొన్ని కోట్ల సంవత్సరాలుగా ఈ పర్వతశ్రేణులు జీవ వ్యవస్థను కాపాడే రక్షణ వలయంగా ఉన్నాయి.డిసెంబరు 29వ తేదీన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకోసం పోరాటం చేసిన ప్రజలు, పౌర సమాజానికి ఎఐకెఎస్ అభినందనలు తెలియజేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ కమిటీ ఇచ్చిన నివేదికను సమర్థిస్తూ సుప్రీంకోర్టుతొలు ఇచ్చిన తన ఉత్తర్వులను తానే నిలిపివేసింది. కోర్టు ఈ విధంగా దిద్దుబాటు చర్య తీసుకోవడాన్ని ఎఐకెఎస్ స్వాగతిస్తున్నది. ఒక ఉన్నతస్థాయి అధికారాలుగల కమిటీ ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. నాలుగు రాష్ట్రాలలో 670 కి.మీ మేరకు విస్తరించిన ఉన్న ఆరావళీ పర్వతశ్రేణులు కేవలం పర్వతాలు మాత్రమే కాదు, థార్ ఎడారిని తూర్పువైపు విస్తరించకుండా అడ్డుకుంటూ 200 కోట్ల సంవత్సరాలుగా నిలిచిఉన్న భూభౌతిక రక్షణ కవచం, దీనివల్ల కీలకమైన నీటి వనరులు తిరిగి సమృద్ధిగా ఏర్పడానికి అవకాశం కలుగుతోంది, కోట్లాది మంది ప్రజలకు ఆరావళీ పర్వతశ్రేణులు ఒక హరితరక్షణ కవచం. కేవలం 100 మీటర్లు ఎత్తు ఉన్న వాటినే పర్వతాలుగా గుర్తించే పూర్వపు నిబంధన ప్రమాదకరమైనది. అందరినీ తప్పుతోవ పట్టించేది, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేరుస్తుంది. ప్రజా ప్రయోజనాలు దీనివల్ల నెరవేరవు. సుప్రీంకోర్టు న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా నిపుణతతో తన అభిప్రాయాన్ని ప్రకటించింది, గతానుభవాల దృష్ట్యా ప్రభుత్వం నిపుణుల కమిటీలను, వాటి నివేదికలను తనకు అనుకూలంగా మలచుకునే ప్రమాదం ఉంది, అందువల్ల స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయాలి'' అని ఎఐకెఎస్ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

### మారని తీరు
## వర్సిటీ సవరణ బిల్లు వెనక్కి పంపిన రాష్ట్రపతి

**చెన్నై:** విమర్శలు వెల్లువెత్తినా... సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రపతి, గవర్నర్ల తీరు మాత్రం మారడం లేదు. రాష్ట్ర అసెంబ్లీలు పంపిన బిల్లులు సకాలంలో ఆమోదించడానికి బదులు ఏళ్ల తరబడి తమ ఉంచుకొని...చివరికి వెనక్కి పంపడం పరిపాటిగా మారింది. తాజాగా తమిళనాడు ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును రాష్ట్రపతి వెనక్కి పంపారు. స్టాలిన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన మద్రాస్ యూనివర్సిటీ సవరణ బిల్లును రాష్ట్రపతి భవన్ మంగళవారం వెనక్కి పంపింది. మూడేళ్లుగా రాష్ట్రపతి వద్ద ఈ బిల్లు పెండింగ్‌లోనే ఉన్నది. మద్రాస్ యూనివర్సిటీ చట్టం 1923 ప్రకారం తమిళనాడు గవర్నర్ యూనివర్సిటీకి ఎక్స్‌అఫీషియో చాన్సలర్. వైస్ చాన్సలర్ నియామకం, తొలగింపు తదితర హక్కులు గవర్నర్ వద్దే ఉన్నాయి. అయితే... తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవితో స్టాలిన్ సర్కార్‌కు పొసగడం లేదు. గవర్నర్ వల్లే తమిళనాడులో వర్సిటీల వీసీ నియామకాలు నిలిచిపోయాయని ప్రభుత్వం తరచూ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో మద్రాస్ వర్సిటీ బిల్లు ద్వారా గవర్నర్ అధికారాలకు చెక్ పెట్టాలని స్టాలిన్ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వైస్ చాన్సలర్‌ను నియమించుకునే అధికారం పొందడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలకు అనుగుణంగా యూనివర్సిటీ పాలనను మార్చడం, అలాగే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీని యూనివర్సిటీ సిండికేట్‌లో సభ్యుడిగా చేర్చడం తదితర అంశాలను బిల్లులో తమిళనాడు ప్రభుత్వం పొందుపరిచింది. ఈ బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపగా... మూడేళ్ల తర్వాత ఇప్పుడు రాష్ట్రపతి ముర్ము ఈ బిల్లును ఆమోదించకుండానే తిరిగి పంపించారు.

## భారీ ఉగ్రకుట్ర భగ్నం
### 150 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

**జైపూర్:** భారీ ఉగ్రకుట్రను రాజస్థాన్ పోలీసులు భగ్నం చేశారు. 150 కిలోల పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నూతన సంవత్సరం వేళ రాజస్థాన్‌లో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు లభ్యం కావడం కలకలం రేపింది. ఓ కారులో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఇతర పేలుడు పదార్థాలు తరలిస్తుండగా పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. ఓ కారులో నిందితులు పేలుడు పదార్థాలు తరలిస్తున్నట్లు టోంక్ జిల్లా పోలీసులకు నిఘావర్గాల నుంచి సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బరోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అనుమానాస్పద కారులో తనిఖీలు నిర్వహించామని, వాహనంలో యూరియా సంచుల్లో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్ నింపి ఉంచినట్లు గుర్తించామన్నారు. అదేవిధంగా 200 కాట్రిడ్జ్‌లు, ఆరు కట్టల (1,100 మీటర్లు) సేఫ్టీ ఫ్యూజ్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిని బూందీ జిల్లాకు చెందిన సురేంద్ర పట్వా, సురేంద్ర మోచీగా గుర్తించారు. ఈ పేలుడు పదార్థాలను బూందీ నుంచి టోంక్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పేలుడు పదార్థాలను ఎక్కడినుంచి సేకరించారు? చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వినియోగించాలనుకున్నారా? తదితర వివరాలు రాబట్టే దిశగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తం

**శ్రీనగర్:** కొత్త ఏడాది వేడుకల నేపథ్యంలో దేశంలో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. దిల్లీ నుంచి కన్యాకుమారి వరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచారు. ఎలాంటి ఉగ్రదాడులు జరగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు పెంచారు. వివిధ చోట్లు ఆయా సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి స్థానిక పోలీసులు, ఆర్మీ దళాలు కలిసి వాహనాల తనిఖీలు చేపట్టాయి. ఎముకలు కొరికే ప్రాంతం దోడాలోని భలేసా అనే ఎత్తైన ప్రదేశాల్లో సైతం భద్రతను బలగాలు కట్టుదిట్టం చేశాయి. సరిహద్దుల వెంబడి ఉగ్రవాదుల చొరబాటును నిలువరించేందుకు డేఘ కన్నులతో పహరా కాస్తున్నారు. దోడాలోని గడ్డకట్టిన అడవులు, దాచిన్ పర్వత గుహలలో దళాలు గస్తీకాస్తున్నాయి.

## కళ్లల్లో కారం కొట్టి రూ.25 లక్షల దోపిడీ

**భోపాల్:** మధ్యప్రదేశ్‌లోని అశోక్ నగర్ జిల్లా తమోయియా చక్ గ్రామంలో దొంగలు దారి కాచి ఓ రైతు కళ్లల్లో కారం కొట్టి అతడి నుంచి రూ.25లక్షలు దోచుకున్నారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. లఖ్వీందర్ (47) అనే రైతు అశోక్‌నగర్‌లోని బంధువుకు ఇవ్వడానికి రూ.25 లక్షలు తీసుకొని ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయల్దేరాడు. మార్గంమధ్యలో ముగ్గురు దొంగలు రైతును అడ్డగించారు. తమ వెంట తెచ్చుకున్న కారం లిఖ్వీందర్ కళ్లలో కొట్టి అతడి వద్ద ఉన్న రూ.25 లక్షల నగదు బ్యాగును తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. తమోయియా చక్‌మోహ్రి గ్రామాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్దిసేపటికి తేరుకున్న రైతు... పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వివేక్ శర్మ తెలిపారు.

# గిగ్ వర్కర్లకు గుడ్ న్యూస్

- ఆహార డెలివరీ ప్లాట్‌ఫారమ్‌లు జొమాటో, స్విగ్గీలు డెలివరీ భాగస్వాములకు అదనపు ప్రోత్సాహకాలు




**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా గిగ్ వర్కర్ల ఐక్యత సత్ఫలితాలనిచ్చింది. కొత్త సంవత్సరం సందర్భంగా గిగ్ వర్కర్ల యూనియన్లు పిలుపునిచ్చిన సమ్మె నేపథ్యంలో సేవల్లో అంతరాయం కలగకుండా ఉండేందుకు, ఆహార డెలివరీ ప్లాట్‌ఫారమ్‌లు జొమాటో, స్విగ్గీ తమ డెలివరీ భాగస్వాములకు అదనపు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. పండుగ కాలాల్లో ఇది సాధారణంగా అనుసరించే విధానమే. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్‌బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్‌ఎటి) ప్రకారం, మెరుగైన పారితోషికాలు, మెరుగైన పని పరిస్థితుల కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనున్నారని పేర్కొన్నారు. డిమాండ్ అత్యధికంగా ఉండే న్యూ ఇయర్ ఈవ్ రోజున, జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్, జెప్టో వంటి ఆహార డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థల కార్యకలాపాలపై ఈ సమ్మె ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. న్యూ ఇయర్ ఈవ్, డిసెంబర్ 31, సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పీక్ అవర్స్‌లో ఒక్కో ఆర్డర్‌కు రూ.120 నుంచి రూ.150 వరకు చెల్లింపులు ఇవ్వనున్నట్లు జొమాటో ప్రకటించింది. ఆర్డర్ పరిమాణం మరియు కార్మికుల లభ్యత ఆధారంగా ఆ రోజంతా కలిపి గరిష్ఠంగా రూ.3,000 వరకు సంపాదించవచ్చని కూడా హామీ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.అదనంగా, ఆర్డర్ తిరస్కరణలు, రద్దులపై విధించే జరిమానాలను తాత్కాలికంగా మాఫీ చేసినట్లు వారు తెలిపారు. ఇది అధిక డిమాండ్ ఉన్న పండుగలు, సంవత్సరం చివరి కాలాల్లో సాధారణంగా అనుసరించే ప్రామాణిక విధానమేనని స్పష్టం చేశారు. 'పండుగ కాలాల్లో డిమాండ్ పెరిగి, ఆదాయ అవకాశాలు అధికంగా ఉండే సందర్భాల్లో ప్రతి సంవత్సరం మేము అనుసరించే సాధారణ ఆపరేటింగ్ ప్రోటోకాల్‌లో ఇది భాగం' అని ఈటర్నల్ సంస్థ ప్రతినిధి పిటిఐకి తెలిపారు. ఈటర్నల్ సంస్థకు జొమాటో, బ్లింకిట్ బ్రాండ్లు ఉన్నాయి. అదే విధంగా, స్విగ్గీ కూడా సంవత్సరం చివరి కాలంలో ప్రోత్సాహకాలను పెంచింది. డిసెంబర్ 31 మరియు జనవరి 1 తేదీల్లో కలిపి డెలివరీ కార్మికులు గరిష్ఠంగా రూ.10,000 వరకు సంపాదించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. న్యూ ఇయర్ ఈవ్ ఆరు గంటల పీక్ పీరియడ్‌లో గరిష్ఠంగా రూ.2,000 వరకు సంపాదించవచ్చని స్విగ్గీ ప్రచారం చేస్తోంది. సంవత్సరంలో అత్యంత రద్దీగా ఉండే ఈ సమయంలో సరిపడా రైడర్లు అందుబాటులో ఉండేలా చూడడమే లక్ష్యమని, ఇలాంటి కాలాల్లో అధిక చెల్లింపులు ఇవ్వడం సాధారణ ప్రక్రియేనని వారు పేర్కొన్నారు. కాగా, టిజిపిడబ్ల్యుయు, ఐఎఫ్‌ఎటి సంయుక్త ప్రకటనలో, నిన్న రాత్రి వరకు భారతదేశవ్యాప్తంగా 1.7 లక్షలకుపైగా డెలివరీ, యాప్‌ఆధారిత కార్మికులు సమ్మెలో పాల్గొనను న్నట్లు ధృవీకరించారు. సాయంత్రం నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది అని తెలిపారు. ఇదిలా ఉండగా, డిసెంబర్ గిగ్ వర్కర్లు డిసెంబర్ 25న జరిగిన భారీ సమ్మె తరువాత, తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల్లో వేలాది మంది డెలివరీ కార్మికులు ప్లాట్‌ఫారమ్‌ల నుంచి లాగ్ ఆఫ్ కావడంతో — డిసెంబర్ 31, 2025న దేశవ్యాప్తంగా మరింత ఉద్ధృతమైన సమ్మెకు గిగ్ కార్మికులు పిలుపునిచ్చినట్లు టిజిపిడబ్ల్యుయు, ఐఎఫ్‌ఎటి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. 'ఈ నిరసన కార్యక్రమం చేపట్టినప్పుడు కంపెనీలు స్పందించలేదు. కార్మికులతో చర్చలు లేవు. భద్రత లేదా పని గంటలపై స్పష్టమైన హామీలు లేవు. ఈ నిర్లక్ష్య ధోరణే నేటి సమ్మెను తప్పనిసరిగా మారింది' అని ప్రకటనలో పేర్కొన్నారు. గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ డిసెంబర్ 31న దేశవ్యాప్త సమ్మెను ప్రకటించింది. భారతదేశవ్యాప్తంగా గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ కార్మికుల హక్కులు, సంక్షేమం, గౌరవానికి సంబంధించిన డిమాండ్లను సమిష్టిగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపింది. దీనితో కంపెనీలు కీలక ప్రకటన విడుదల చేయక తప్పలేదు.

## ఒక్కరోజే 2,122 నామినేషన్లు

**ముంబయి:** బృహన్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలకు మొత్తం 2,516 నామినేషన్‌లు వచ్చాయని అధికారులు బుధవారం తెలిపారు. ఈ నెల 29 వరకు 400 నామినేషన్లు రాగా, నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన 30న అత్యధికంగా 2,122 నామినేషన్ పత్రాలు వచ్చాయని వివరించారు. 227 ఎలక్టోరల్ వార్డులు ఉన్న బీఎంసీకి జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. మరుసటి రోజు ఓట్ల లెక్కింపు జరగనుంది. నామినేషన్ దాఖలు ప్రక్రియ ఈ నెల 23న ప్రారంభమై 30న ముగిసింది. మొత్తం 2,516 నామినేషన్లు దాఖలయ్యాయి. గోవండి, డియోనార్, చెంబూర్, ట్రాంబే, మాన్‌కుర్ద్, అనిక్ ప్రాంతాలను కలిగి ఉన్న ఎంఈస్ట్ వార్డ్‌లో అత్యధికంగా 183 నామినేషన్లు వచ్చాయని అన్నారు. ఈ నెల 30 వరకు మొత్తం 11,391 నామినేషన్ ఫారాలు (ఏ,బీ ఫారాలు) పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

### శ్మశానవాటికలోనే నామినేషన్ పత్రాలు అందజేత

ఇదిలా ఉండగా... ఒక రాజకీయ పార్టీ నేత తల్లి మరణించడంతో అంత్యక్రియల కోసం శ్మశానవాటికలో ఉన్న ఆయనకు నామినేషన్ పత్రాలు అందజేసింది. ఈ సంఘటన మహారాష్ట్రలో జరిగింది. ఆ రాష్ట్రంలో 29 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగనున్నాయి. కాగా, ఏక్‌నాథ్ షిండే నేతత్వంలోని శివసేన, నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పోటీ చేసే అభ్యర్థిగా యోగేష్ గొన్నాడేను చివరి నిమిషంలో ఖరారు చేసింది. అయితే ఆయన తల్లి మరణించడంతో మంగళవారం స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సాయంత్రం 3 గంటలకు నామినేషన్ గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో నామినేషన్ దాఖలుకు సంబంధించిన ఏబీ ఫారమ్‌ను పార్టీ నేతలతో శ్మశానవాటికకు పంపింది. అక్కడ తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న యోగేష్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. దీంతో తల్లి అంత్యక్రియల అనంతరం ఆయన చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేశారు. నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఐదో వార్డు అభ్యర్థిగా యోగేష్ గొన్నాడేను షిండే శివసేన పార్టీ నామినేట్ చేసింది.ఆయన కుమార్తె కతికను కూడా ఎనిమిదో వార్డు నుంచి ఎన్నికల బరిలోకి దించింది.

# విఐకి భారీ ఉపశమనం

- ❑ రూ.87,695 కోట్ల ఎజిఆర్ బకాయిలు ఫ్రీజ్
- ❑ మహారాష్ట్రలో ఆరు లేన్ల కారిడార్‌కు రూ.19,142 కోట్లు
- ❑ ఒడిశాలో హైవేల విస్తరణ ప్రాజెక్టు కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** అప్పుల ఊబిలో కూరుకుపోయిన టెలికాం కంపెనీ వొడాఫోన్‌ఐడియా(వీఐ)కు కేంద్ర కేబినెట్ భారీ ఊరట కల్పించింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాలకు (ఎజిఆర్) సంబంధించి రూ.87,695 కోట్ల బకాయిలు ఫ్రీజ్ చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని 2032–41 మధ్య చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం భేటీ అయింది. రూ.19,142 కోట్లతో మహారాష్ట్రలో ఆరులేన్ల నాసిక్ సోలాపూర్ అక్కల్కోట్ కారిడార్ నిర్మాణానికి ఆమోతం తెలిపింది. ఒడిశాలో హైవేల విస్తరణ ప్రాజెక్టుకు అంగీకరించింది. వోడాఫోన్‌ఐడియా (వీఐ)కు ఊరట కల్పిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ మొత్తాన్ని ఆ టెలికాం సంస్థ ఇప్పటికిప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ మద్దతు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వొడాఫోన్ ఐడియాకు ఇది భారీ ఊరట. మారటోరియం పీరియడ్‌కుగాను బకాయిలపైనా వొడాఫోన్ ఐడియా వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా నిలుపుదల చేసిన బకాయిలను టెలికాం విభాగం పునః మదింపు చేస్తుంది. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఏజీఆర్ బకాయిలు మాత్రం 2025–26 నుంచి 2030–31 మధ్య యథాతథంగా చెల్లించాల్సి ఉంటుంది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. దీంతో పాటు 20 కోట్ల మంది చందాదారులు ఈ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నారు. వారి ప్రయోజనాలు, టెలికాం రంగంలో పోటీ ఉండాలన్న ఉద్దేశంతో కేబినెట్ ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ శుభవార్త ఉంటుందని మదుపర్లు ముందుగానే ఊహించారు. దీంతో బుధవారం వొడాఫోన్ ఐడియా షేర్లు 4 శాతం మేర పెరిగి రూ.12.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా నిర్ణయం వెలువడకపోవడంతో ఒక్కసారిగా పతనమయ్యాయి. మొత్తం బకాయిల్లో కనీసం సగమైనా ప్రభుత్వం రద్దు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. అంచనాలకు అనుగుణంగా నిర్ణయాలు లేకపోవడంతో కేబినెట్ నిర్ణయం వెలువడిన వెంటనే వీఐ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రూ.19,142 కోట్లతో మహారాష్ట్రలో నాసిక్ సోలాపూర్ అక్కాల్కోట్‌ను కలుపుతూ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణానికి కేబినెట్ అంగీకరించిందన్నారు. బీఓటీ (టోల్) మోడ్‌తో 374 కిమీల ఈ ప్రాజెక్టు నాసిక్, అఖిల్యానగర్, సోలాపూర్‌ను కర్నూల్ (ఏపీ)తో అనుసంధానం చేస్తుందని తెలిపారు. నాసిక్ నుంచి అక్కల్కోట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ను వధావన్ పోర్టు ఇంటర్‌చేంజ్ వద్ద దిల్లీముంబై ఎక్స్‌ప్రెస్‌ను కలిపే విధంగా ప్రతిపాదన చేశారు. నాసిక్ వద్ద ఆగ్రాముంబై కారిడార్‌ను ఎన్‌హెచ్ 60 (అడెగావ్) వద్ద జంక్షన్‌తో... నాసిక్ సమీపంలో పంగ్రీ వద్ద సమృద్ధి మహామార్గ్‌ను అనుసంధానం చేసేదిగా ఈ ప్రాజెక్టు ఉంటుంది. వెస్ట్‌కోస్ట్ నుంచి ఈస్ట్ కోస్ట్ వరకు అనుసంధానికి ఈ ప్రతిపాదన చేసినట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది.చెన్నై నుంచి హోసాపూర్ (ఎంహెచ్ బార్డర్) వరకు తిరువల్లూర్, రేణిగుంటా, కడప, కర్నూలు (700 కిమీల పొడవైన) మీదుగా నాలుగు లేన్ల కారిడార్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపింది. మహారాష్ట్రలో ఆరులేన్ల కారిడార్ పూర్తైతే ప్రయాణ సమయం 31 గంటల నుంచి 17 గంటలకు తగ్గుతుందని ప్రకటన పేర్కొంది.





## PUBLIC NOTICE

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, అచ్చంపేట పరిధిలోని యూసెఫ్ పంతులు పాస్టర్ గారికి సంబంధించిన దేవుని భూమి సర్వే నెం. 293, విస్తీర్ణము ఎ.4.32గుంటలు, దీనిని రక్షించుటకు సుమారు 13 సంవత్సరాలు పవర్ ఆఫ్ ఆటర్నీగా బాధ్యతలు స్వీకరించి అచ్చంపేట ప్రజల సేవ గురించి నిరంతర పోరాటం చేయటం జరుగుచున్నది. ఐతే కొన్ని శక్తులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైన కారణంగా అన్యాక్రాంత దిశగా పయణించుచున్నందున పట్టాదారు యూసెఫ్ పంతులు పాస్టర్ గారి వారసులను ఇట్టి భూమిని రక్షించుకొనుటకు తక్షణమే హైకోర్టులో పోటీచేయుటకు రావాలని తేది. 5-11-2024 నాడు నమస్తే తెలంగాణ దినపత్రికలో పబ్లిక్ నోటీస్ ద్వారా ఆహ్వానించుచూ హెచ్చరించడం జరిగింది. కాని దురదృష్టవశాత్తు సుమారు ఒక సంవత్సరం గడిచినా వారి నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఇట్టి మొత్తము వ్యవహారము అచ్చంపేట ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఇట్టి భూమిని రక్షించుకొనే ప్రక్రియ వివిధ జాతీయ అత్యున్నత ప్రమాణం గల మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్ ఆధ్వర్యంలో జరగడం వలన ఇట్టి కార్యము ప్రజా ప్రయోజన వ్యాజ్యముగా రూపుదిద్దుకోవడం జరిగినది.

ఇట్టి ఉన్నతమైన పక్రియలో భాగంగా సర్వేనెం. 293కు సంబంధించిన ముఖ్యమైన లింక్ డాక్యుమెంట్ (సేల్ డీడ్) వాస్తవికత (జెన్యూనిటీ) విషయములో డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ వారి మెమో నెం. ఆర్.టి.ఐ./387/2025 తేదీ 26-5-2025 ఆదేశానుసారము జిల్లా రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఇచ్చిన సమాచారము ఆశ్చర్యకరమైన మరియు గందరగోళంగా ఉండడంతో దీనిని అన్ని కోణాలలో పరీక్ష చేయుటకు ఫోరెన్సిక్ ప్రోసెస్లో పెట్టడం జరిగినది. ఇట్టి ప్రక్రియ పూర్తైన తక్షణమే స్పష్టమైన ఆధారాలతో ఇట్టి డాక్యుమెంట్ ఆధారిత ప్రోసీడింగ్, పట్టా పాస్బుక్ మరియు ఇతరత్రా లావాదేవీలను మొత్తం రద్దు చేయుటకు గౌరవ న్యాయస్థానాన్ని అభ్యర్థించటం జరుగుతుంది.

ఇట్టి భూమికి సంబంధించిన గోప్యంగా ఉంచబడిన ప్రోసీడింగ్ విషయంలో కేస్ నెం. 6638/ఎస్.ఐ.సి.-2/సి/2024 తేది 8-10-2024 రాష్ట్ర సమాచార కమీషన్లో నడుచుచున్నది. ఇట్టి భూమి సర్వే నెంబర్ 293కు సంబంధించిన రికార్డు గానీ, ప్రోసీడింగ్ గానీ తమ వద్ద లేవని లెటర్ ఎఫ్/345/2025 తేదీ. 14-11-2025 ద్వారా సంబంధిత రెవెన్యూ అధికారులు మోసపూరితమైన తప్పుడు సమాచారము ఇవ్వడం వలన ఇట్టి అధికారులను తక్షణమే షోకాస్ నోటీసు జారీ చేసి చట్టపరమైన తీవ్రచర్యలు తీసుకోవాలని 27-12-2025నాడు రాష్ట్ర సమాచార కమీషన్కు అభ్యర్థించడం జరిగినది. నేరము తీవ్రతను బట్టి వీరిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు చేపట్టే ఆస్కారం ఉన్నది. అదేవిధంగా ఇట్టి భూమి సర్వే నెం. 293 విషయంలో ఆర్.డి.ఓ. ప్రోసీడింగ్ నెం. ఇ/608/2007, తేది 6-6-2007 ప్రకారం పట్టాదారు యూసెఫ్ పంతులు ఎలాంటి డిఫెన్స్ సర్వీసు చేయలేదని స్పష్టం చేయడం జరిగినది. దీనిని బలపరుస్తూ డైరెక్టర్ డిఫెన్స్ వెల్ఫేర్ బోర్డు కూడా యూసెఫ్ పంతులు డిఫెన్స్ సర్వీసు చేసినట్టుగా తమ రికార్డులో లేదని లెటర్ నెం. 1568 -ఆర్.టి.ఐ. - ఇ.ఎమ్.పి. - 2025, తేది 18-9-2025 ద్వారా స్పష్టం చేయడం జరిగినది. ఇట్టి విషయంలో డిఫెన్స్ వెల్ ఫేర్ డైరెక్టర్ హైకోర్టుకు నివేదిక సమర్పించడం జరుగుతుంది. కాబట్టి ఇట్టి భూమిని కేవలం దేవుని సేవ తప్ప లావాదేవీలు జరపడానికి పట్టాదారు వారసులకు కూడా ఎలాంటి హక్కులేదని స్పష్టం చేయుచున్నాము.

పైన తెలిపిన విషయాలను పురస్కరించుకొని సర్వే నెంబర్ 293కు సంబంధించి రెవెన్యూ వారు గోప్యంగా ఉంచిన ప్రోసీడింగ్ ఆధారంగా జరిగిన మొత్తం లావాదేవీలు మరియు తదితర పర్మిషన్లను తమ డెలిగేషన్ హక్కులను ఉపయోగించి స్టే విధించగలరని జిల్లా కలెక్టర్కు తేది. 30-1-2025 మరియు 4-8-2025 రిమైండర్ ద్వారా నివేదిస్తూ దీనివలన ప్రజలకు తీవ్రనష్టం జరుగకుండా కాపాడాలని హెచ్చరించడం జరిగినది. లేనిచో సంబంధింత అధికారులు ఖచ్చితంగా త్వరలో ఫైలు చేయబోయే ప్రజా ప్రయోజనాల వాజ్యంలో హైకోర్టుకు జవాబుదారీ కావలసివస్తుంది. ఈ మొత్తం విషయాలను అవగాహన చేసుకొని ఎలాంటి లావాదేవీలు జరపకుండా ప్రజలు చాలా జాగ్రత్త వహించాలని ఈ నోటీసు పరంగా హెచ్చరించుచున్నాము.

హైదరాబాద్
తేది : 30-12-2025

సం/- సయ్యద్ అసదుల్ల, నడింపల్లి గ్రామం, అచ్చంపేట మండలం, నాగర్ కర్నూల్ జిల్లా. సెల్ : 7893210319

ప్రజాపక్షం
గురువారం, 01 జనవరి

# సవాళ్లతో నడక.. ప్రజల చేతుల్లోనే భవిత

గతం ఎన్నో పాఠాలు నేర్పుతుంది... భవిష్యత్తులో సరిదిద్దుకోవాలని సూచిస్తుంది... లేకపోతే జరిగే అనర్థాలపై హెచ్చరిస్తుంది. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, 2025ని సింహావలోకనం చేసుకోవాలి. అనుసరించాల్సిన మార్గాలను.. చేరుకోవాల్సిన లక్ష్యాలను నిర్ధారించుకోవాలి. గత ఏడాది ఒకవైపు రాజకీయ, ఆర్థిక, సామాజిక విపత్తులు, యుద్ధాలు, వాణిజ్య ఘర్షణలు, ప్రకృతి విలయాలను చూసింది. మరొకవైపు, శాస్త్రం, సాంకేతికత, వైద్య రంగాల్లో విప్లవాత్మక పురోగతులు, డిజిటల్ పరిజ్ఞానం, పునర్వినియోగ ఇంధనం, జెనెటిక్ రీసెర్చ్, కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధనలు వంటి విశేష పురోగతి సాధించింది. మంచీ–చెడు.. ఆశ–నిరాశ.. యుద్ధం–శాంతి... ఆవిష్కరణలు–ఆందోళనలు... ఉన్నత శిఖరాలు–అథఃపతనాలు... కలగలిపిన అనుభవం నిన్నటిది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న మనిషి, ఆలోచనల్లో మాత్రం రోజురోజుకూ కుంగిపోవడం దురదృష్టకరం. సమవాదం బలంగా అడుగులేస్తున్న తరుణంలోనే మతవాదం వేళ్లూనుకోవడం ప్రమాదకరం. కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు మరింత బలపడ్డాయి. అత్యధిక దేశాలు మరింత దయనీయ పరిస్థితి ఎదుర్కొంటాయి. దేశాల మాదిరిగానే.. పేద, ధనిక వర్గాల మధ్య కూడా అంతరం ఎన్నడూ లేనంతగా పెరిగింది. ధరలు ఆకాశానికి నిచ్చెనలేస్తుంటే... సామాన్యుడి ఆదాయాలు దారుణంగా పడిపోతున్నాయి. వెంటాడుతున్న నిరుద్యోగం... పెరుగుతున్న ద్రవ్యోల్బణం... సగటు జీవి బతుకు దుర్భరం. ఇదంతా ఒక్కసారిగా వచ్చిపడిన ఉపద్రం కాదు.. హఠాత్తుగా సంభవించిన విపత్తు అంతకంటే కాదు. పాలకుల స్వార్థ ప్రయోజనాలు.. పెట్టుబడిదారీ విధానాలు.. కులమతాల పేరుతో అణచివేతలే ఈ దుస్థితికి కారణాలు. కాలం చెల్లిన ఆలోచనలు.. ఏకపక్ష నిర్ణయాలు.. సమాజాన్ని మతాల పేరుతో నిలువునా చీల్చే ప్రయత్నాలు ఆగనంతకాలం అద్భుతాలు ఏవీ జరగవు. చేసిన పొరపాట్లను గ్రహించి, విధానాలు మార్చుకొని, ఉజ్వల భవిష్యత్తు వైపు నడవడం.. దేశాన్ని నడిపించడం పాలకుల బాధ్యత. ఆ కనీస బాధ్యతను సైతం విస్మరిస్తున్న ప్రభుత్వాలకు సరైన సమాధానం చెప్పడం ప్రజల కర్తవ్యం. ప్రజా వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటూ, ప్రాంతం, మతం, భాష పేర్లతో ప్రజలను విభజించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నప్పుడు, ప్రజలు అత్యంత బాధ్యతతో కుంగిపోవడం కాదు, వివేకంతో స్పందించాలి. భావోద్వేగాలకు లోనుకాకుండా ఆ నిర్ణయాల అసలైన ఉద్దేశాన్ని, ప్రభావాన్ని తెలుసుకోవాలి. నిజాలను, అబద్ధాలను వేరు చేసి, నమ్మకమైన సమాచార వనరుల ద్వారా విషయాన్ని అర్థం చేసుకోవడం చాలా అవసరం. అవగాహన కలిగిన పౌరుడిగా ఉండటమే ఈ దిశగా తొలి అడుగు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత మార్గాలే బలమైన ఆయుధాలు. ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించాలి. చర్చలు, సభలు, నిరసనలు శాంతియుతంగా నిర్వహిస్తూ ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలి. విభజనను రెచ్చగొట్టే మాటలు, విద్వేష ప్రసంగాలు, వదంతులను తిరస్కరించి, ఐక్యతను బలపరిచే భాషను, భావనను ప్రోత్సహించాలి. సామాజిక మాధ్యమాల్లో కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి, అసత్యాలను వ్యాప్తి చేయకుండా నిజాలను పంచుకోవాలి. న్యాయవ్యవస్థ, స్వతంత్ర సంస్థలు, మీడియా వంటి ప్రజాస్వామ్య స్తంభాలను ప్రజలు బలోపేతం చేయాలి. చట్టబద్ధమైన మార్గాల్లో న్యాయస్థానాలను ఆశ్రయించడం, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయడం, స్వతంత్ర మీడియాను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష సాధ్యమవుతుంది. ఎన్నికల సమయంలో ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించి, ప్రజా వ్యతిరేక విధానాలకు రాజకీయంగా సమాధానం చెప్పడం కూడా కీలకమే. అన్నిటికంటే ముఖ్యంగా, ప్రాంతం, మతం, భాషల వైవిధ్యాన్ని విభజనగా కాకుండా దేశ బలంగా భావించే దృక్పథాన్ని ప్రజలు పెంపొందించాలి. పరస్పర గౌరవం, సహనం, సౌహార్ద్రభావం వంటి విలువలను రోజువారీ జీవితంలో ఆచరించాలి. ప్రజలు ఐక్యంగా, శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా స్పందించినప్పుడు ఏ ప్రభుత్వానికైనా ప్రజా వ్యతిరేక మార్గంలో కొనసాగడం కష్టమవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది శక్తి అనే సత్యాన్ని గుర్తుంచుకోవడమే సరైన మార్గం. 2026 పట్ల ఆశలు, ఆశయాలు మరింత స్పష్టంగా ఉన్నాయి. చేయాల్సిందల్లా, మన గతం నుండి నేర్చుకున్న పాఠాలను సక్రమంగా అమలు చేయడం. దేశాలు, సంస్థలు, వ్యక్తులు సాంకేతికతను కేవలం వాణిజ్య లేదా లాభనష్టాల కోసం కాకుండా మానవతా, పరిసర పరిరక్షణ, సమాజ సంక్షేమానికి ఉపయోగించాలి. పర్యావరణ పరిరక్షణ, శాశ్వత శక్తి వనరుల వినియోగం, ప్రకృతి విపత్తులకు ముందస్తు సిద్ధత ప్రధాన ప్రాధాన్యం కావాలి. సామాజికంగా, యువత, మహిళలు, నిరుద్యోగులకు సమాన అవకాశాలు, న్యాయసమ్మత వేతనం, భద్రత వంటి అంశాల్లో ముందడుగు వేయడం అవసరం. ఏ రకంగా చూసినా కొత్త సంవత్సరంలో, భవిష్యత్తును నిర్ణయించే అధికారం ప్రజల చేతిలోనే ఉంది.

# మారుతున్న మేడారం జాతర స్వరూపం

తెలంగాణ కుంభమేళాగా పిలుచుకునే మేడారం మహాజాతరకు కౌంట్డౌన్ మొదలైందనే వాదనలు వినిపిస్తున్నాయి. రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ వనదేవతల పండుగకోసం కోట్లాదిమంది భక్తులు ఎదురుచూస్తుంటారు. ప్రభుత్వం ఈసారి రూ.251కోట్ల భారీ బడ్జెట్‌తో జాతరను సరికొత్తగా తీర్చిదిద్దుతోంది. కోయ, ఆదివాసి వంశీయుల చరిత్రను ప్రతిబింబించేలా గద్దెల ప్రాంగణాన్ని విస్తరిస్తున్నారు. అయితే ఈ అలంకారాలు, హంగులు ఒక ఎత్తు అయితే మరోవైపు చరిత్రాత్మకమైన వనదేవతల మేడారం జాతర స్వరూపం క్రమంగా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి పనులు ఓకే అనుకున్నప్పటికీ ఆ అభివృద్ధి పేరుతో మేడారం జాతర కార్పొరేట్ రంగు పులుముకుంటున్నదనే వాదనలో నిజం లేకపోలేదు. చరిత్ర కలిగిన మేడారం జాతరను అధునాతన సౌకర్యాలతో దిద్దిదిద్దడం పట్ల హర్షం వ్యక్తమవుతూనే ఈ అభివృద్ధి పనులు జాతర సహజత్వాన్ని దెబ్బతీస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల వల్ల ఆదివాసీ అస్తిత్వంతో పాటు వనదేవతల జాతరను భవిష్యత్తులో కార్పొరేట్ మయంగా మార్చే అవకాశం లేకపోలేదు.

మరోవైపు సామాన్య భక్తుడి జేబుకు చిల్లు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రూ.251 కోట్ల బడ్జెట్‌తో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం రూ.101కోట్లతో చేస్తున్న గద్దెల విస్తరణ పనులు జాతరకు కొత్త రూపునిస్తున్నా, అది సహజత్వాన్ని దెబ్బతీస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాంక్రీట్ కట్టడాల వల్ల అడవి పల్చబడుతోందని, గిరిజన సంప్రదాయాలకు భిన్నంగా జాతర 'కమర్షియల్' అవుతోందని పలువురు స్థానిక ఆదివాసీలు, విశ్లేషకులు ఆందోళన చెందుతున్నారు.

జాతర సమయంలో ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నా, రద్దీ దృష్ట్యా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించే వారి సంఖ్య ఎక్కువ. ఈ క్రమంలో ట్యాక్సీలు, ఆటో లు సాధారణ చార్జీల కంటే మూడు నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తుండటం సహజమే. మరోవైపు మేడారం చుట్టుపక్కల ఉన్న లాడ్జీలు, తాత్కాలిక గుడారాల అద్దెలు ఆకాశాన్ని తాకే అవకాశం ఉంది. గతంలో చెట్ల కింద డేరాలు వేసుకునే వెసులుబాటు ఉండేది, కానీ ఇప్పుడు ఆ స్థలాలను కూడా వాణిజ్యపరంగా మార్చడంతో సామాన్యుడికి వసతి కష్టమైపోయే పరిస్థితి గతంకంటే ఎక్కువగా ఉంటుంది. 'ఒకప్పుడు మేడారం అంటే ఎడ్లబండి కట్టుకుని, ఇంటి నుంచి చద్దిమూటలు తెచ్చుకుని అమ్మవార్లను దర్శించుకునే వారు. కానీ ఇప్పుడు కనీసం తలదాచుకోవడానికి అద్దె గది కావాలన్నా, స్నానం చేయడానికి నీళ్లు కావాలన్నా పన్ను చెల్లించాల్సి వస్తోందని, భవిష్యత్తులో మరింత కార్పోరేట్ మయం కానుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అభ్యుదయ సాహిత్య సేవలో 72 ఏళ్ళ ప్రయాణం!

## 'విశాలాంధ్ర–నవచేతన' ప్రచురణాలయాల కృషి



సోమశిల తిరుపాల్
998926033

ఏ మాత్రం పుస్తకాలు చదివే అలవాటున్న ఏ వ్యక్తి ఇంట్లో చూసినా.. సాహిత్యాభిరుచి కలిగిన అనేకమంది కవులు, రచయిత(త్రు)ల ఇండ్లల్లో చూసినా.. అల్మారా లాంటి 'షెల్ఫ్' నిండానో, లేదంటే.. ఏకంగా ఓ గదిలో సగభాగమో.. కొందరు ఇండ్లలో అంతకుమించి గది పూర్తిగానూ పుస్తకాలతో నిండిన ఇండ్లు చాలానే కనిపిస్తుంటాయి. అలాంటి వారి ఇండ్లను చూస్తే మనం ఒక్కింత ఆశ్చర్యానికి లోనవుతాం. తెలుగు భాషా సాహిత్యాలను వారు ఎంతగా అభిమానిస్తున్నారో మనకు ఇట్టే అర్థమవుతుంది.

ఈ కోవలో ఎక్కువగా ఉపాధ్యాయ ఉపన్యాస వృత్తిలో ఉన్న వాళ్ళే ఎక్కువగా కనిపిస్తున్నా, ఇలాంటి సాహితీ వేత్తలు అన్ని రంగాలలోనూ అనేకమంది ఉన్నారన్నది వాస్తవం. ఇట్లా ఆధునిక కాలంలో పుస్తకాలను ప్రేమించే వారి సంఖ్య, కొనేవారి సంఖ్య ఈ మధ్య గణనీయంగా పెరిగిందనే చెప్పాలి.

ఇందుకూ సాక్ష్యం... ప్రతి సంవత్సరం 'ఎన్టీఆర్ గార్డెన్' లో నిర్వహించే 'హైదరాబాద్ బుక్ ఫెస్టివల్'లోనూ, అటు విజయవాడ బుక్ ఫెస్టివల్ లోనూ.. కలకత్తా, మద్రాసు లాంటి ఇతర నగరాలలో నిర్వహించే పుస్తక ప్రదర్శనలోనూ పుస్తకాలను కొంటున్న పాఠకుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నది గణాంకాల సమాచారం. వీటితోపాటుగా.., హైదరాబాదు నగరంలోని కోఠి, సికింద్రాబాద్ లాంటి అనేక ప్రాంతాలలో వివిధ బుక్ సెంటర్లలోనూ, ఆన్లైన్లోనూ, మరియు ప్రతి ఆదివారం హైదరాబాదు ఫుట్‌పాత్ రోడ్లపైన సెకండ్ హ్యాండ్ పుస్తకాలు.. జరుగుతున్న అమ్మకాలే అందుకు నిదర్శనం. ఇట్లా.. ఎవరి షాపులోనైనా.. ఇండ్లల్లోనైనా.. ఎన్ని పుస్తకాలు ఉన్నా.. అందు లో 'విశాలాంధ్ర ప్రచురణాలయం పుస్తకాలు' తప్పకుండా ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఎందుకంటే... 'కావ్యం కవితలు చెబుతుంది/ఇతిహాసం హితవులు చెబుతుంది/ పురాణం బుద్ధులు చెబుతుంది/శతకం సూక్తులు చెబుతుంది!' మరి కొన్ని గ్రంథాలు సాహిత్యం చదివిస్తాయి! వర్తమాన గ్రంథాలు గత చరిత్రను చెబుతాయి! ఇవన్నీ కలిపితే.. విశాలాంధ్ర నవచేతన పుస్తకాలు అవుతవి! ఆ పుస్తకాలను చదివితే ఆ స్పర్శ మనలను అనిర్వచనీయమైన భావలోకంలోకి తీసుకెళుతుంది.

కాలక్రమంగా ఆయా వ్యక్తులు ఇండ్లు మారినప్పుడో.. ఆ ఇంట్లో స్థల ప్రభావం వల్లనో.. ఏ కారణం చేతనో కొన్ని పుస్తకాలను మరొక పాఠకుడికో, గ్రంథాలయాలకో ఇచ్చేసినప్పుడు అందులో విశాలాంధ్ర పుస్తకం, అలాగే సోవియట్ రష్యా (మాస్కో)'రాదుగ' ప్రచురణాలయం పేరుతో ఉన్న పుస్తకాలు మాత్రం మన మది గదిలోని జ్ఞాపకాల సెల్ఫ్‌లో అతుక్కుని అట్లాగే ఉండిపోతవి. వాటిని తీసివేయడానికి ఏ సాహితీవేత్తకు మనసు అంగీకరించదు. విశాలాంధ్ర పుస్తకాల స్థానం, గొప్పతనం అలాంటిదీ మరి! అట్లా..

విశాలాంధ్ర(నవచేతన) ప్రచురణాలయాలు దేశంలోని ప్రముఖ ప్రచురణకర్తల్లో ఒకటిగా వెలుగొందుతూ అగ్రగామిగా నిలబడ్డాయి.

అనాదికాలం నుండి ఉన్న తెలుగు భాష, సాహిత్యాలు ఆరిపోయే దీపం కాకూడదని, ఇందుకోసం మనదైన భాషా, సాహిత్యం, సంస్కృతిని, చరిత్రను, కళలను పరిరక్షించుకోవడం కోసం రచయితల చేతులను ఆ అక్షర దీపానికి అడ్డుగా పెట్టాలి. అందుకోసం ఓ సంస్థ ఉండాలి అని మొదటితరం విశాలాంధ్ర విజ్ఞాన సమితి సభ్యులు ఎందరెందరో నాడు తపించారు. అందులో భాగంగానే.. అటు 'దినపత్రిక' ఇటు 'పబ్లిషింగ్ హౌస్' రెండింటిని రెండు కళ్ళుగా భావించి, పుస్తక ప్రచురణ రంగంలో ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యంత ప్రధానమైన సంస్థగా తీర్చిదిద్దడంలో 'విశాలాంధ్ర నవచేతన విజ్ఞాన సమితి' పాలకవర్గ సభ్యులదే కీలక పాత్ర!

అట్లా..1953నుండి ఇప్పటివరకు వేలాదిమంది రచయితలకు, భాషా పండితులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విజ్ఞానవంతులైన ఎంతోమంది మేధావులకు అక్షర జ్ఞానాన్ని పంచుతూ పుస్తక ప్రచురణ రంగంలోనూ, అమ్మకంలోనూ తెలుగు రాష్ట్రాలలో ముందు వరుసలో ఉన్నవి విశాలాంధ్ర మరియు నవచేతన పుస్తకాలయాలు.

అందుకు కారణం...విజ్ఞాన సమితి పాలకవర్గ సభ్యులు, సంపాదక వర్గ సభ్యులే కాకుండా కొన్ని కొన్ని సందర్భాలలో అందివచ్చిన అవకాశాలనెన్నింటినో వదులుకొని, అనేక సంవత్సరాలుగా ఈ సంస్థలో పనిచేస్తున్న ఎందరో ఉద్యోగుల త్యాగంతో కూడిన కార్యదీక్ష ఉన్నది. అలాగే.. పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్‌తో పాటు వివిధ జిల్లాల బుక్‌హౌస్‌ల నిర్వహణలో మేనేజర్ స్థాయిలో పనిచేస్తూ, ఎన్ని అడ్డంకులు ఎదురైనా, పుస్తకాల మార్కెట్‌లో ఎంత పోటీతత్వం నెలకొని ఉన్నా, ఆ సంస్థ దీపాన్ని నిరంతరం వెలిగేలా ఉండేందుకు ఎప్పటికప్పుడు నూతన విధానాలను అవలంబించి, పుస్తకాల అమ్మకాలలో అగ్రస్థానంలో నిలబెట్టిన ఆయా జిల్లాల బుక్ హౌస్ బ్రాంచి మేనేజర్లు, సేల్స్ మెన్లు, మరియు కిందిస్థాయి సిబ్బందే దీని అభ్యున్నతికి మరో కారణం. ఈ పరంపరలో తొలి దశలో మద్దుకూరి చంద్రం, చండ్ర రాజేశ్వరరావు, కంభంపాటి, ఏటుకూరి బలరామమూర్తి, టీవీ, చలసాని వాసుదేవరావు, తుమ్మల, పరకాల లాంటి ఎంతోమంది ప్రముఖులు అభ్యుదయ భావజాలాన్ని పాఠకులకు అందించాలనే లక్ష్యంతో విశాలాంధ్ర సంస్థను నెలకొల్పడానికి ప్రణాళికలు రచించారు.

ఇందుకోసం మొదటి తరంనాటి అనేకమంది ప్రముఖ రచయిత(త్రు)ల, కవుల రచనలతో పాటుగా, సోషలిస్టు భావాల వ్యాప్తి, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ ల తాత్వికత రచనల ప్రచారం, అభ్యుదయ ప్రగతిశీల సాహిత్య ప్రచురణ అన్న స్ఫూర్తితో.. **1953 జనవరి, 1న విజయవాడలో విశాలాంధ్ర ప్రచురణాలయం** ఏర్పాటయింది. దీనిని సాధించడంలో విజ్ఞాన సమితి సభ్యుల ప్రణాళిక మరువలేనిది. అప్పటినుండి ఇప్పటి వరకు శక్తి వంచన లేకుండా సుమారు 72 ఏళ్లుగా సాహిత్య కృషి చేస్తూ ఈ సంస్థ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉన్నది. అట్లా... 'జనం నుండి జనంలోకి సాహిత్యం ప్రజల దగ్గరికే పుస్తకం' అన్న నినాదంతో, సమాజానికి మంచి ఆరోగ్యవంతమైన సాహిత్యం అందించాలన్న సదాశయంతో.. ఉత్తమ ప్రచురణలను పాఠకులకు అందిస్తూ వారి విజ్ఞాన, వికాస, వినోదాలకు ఎంతగానో తోడ్పడుతూ... తెలుగు సాహిత్య రంగంలో ఎనలేని కృషిచేస్తూ వచ్చింది.

కాలానుగుణంగా ఈ ప్రచురణాలయం నుండి కథలు, నవలలు, కవిత్వము, నాటకము, రూపకము, గేయాలు, స్వీయ చరిత్రలు లాంటి అనేక ప్రక్రియలలో కలిపి దాదాపు 2000 మంది రచయిత(త్రు)ల రచనలతో కలిపి ఇప్పటి వరకు సుమారు 4000 పైచిలుకు రచనలను వెలువరించింది.

ఈ ప్రచురణాలయం మొదటగా నవయుగ వైతాళికులైన గురజాడ, గిడుగు, కందుకూరి, శ్రీశ్రీ లాంటి అనేకమంది రచయితల రచనలు మరియు రాహుల్ జీ, ప్రేమ్ చంద్, కిషన్ చంద్ లాంటి ఎందరో మహనీయుల రచనలను ప్రచురించింది. వీటితో పాటూ.. జన సామాన్యంలో మూఢనమ్మకాలను పోగొట్టి శాస్త్రీయ అవగాహనను పెంచే అనేక రకాల విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను ప్రచురించింది. ఈ కాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాలలో పుస్తక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఏ పాఠకుడైన అక్కడ... తడిమి చూస్తే తన్మయత్వం కలిగించే పుస్తకాలు ఎన్నో వారికి లభించేలా తీర్చిదిద్దింది.

అందులో... తాపి ధర్మారావు రచనలు, కోకు సాహిత్యము, మల్లాది రామకృష్ణ శాస్త్రి, శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి, దాశరథి కృష్ణమాచార్య సాహిత్యం, దాశరథి రంగాచార్య రచనలు, గుర్రం జాషువా, కృష్ణశాస్త్రి సాహిత్యం, అడవి బాపిరాజు, పాలగుమ్మి పద్మరాజు, ఆరుద్ర, బలివాడ కాంతారావు, రావిశాస్త్రి, మాగోఖలే, వాకాటి పాండురంగారావు, శరత్ చంద్ర చటోపాధ్యాయ రచనలు, కరుణశ్రీ సాహిత్యం, ఏటుకూరి బలరామమూర్తి, బుచ్చిబాబు, గోపీచంద్, బాపు రమణల రచనలు, కేతు విశ్వనాథరెడ్డి, కందిమళ్ల ప్రతాపరెడ్డి, ఏటుకూరి ప్రసాదు, ఆర్ వి ఆర్, రాచమల్లు రామచంద్రారెడ్డి, తిరుమల రామచంద్ర, ఆరుద్ర, సినారే, పరకాల, వాసిరెడ్డి సీతాదేవి, భాస్కరభట్ల కృష్ణారావు, జిడ్డు కృష్ణమూర్తి, గిడుగు రామ్మూర్తి, మధురాంతకం రాజారాం, దిగవల్లి వెంకటశివారావు, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, సురవరం ప్రతాపరెడ్డి, కె.వి రమణారెడ్డి, ఉత్పల, అవసరాల, మహీధర, గంగినేని, విద్వాన్ విశ్వం, సోమసుందర్, కాళోజీ, జీవీకృష్ణారావు, కంభంపాటి, కుందుర్తి, అట్లూరి, తుమ్మల, డి.రామలింగం, మద్దుకూరి చంద్రం, రావి నారాయణరెడ్డి, నల్ల నరసింహులు, గంగినేని, చేకూరి, పోలాప్రగడ, కుందుర్తి, కొంపెల్ల, చాసో, బొల్లిముంత, సదానంద్ శారద లాంటి ఎందరో ప్రముఖ రచయితల రచనలు అన్నింటిని సేకరించి ప్రచురించింది. వీరిలో కొందరివి సంపుటాలుగా ప్రచురించి పాఠకులకు అందించిన ఘనత ఈ ప్రచురణాయాలకే దక్కింది.

పై రచయితలతో పాటు.. తిలక్ కథలు, కొవ్వలి నవలలు, వట్టికోట నవలలు, రావూరి భరద్వాజ, చిలకమర్తి లక్ష్మీ నరసింహము, పి. శ్రీదేవి, తెన్నేటి సూరి, సింగమనేని నారాయణ, శాంతి నారాయణ, సోమసుందర్, ఎంబిఎస్ ప్రసాద్, ముదిగంటి సుజాతారెడ్డి, నిడమర్తి ఉమారాజేశ్వరరావు, ముద్దుకృష్ణ సంకలనాలు, చిలకమర్తి, మొక్కపాటి, మాగదుమ్ కవితలు, గజ్జల మల్లారెడ్డి గేయాలు, అనిశెట్టి సుబ్బారావు, కె.వి.రమణ, పులి సాంబశివరావు, ద్వానా శాస్త్రి, జానమద్ది హనుమచ్ఛాస్త్రి, తుమ్మల వెంకట్రామయ్య, భద్రిరాజు కృష్ణమూర్తి, నార్ల చిరంజీవి, పడాల రామారావు, పురిపండా అప్పలస్వామి, రావి నారాయణరెడ్డి, నల్ల నరసింహులు, అక్కిరాజు, చింతా దీక్షితులు, భమిడిపాటి, భరాగో, కేశవరెడ్డి, కాలువ మల్లయ్య, సి.ఎస్.రావు, నిఖిలేశ్వర్, సుంకర, వాసిరెడ్డి, తస్లీమా నస్రీన్, అంపశయ్య నవీన్, వల్లూరు శివప్రసాద్, తెలిదేవర భానుమూర్తి, ఎస్వీ సత్యనారాయణ, సుద్దాల అశోక్ తేజ, పెనుగొండ, పెద్దింటి అశోక్ కుమార్ లాంటి మరెందరో రచయితల/రచయిత్రుల రచనలతో పాటు కె.రామలక్ష్మి, రెడ్డి రాఘవయ్యను మొదలుకొని, ఈ తరం బాల సాహిత్య రచయితలైన వందలాది మంది బాలసాహిత్య రచనలను ప్రచురించి పాఠకులకు పరిచయం చేసింది.

వీటితోపాటు మాక్సిమ్ గోర్కి, టాల్ స్టాయ్, దోస్త్ యే విస్కీ, షోలాకోవ్, చార్లెస్ డికెన్స్ లాంటి ఎందరో పాశ్చాత్య ప్రముఖ రచయితల రచనలను అనువాదాలుగా ప్రచురించి తెలుగు పాఠకులకు అందించింది. ఈ సంస్థలు ప్రచురించిన అనేక గ్రంథాలకు ప్రతిష్టాత్మకమైన అనేక అవార్డులు లభించడం గర్వకారణం. ఈ గ్రంథాలలో కొన్నింటిని కొన్ని విశ్వవిద్యాలయాలు పాఠ్య గ్రంథాలుగా చేసుకున్నాయి. ఇట్లా.. బాల సాహిత్యం నుండి భారతం దాకా, ఫిక్షన్ నుండి ఫిలాసఫీ దాకా, కేజీ నుండి పీజీ వరకు రిఫరెన్స్ గా ఉపయోగపడే పుస్తకాలను ఎన్నింటినో ప్రచురించింది.

**2014లో ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం తెలంగాణ రాష్ట్రంలో విశాలాంధ్ర ప్రచురణాలయం వారసత్వంగా నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఏర్పడి అభ్యుదయ సాహిత్యాన్ని ప్రచురిస్తున్నది.**

ఇందులో.. అక్షరాలను తూటాలుగా మార్చి సాహిత్యాన్ని సమాజానికి అందించిన మహా రచయితలు ఎందరో ఉన్నారు. ఆ యా రచయితల కలాలను ఆయుధాలుగా మలిచి, అక్షరాలతో నవరసాల సాహిత్య పరిమళాన్ని వెదజల్లే అలాంటి వారిని ఎందరినో తయారు చేసింది విశాలాంధ్ర నవ చేతన ప్రచురణాలయ సంస్థలు. తెలుగు సాహిత్యంలోని మరే ప్రక్రియ అయినా ఆయా రచయతల అక్షరాలకు మొదట ప్రాణం పోసి, ఆధునిక సాహిత్యం వైపుకు అడుగులేసి 'న భూ తో న భవిష్యతి' అన్న రీతిలో స్థిరంగా ముందుకు సాగింది ఈ ప్రచరణాలయాలే!. ముఖ్యంగా అమ్మ భాష మాధుర్యాన్ని దశదిశల చాటేలా ఎప్పటికప్పుడు తన ప్రణాళికను మలుచుకున్నది. పుస్తక తయారీలోనూ రాజీలేని ఉన్నత నాణ్యతా ప్రమాణాలకు సైతం ఇతర ప్రచురణకర్తలకు ఈ సంస్థలే ఆదర్శమైనవి. ఇప్పటికి కూడా రచయితలు ఎవరైనా... పుస్తకం రాయాలంటే దాన్ని ప్రచురించడానికి, అమ్మడానికి ఈ సంస్థలు ఉన్నాయన్న భరోసా ఉంది. రచయితలకు పాఠకులకు వారధిగా నిలిచింది ఈ ప్రచురణ సంస్థలే.

ఈ విధంగా 72 ఏళ్లుగా లక్షలాది మంది పాఠకుల మెదళ్ళమీద, మనసుల మీద, జీవితాలమీద కలిగించిన ప్రభావాల గురించి చెప్పడం ఏ ఒక్కరికీ సాధ్యపడదు. ఇప్పుడు ప్రముఖులుగా ఉన్న వాళ్లు, వివిధ రంగాలలో ఉన్నత ఉద్యోగులుగా ఉన్న వాళ్ళందరూ తమ చిన్ననాట ఏదో ఓ సందర్భంలో తప్పకుండా ఈ సంస్థ ప్రచురించిన పుస్తకాలు చదివిన వాళ్లే ఉంటారు అన్నది వాస్తవం!

తెలుగు ప్రజల హృదయాలలో ఉత్తమ సాహిత్య నిలయంగా ఇంతటి సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న ప్రచురణాలయాలు ఇలా కొనసాగడం వెనుక ఎంతో క్రమశిక్షణతో నడిపిన మొదటి తరం 'విజ్ఞాన సమితి పాలకవర్గమైన నాయకులు' ఏటుకూరి బలరామమూర్తి, నిడమర్తి ఉమా మహేశ్వర రావు లాంటి వారి సేవలు ఎప్పటికీ మరువలేనివి. అలాంటి బాధ్యతలను వారసత్వంగా తలకెత్తుకు ని, ఇప్పటి వరకు అంతే నిబద్ధతతో దాదాపు రెండు దశాబ్దాలనుండి ముందుకు తీసుకువెళుతున్న నేటితరం సమితి సభ్యులైన చాడ వెంకటరెడ్డి, పల్ల వెంకటరెడ్డి, మోహన్ రెడ్డి, కూనంనేని సాంబశివరావు, మధుకర్, ఎస్వీ.సత్యనారాయణ లాంటి అనేకమంది సభ్యులతో పాటు, ఆయా బ్రాంచ్ మేనేజర్లు, రచయితలు సంస్థ ఉద్యోగులు అందరూ కలిసి సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు తీసుకుపోవడం హర్షించదగ్గ విషయం. వీరంతా కలిసి విశాలాంధ్ర ప్రచురణాలయం 50 ఏళ్ల సందర్భంగా..2003లో స్వర్ణోత్సవ సంబరాలను, 2013లో, 60ఏళ్ల 'వజ్రోత్సవ సంబరాలను' ఘనంగా నిర్వహించ డం అభినందనీయం. ముఖ్యంగా.. అప్పుడు విశాలాంధ్ర ఇప్పుడు నవచేతన ప్రచురణాలయానికి దాదాపు 50ఏండ్లుగా పూర్తిస్థాయి సంపాదక బాధ్యతలు నిర్వర్తిస్తున్న 92 ఏళ్ల వయస్సున్న డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ గారి శ్రమ, సేవలు మరువలేనివి.

అలాగే ప్రచురణాలయానికి అప్పటి జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించిన 'జోషి' గారి సేవలు అనన్య సామాన్యం. ఆ తర్వాత ఈ సంస్థల అభివృద్ధికి తోడ్పడిన వారిలో అప్పటి జనరల్ మేనేజర్ పి. రాజేశ్వరరావు, సీనియర్ బ్రాంచి మేనేజర్లైన ఎస్. రాజా, ఈశ్వరరెడ్డి, అమరేశ్వర రావు, రామరాజు, బాబురావు, వరప్రసాద్, యోగి, కనకారావు, వి.వి బ్రహ్మం, ఆనంద్, జనార్దన్, రమణారెడ్డి, సత్తిరెడ్డి, సంజీవరావు, నారాయణ, రాజేశ్వర్, సోమశేఖర్, వీరన్న, భూపేష్, బాదుల్లా, వెంకటలక్ష్మి గార్లతోపాటు.. ఉద్యోగులైన మరికొందరు, లోకం భాస్కర్ రావు, పద్మావతి, పద్మ, పావని, నరసింహ, విష్ణుమూర్తి, చక్రధర్, హేమలత, శ్రీనివాస్ రెడ్డి, సోమశిల తిరుపాల్, ప్రస్తుత పబ్లిషింగ్ హౌస్ రెండు రాష్ట్రాల సంస్థల మేనేజర్లు అయిన మనోహర్ నాయుడు(విశాలాంధ్ర), నారాయణరెడ్డి(నవచేతన) గారి లాంటి వాళ్ళతోపాటు అనేకమంది రిటైర్డ్, సీనియర్, జూనియర్, ప్రస్తుత, పూర్వ ఉద్యోగుల సేవలు, మరియు మొబైల్ గ్రంథాలయ రథసారథులైన స్వామి, గోవర్ధన్ రెడ్డి, అంజయ్య, కృష్ణ లాంటి వారు .. ఎందరో.. సంస్థ విజయంలో భాగస్వాములుగా ఉన్నారు. వారందరి సేవలు మరువలేనివి.

నేను (వ్యాసకర్త) ఆ ఈ సంస్థల్లో అడుగుపెట్టి, సరిగ్గా 20 సంవత్సరాలు. ఆ పుస్తక ప్రచురణ రంగంలో పనిచేసిన అదృష్టం కారణంగా.. అనేకమంది ప్రముఖ సాహితీవేత్తలతో, పుస్తకాల సమస్త సర్వస్వాన్ని అవపోసన పట్టే అవకాశం రావడం నేను ఓ అదృష్టంగా భావిస్తున్నాను.


ఏది ఏమైనా... అక్షరాలకు తమ మేధస్సును జోడించి, పదాలతో, పాటలతో, మాటలతో, అనేక రకాల ప్రక్రియల్లో మనకు తమ రచనల ద్వారా జ్ఞాన సంపదను అందించిన, అందిస్తున్న మహానుభావులైన ఎందరో రచయిత(త్రు)లకు, పాఠకులకు ఈ సందర్భంగా శతకోటి వందనాలు. అలాగే ఇన్నేళ్లుగా ఈ సంస్థ అభివృద్ధికి కారకులైన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ.. సొంత గ్రంథాల ప్రచురణకర్తగానే కాక, జాతీయస్థాయిలో అటు ప్రచురణకర్తలకు, ఇటు రచయితలకు పంపిణీదారుగా 72 సంవత్సరాలుగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సుదీర్ఘ ప్రయాణం చేస్తున్న విశాలాంధ్ర, నవచేతన ప్రచురణాలయ సంస్థలు తమ ఉనికిని కొనసాగిస్తూ ప్రయాణిస్తున్నాయ్.

ఇవీ.. మునుపటిలాగా రచయితలను, పాఠకులను ఆదరిస్తూ.. రాబోయే రోజుల్లో ఈ సంస్థలు 'శత వసంతాల ఉత్సవాల'ను ఘనంగా జరుపుకోవాలని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ..

# ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

కొత్త సంవత్సరం కోటి ఆశల మూటలు తోడ్కొని రావాలని కోరుకుంటున్నాం. వ్యక్తిగత, సామాజిక, వృత్తిపరమైన, కుటుంబపరమైన బాధ్యతలతో జీవితం పయనిస్తున్నది. వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే ఇతర రంగాల్లో ముందుకు పోగలుగుతాం. కొత్త సంవత్సర వేడుకల్లో మునిగిపోతున్న వేళ మనం రానున్న 12 నెలల్లో వ్యక్తిగత శారీరక, మానసిక ఆరోగ్యానికి తీసుకోవలసిన నిర్ణయాలను నేడు దృఢ సంకల్పంతో తీసుకుందాం. మన జీవనశైలిని మరింత సానుకూల దిశగా దశల వారీగా మార్చుకుందాం, ఆరోగ్య సౌభాగ్యాలను పెంచుకుందాం. మనం తీసుకోవలసిన లక్ష్యాలు అతి క్లిష్టమైనవి లేదా అతి సులభమైనవిగా ఉండకూడదు. అసాధ్యమైన లక్ష్యాలను ఎంచుకున్నపుడు వైఫల్యాలు వెక్కిరించి మానసిక విశ్వాసం సన్నగిల్లుతుంది. అతి స్వల్ప లక్ష్యాలను ఎంచుకున్నపుడు మన శక్తి సామర్థ్యాలు పూర్తిగా వినియోగపడవు. నేటి అసౌకర్యం రేపు సానుకూల సౌకర్యంగా మారి మన జీవనశైలిని సుసంపన్నం చేయాలి.

దినచర్యను నిశితంగా పరిశీలిద్దాం. అవసరమైన స్వల్ప మార్పులను చేసుకుందాం. మన కండర, మానసిక ఆరోగ్యానికి వేకువ జామున నిద్రలేచే ప్రయత్నం చేద్దాం. ఉదయ భానుడి కిరణాలు సోకుతున్న వేళల్లో సైక్లింగ్, వాకింగ్ లేదా స్విమ్మింగ్, జాగింగ్, యోగా, ప్రాణాయామం, లేదా ధ్యానం చేయడానికి సమయం కేటాయిద్దాం. నిన్నటి కన్నా నేడు కుటుంబంతో గడిపే సమయాన్ని పెంచుదాం. అనవసర వ్యయాలను తగ్గిస్తూ పొదుపుకు పట్టం కడదాం. ప్రతిరోజు సరైన నిద్రకు తగు సమయా న్ని కేటాయిద్దాం. నిద్రలేమి సమస్య పలు అనారోగ్యాలకు హేతువు అవుతుందని తెలుసుకుందాం. మన ఎదుగుదలకు ఉపకరించే నూతన అభిరుచులను పెంచుకోవడానికి కొత్త వ్యక్తులతో లేదా సృజనశీల సమూహాలతో సంబంధాలను పెంచుకుందాం.



పొగ లేదా మద్యం తాగే అలవాటు ఉంటే దానిని 2026లో తగ్గించడానికి కఠిన నిర్ణయాలు తీసుకొని అమలు పరుద్దాం. పీచు పదార్థాలు అధికంగా ఉన్న శాఖాహారాలను మన మెనూలో చేర్చుదాం. క్రమం తప్పకుండా వైద్య పరీక్షకు చేసుకునే అలవాటును 2026లోనైనా ప్రారంభిద్దాం. మన ఇంటి లేదా కార్యాలయ లేదా విద్యాలయ ప్రాంగణాల్లో ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ మొక్కలను దత్తత తీసుకొని వాటి ఆలనాపాలనా చూసుకుంటూ మానసిక సంతోషాన్ని పెంచుకుందాం. మన ఇంటికి లేదా కార్యాలయానికి చేరుకోవడానికి లిఫ్ట్‌కు బదులు మెట్ల మార్గాలను ఎంచుకొని ఆరోగ్యాలను పదిల పరుచుకుందాం. మనం ప్రేమించే వ్యక్తులతో పాటు మనల్ని ప్రేమించే వ్యక్తులతో గడపడానికి కొంత సమ యం కేటాయిద్దాం. నూతన సంవత్సర వేడుకల్లో అత్యుత్సాహంతో పాల్గొనకుండా కొంత సమయాన్ని కేటాయించి 2026లో అమలు పరచవలసిన నూతన జీవనశైలి మార్పుల గూర్చి స్పష్టమైన నిర్ణయాలు తీసుకుందాం, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని రుజువు చేద్దాం.

బిఎంఆర్

# నూతన సంవత్సరంలోనైనా మెరుగైన వైద్యం అందేనా?

మెరుగైన వైద్యం కోసం వేతన జీవులు చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారు. ఎదురు చూపులే తప్ప మెరుగైన వైద్యం అందడం లేదన్నది వాస్తవం. అసలు కార్పొరేట్ ఆసుపత్రులలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ లకు ఉచిత వైద్యం కలగానే మిగలనుందా? నూతన సర్కారు ఉద్యోగుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటుందా? నూతన సంవత్సరంలోనైనా మెరుగైన అరోగ్య కార్డులు ఎన్నడు జారీచేస్తుంది? వంటి ప్రశ్నలకు సమాధానం లేక ఉద్యోగులు వైద్యం అందక విలవిలలాడుతున్నారు. గత ప్రభు త్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉచిత హెల్త్ కార్డు లు జారీచేశారు. అలాగే వెల్‌నెస్ సెంటర్లను అట్టహాసంగా ప్రారంభించారు. కొన్నా ళ్ళు వెల్‌నెస్ సెంటర్లలో వైద్యం అందినప్పటికి ఉద్యోగులకు సరిపడా వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులో లేకపోవడంతో అవి మూతబడ్డాయి. దీర్ఘకాలిక వ్యాధులకు జారీచేసిన హెల్త్ కార్డులు పని చేయకపోవడం, ఇన్ పేషంట్, శస్త్ర చికిత్సలకుమాత్రమే హెల్త్ కార్డులు అలాగే దంతవైద్యం, నేత్ర వ్యాధులకు మాత్రమే పనిచేయడం అది కొన్ని ఆసుపత్రులకే పరిమితం కావడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

**రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో తీవ్రజాప్యం:**

హెల్త్ కార్డులకు సమాంతరంగా రీయింబర్స్‌మెంట్ సౌకర్యమున్నా సంబంధిత పత్రాలు సమర్పించిన తదుపరి వైద్యశాఖ మంజూరికీ నాలుగు నెలల సమయం, మంజూరై వచ్చాకా నగదు ఉద్యోగుల ఖాతాల్లో జమకావడానికి ఆరు నెలలకు పైగా పడుతుండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అప్పుల పాలవుతున్నారు అనడంలో అతిశయోక్తి లేదు. ఈ నెలాఖరుకు రీయంబర్స్‌మెంట్ గడువు ముగుస్తుండడం గమనార్హం.ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నెలవారీ ప్రీమియం చెల్లిస్తాం మహాప్రభో అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించండి అని ఎన్నిసార్లు ప్రాతినిధ్యం చేసినా పెడచెవిన పెట్టడం గత ప్రభుత్వాలకే చెల్లింది. ప్రైవేట్ ఆసుపత్రులలో చేరి మెరుగైన వైద్యం పొందడం వేతన జీవులకు తలకుమించిన భారంగా మారింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**రీయింబర్స్‌మెంట్ గరిష్ట పరిమితిని పెంచాలి:** దీర్ఘకాలిక వ్యాధులకు చేసే శస్త్ర చికిత్సలకు పది లక్షలకు పైగా ఖర్చవుతున్న పరిస్థితుల్లో నేటికి గరిష్టం గా కేవలం రెండు లక్షల రూపాయలను చెల్లించడం శోచనీయం. ఆ పరిమితిని ఐదు లక్షలకు పెంచాలి. అలాగే 1972లోని ఇంటిగ్రేటెడ్ మెడికల్ అటెండెన్స్ రూల్స్ జిఒ.74ను సవరించాల్సిన ఆవశ్యకత ఉన్నది. అలాగే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ ప్యాకేజీ రేట్లను సవరించాలి.

ఎన్నాళ్ల నుండో వేచిచూస్తున్న హెల్త్ కార్డుల జారీ నూతన సంవత్సరంలోనైనా ప్రభుత్వం తమకు అందించి అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందుతుందనే ఆశతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. కార్డుల సక్రమ అమలు కు ఒక ప్రత్యేక ట్రస్టుని ఏర్పాటుచేస్తూ ఆ ట్రస్టులో ఉద్యోగులను భాగస్వాములను చేయాలని ఉపాధ్యాయ సంఘాలు మొదటి నుండి ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అలాగే ఉద్యోగుల ప్రీమియంకు సమానంగా ప్రభుత్వ గ్రాంట్ జతచేసి మొత్తాన్ని ట్రస్టు ద్వారా అమలుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నాయి. ఇటీవలే ప్రభుత్వంతో ఆరోగ్య కార్డుల జారీ కొరకై పలు దఫాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘా లు చర్చలు జరిపిన నేపథ్యంలో త్వరలో పని కొచ్చే మెరుగైన ఆరోగ్య కార్డులు అందుకోవచ్చుననే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. గౌరవ ముఖ్యమంత్రి గారు ఉద్యోగుల ఆరోగ్యంపై శ్రద్ధ కనబరుస్తారనే ఆశ ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

సుధాకర్.ఎ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
తెలంగాణ టీచర్స్ యూనియన్ (STUTS)
9000674747

## వరద బాధితులకు ఉచిత బియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** మొంథా తుఫాన్ వలన దెబ్బతిన్న వరద బాధితులకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నట్లు నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బల్దియా పరిధి 29వ డివిజన్ రామన్నపేటలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా మేయర్ బాధితులకు సన్నబియ్యం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మొంథా తుఫాన్ ప్రభావం వలన నగరంలో దెబ్బతిన్న ప్రాంతాల వారికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీతో పాటు 1030 మంది బాధితులను గుర్తించి వారికి రూ.15వేల ఆర్థిక సహాయం బ్యాంక్ అకౌంట్‌లోకి నేరుగా పంపించడం జరుగుతుందని ఈ సందర్భంగా మేయర్ తెలిపారు. మేయర్ తగు సూచనలు చేసి డ్రైవ్ నిర్మిత పనుల్లో వేగం పెంచాలని విద్యుత్ స్తంభాలను తొలగించాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఏంహెచ్ఓ డాక్టర్ రాజేష్, తహసీల్దారు శ్రీకాంత్, సానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ తొలి సర్పంచ్ తాళ్లపెల్లి బుచ్చయ్య సేవలు ఎనలేనివి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండలంలోని షాపెల్లి గ్రామానికి చెందిన సీపీఐ పార్టీ నాయకులు, గ్రామ తొలి సర్పంచ్ తాళ్లపెల్లి బుచ్చయ్య చేసిన సేవలు మరువలేనివని గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండలంలోని షాపెల్లి గ్రామంలో తొలి సర్పంచ్, సీపీఐ నాయకులు తాళ్లపల్లి బుచ్చయ్య 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య స్థూపం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి వెంకన్న, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## యూరియా సరఫరా కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించిన అజ్మీర



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సోసైటి ద్వారా రైతులకు పంపిణి చేస్తున్న యూరియా సరఫరా కార్యక్రమాన్ని అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ అజ్మీర శ్రీనివాస్‌రావు స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ సిబ్బంది భరత్ కుమార్ పాల్గోన్నారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యూరియా రైతులందరికి అందుతుందని ఎవరు కూడా ఆందోళనపడవద్దని బుకింగ్ యాప్ అందుబాటులో వచ్చేంతవరకు ఆయా గ్రామాల్లో యూరియా పంపిణిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలి: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామటౌన్:** జిల్లాలోని పెండెన్సీలను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు.సదరం యూడీఐడీ పెండెన్సీ అంశాలపై ఎస్ఈఆర్పీ సీఈవో ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పాల్గొని మాట్లాడారు. యూడీఐడీ కార్డుల పెండింగ్ కేసులు, ఆన్‌లైన్ అప్‌లోడింగ్, డెమోగ్రాఫిక్ వివరాల సేకరణ, అంచనాకు హాజరుకాని కేసులు, తదితర అంశాలపై ఆయన పలు సూచనలు చేసారు. పెండింగ్‌లో ఉన్న కేసులను, నిబంధనల ప్రకారం వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో 100శాతం పురోగతి సాధించాలని, డేటా సవరణలు, అప్లోడింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో, జీజీహెచ్ సూపరిండెంట్, వైద్యాదికారులు, పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' ప్రజల పక్షాన విరజిల్లాలి: తహసీల్దార్ కోమి



**ప్రజాపక్షం/వేలేరు :** నేటి ఆధునిక సమాజంలో మీడియా కొంగొత్త పోకడలతో దూసుకుపోతున్న తరుణంలో ప్రజాపక్షం దినపత్రిక ప్రజల గొంతుకగా నిలుస్తూ దినదినం ప్రజలక్షాన్నే విరాజిల్లుతూ ప్రతీ అక్షరం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసందానంగా వ్యవహరించాలని హనుమకొండ జిల్లా వేలేరు మండల తహశీల్దార్ హెచ్ కోమి అన్నారు. బుధవారం వేలేరు మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వేలేరు మండల ప్రజాపక్షం విలేకరి జిల్లెల్ల నారాయణ ఆద్వర్యంలో ఆవిష్కరించి వేలేరు మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసంధర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వేలేరు మండల ప్రజలు నూతన సంవత్సరంలో సుఖసంతోశాలతో తులతూగుతూ పాడి పంటలతో చిన్నా పెద్దా అంతా ఆయురారోగ్యాలతో జీవించాలని అలాగే ప్రజాపక్షం దినపత్రిక అనునిత్యం ప్రజల పక్షాన నిలిచి ప్రజాసమసమస్యలకు మార్గం చూపేదిశగా ఉండాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅథిధిగా హాజరైన వేలేరు గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరిని తహశీల్దార్ హెచ్ కోమి శాలువాతో సత్కరించారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక ద్వారా వేలేరు గ్రామస్తులకు 2026 నూతన శుభాకాంక్షలు తెలుపుతూ ఈనూతన సంవత్సరంలో ప్రజాపక్షం దినపత్రిక వార్తా విష్లేషణలో ముందుండడమే కాకుండా ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధాన కర్తగా ఉంటూ మేధావులు, విద్యావంతులు, కార్మికులు, కర్షకులు, శ్రామికులు, రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు అశేశజనావలి ఆదరణ పొందుతూ సబ్బండ వర్గాల ప్రజల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి, తహశీల్దార్ హెచ్ కోమి, డిప్యూటి తహశీల్దార్ విఠల్, ఆర్ఐ సురేందర్, హేమానాయక్, జిపిఓ రవిందర్,రోహన్,వేలేరు మండల ప్రజాపక్షం రిపోర్టర్ జిల్లెల్ల నారాయణ, గ్రామవార్డు సభ్యుడు సునీల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మడికొండ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ: డిసిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఉన్న సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత మడికొండ పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పి. కిషన్, కాజిపేట్ పి. ప్రశాంత్ రెడ్డి డీసీపీకి గౌరవ సూచకంగా పూల మొక్కను అందించి లోపలికి ఆహ్వానించిన పిదప స్టానిక పోలీస్ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించడం జరిగింది. అనంతరం స్థానికపోలీస్ సిబ్బంది తో మాట్లాడి వారి కిట్ ఆర్టికల్స్ ను తనిఖీ చేసిన తర్వాత స్టేషన్ పరిసరాలను గుర్తించి మడికొండ ఇన్స్పెక్టర్ కిషన్, కాజిపేట్ ఏసీపీ ఆధ్వర్యంలో మామిడి చెట్టును నాటడం జరిగింది. అనంతరం స్టేషన్లో ఉన్న అన్ని గదులను పరిసరాలను శుభ్రంగా ఉన్నాయా లేదా అని ప్రత్యక్షంగా చూసిన తర్వాత స్టేషన్ కి సంబంధించిన గత మూడు సంవత్సరాల నేరాలకు సంబంధించి న వివరాలు తీసుకుని వాటిని తగ్గించడం కోసం తీసుకున్న చర్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, నివారణ కోసం తీసుకున్న చర్యలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సస్పెక్ట్ షీట్స్ ఉన్న వ్యక్తుల మీద నిరంతరం నిఘా ఉంచాలని వారి జీవన విధానం ఎలా ఉంది నేరాలకు మళ్ళీ పాల్పడుతున్నారా లేదా అని గుర్తించాలని మహిళలు, పిల్లలు, వృద్ధులు స్టేషన్ కు వచ్చినప్పుడు వారి సమస్యలకు అత్యంత ముఖ్యమైనవని గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాజిపేట్ ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి, ఇన్స్పెక్టర్ పి. కిషన్, ఎస్సై లు రాజబాబు, రాజ్ కుమార్, రామ్ మోహన్, మడికొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి

**గట్టమ్మ ఆలయం వద్ద నూతన పార్కింగ్ ఏర్పాటు**
**ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, పార్కింగ్ ఏర్పాటుతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేదతీరే అవకాశం: మంత్రి సీతక్క**



**ప్రజాపక్షం/ములుగు:** జిల్లా సమీపంలోని గట్టమ్మ గుట్ట వద్ద నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మానంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేదతీరే అవకాశం ఉందని, తల్లికి తలవంచందే భక్తులు ముందు కదలరని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను, ఆర్‌టిసి బస్సులు, ప్రయివేట్ వాహనాల పార్కింగ్ స్థలాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి సుధీర్ రామ్ నాథ్ కేకన్, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే భక్తులు, పర్యాటకులు ముందుగా గట్టమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరమే ముందు సాగుతారని, జాతీయ రహదారి ఆనుకొని ఉన్న గట్టమ్మతల్లి ఆలయం వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని, నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్కింగ్ నుండి ఆలయ మార్గం వరకు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాలు సాఫీగా రాకపోకలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పార్కింగ్ ప్రాంతంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పష్టమైన రేడియం స్టిక్కర్లు, దిశానిర్దేశక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో కూడా స్పష్టంగా కనిపించేలా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఆర్అండ్‌బి శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. **మేడారంలో నూతన పోలీస్‌స్టేషన్ ప్రారభించిన మంత్రి సీతక్క:గోవిందరావుపేట:** ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం నందు నూతనంగా నిర్మించిన నార్లపూర్ పోలీస్ స్టేషన్ ను బుదవారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన లతో కలిసి ఘనంగా ప్రారభించారు ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నూతన పోలీస్ స్టేషన్ ప్రారభం మేడారం మహా జాతర దృష్ట్యా ఎల్లప్పుడూ ప్రజలకు భక్తులకు గుత్తికొయ గిరిజన ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జాతర సమయంలో లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ప్రజల భద్రత ట్రాఫిక్ నియంత్రణ వేగవంతమైన పోలీస్ సేవల అందించడంలో ఈ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ జిల్లాలో పోలీసింగ్‌వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఇది ప్రజలకు మరింత చేరువైన సమర్థవంతమైన సేవలకు నాంది పలుకుతుందని అన్నారు. పోలీస్ స్టేషన్‌లో సేష్టన్ హౌస్ అధికారి ఎస్ఐ హెడ్ కానిస్టేబుల్ స్థాయిలలో సుమారుగా 30మంది పనిచేయనున్నారని నార్లపూర్ పోలీస్ స్టేషన్ హౌస్ అధికారిగా ఎస్ఐ ఏ కమలాకర్ విధులు నిర్వహించనున్నారని పస్రా పరిధిలో ఈ స్టేషన్ పనిచేస్తుందని పస్రా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దయాకర్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ శివం ఉపాధ్యాయ ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి స్థానిక సర్పంచ్ పిరిల భారతీ వెంకన్న సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇద్దరు వృద్ధ దంపతుల ఆత్మహత్య



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ఇద్దరు వృద్ధ దంపతులు ఆత్మ హత్య చేసుకున్న సంఘటన బచ్చన్నపేట మండలంలోని చిన్నరాంచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెల్పిన వివరాల ప్రకారం చిన్న రాంచర్ల గ్రామానికి చెందిన పురుమ రాంరెడ్డి(80), లక్ష్మీ(70) దంపతులు కొం త కాలంగా అనారోగ్యంతో భాద పడుతున్నారని, ఆస్పత్రులకు వెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్య కు పాల్పడ్డారని తెలిపారు. నిండు నూరెళ్ల కలకాలం కలిసి జీవించాలని అగ్నిసాక్షిగా మూడు ముళ్ల బంధంతో ఒకటైన జంట మరణంలో ను కలిసే మృతి చెందడం అందరిని కలిసి వేసింది. భాదితుల ఫిర్యాదు మేరకు ఎస్సై హమీద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సిపిఐలోకి 25 కుటుంబాలు

సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్. రాజారెడ్డి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** సీపీఐ పార్టీ వందేళ్ల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తమ్మడపల్లి జి గ్రామంలో సీపీఐ పార్టి ముఖ్య కార్యకర్తల సమావేశం నాయకులు ఎండీ యాకూబ్ పాషా అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా రాజారెడ్డి హాజరవడం జరిగింది. అనంతరం కాంగ్రెస్, ఇతర పార్టీల నుండి 25 కుటుంబాలు మండల కార్యదర్శి జువారి రమేష్ ఆద్వర్యంలో చేరిన వారికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఎన్నో పోరాటాలు నిర్వహించి పేదలకు భూములను పంపిణి చేయించడంలో పార్టీ కీలకపాత్ర పోషించిందన్నారు. ఎర్ర జెండా సుదీర్ఘ పోరాటాల ఫలితంగా దేశంలో సామాన్య ప్రజలకు శ్రామిక వర్గాలకు ఎంతో ప్రయోజనం కలిగిందన్నారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు మల్లయ్య, సుధాకర్, ఎల్లయ్య, ఎల్లమ్మ, పెద్దరాములు, సోమయ్య, పద్మ, కొమురమ్మ, సింహాద్రి, తదితరలున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి సమ్మయ్య, సీనియర్ నాయకులు చంద్రమౌళి, అజయ్, బుచ్చయ్య, పాల్గొన్నారు.

## విద్యారంగానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక కృషి

**సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరిస్తాం**
**విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**
**రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షే మానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని,విద్య రంగానికి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర షెడ్యూల్ కులాలు, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్ సాధికారిక శాఖ మాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.బుధవారం ఐడిఓసి కార్యాలయంలో భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, పోలీస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, ఆర్సీఓలు, జిల్లా కో ఆర్డినేటర్లు, ఎస్సి కార్పోరేషన్ ఈడీలతో వసతి గృహాలు నిర్వహణ, సౌకర్యాలు, విద్యార్థులకు వైద్య పరీక్షలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థులను తమ పిల్లల్లాగా చూసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. వసతి గృహాల విద్యార్థుల భద్రత, విద్య, భోజనం, వైద్య సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందన్నారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం, అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని, షీటీమ్ ద్వారా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. **విద్య వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే గండ్ర** విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, పోలీస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, ఆర్సీఓలు, జిల్లా కో ఆర్డినేటర్లు, ఎస్సి కార్పోరేషన్ ఈడీలతో వసతి గృహాలు నిర్వహణ అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశం లో మంత్రితో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరిస్, సత్య శారద, భూపాలపల్లి ఎస్పీ సంకీర్త్, ఐటిడిఎ పీఓ చిత్రామిశ్రా, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, ఎస్సి అభివృద్ధి శాఖ అదనపు డైరెక్టర్ సి శ్రీధర్, పాల్గొన్నారు.

## తలారి వెంకటేశ్వర్లు ఆశయాలు కొనసాగిస్తాం

సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** తెలంగాణ ఉద్యమకారుడుగా, భూ పోరాటాల్లో తనవంతు పాత్ర పోషించి అనేక ఉద్యమాలు ఈ ప్రాంతంలో నడిపించిన వ్యక్తి సీపీఐ మాజీ పట్టణ సహాయ కార్యదర్శి, ప్రజానేత అమరజీవి తలారి వెంకటేశ్వర్లు ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి అన్నారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ పట్టణ సహాయ కార్యదర్శి, ప్రజానేత అమరజీవి తలారీ వెంకటేశ్వర్లు 13వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి తలారి వెంకటేశ్వర్లుకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అజయ్ సారధిరెడ్డి మాట్లాడుతూ తలారి వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివని అన్నారు. పట్టణ సహాయ కార్యదర్శిగా పాత బజార్ ప్రాంతంలో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన గొప్ప వ్యక్తి తలారి వెంకటేశ్వర్లు అని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడుగా, భూ పోరాటాల్లో తనవంతు పాత్ర పోషించి అనేక ఉద్యమాలు ఈ ప్రాంతంలో నడిపించిన వ్యక్తి తలారి వెంకటేశ్వర్లు అని అన్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ ధైర్యం చెప్పే తలారీ వెంకటేశ్వర్లు లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన స్ఫూర్తితో ఈ ప్రాంతంలో పార్టీని ముందుకు తీసుకుపోయి ఈ ప్రాంతంలో వార్డు కౌన్సిలర్లుగా గెలిచే విధంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తలారి వెంకటేశ్వర్లు కుమార్తె తలారి కుమారి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రవణ్, నర్రా శ్రావణ్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, మిర్యాల మల్లికార్జున్, రాగం మల్లయ్య, పూల భద్రయ్య, చిలువేరు వికాస్, మంద శంకర్, ఐలయ్య, తండ్రి శ్రీనాథ్, బాలాజీ, వేణు, కృష్ణ, వెంకన్న, నర్సమ్మ, రాజు, శ్రీనివాస్, రవి, రాంప్రసాద్, లక్ష్మి , రమ తదితరులు పాల్గొన్నారు.


## జాతరకు అధికారులు సమన్వయంతో పని చేయాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణం నందు జాతర ఏర్పాట్లపై బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జాతర విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా శాంతి భద్రతల పర్యవేక్షణ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.భక్తుల సౌకర్యార్థం త్రాగు నీరు ఏర్పాటు చేయడం దేవాలయ జాతర ప్రాంగణము, వాహనాలు పార్కింగ్ స్థలములలో లైటింగ్ ఏర్పాటు, అమ్మవార్ల గద్దెల చుట్టూ లైటింగ్ డెకరేషన్ ఏర్పాటు చేయటం నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, 108 వాహనం అదుబాటులో ఉంచాలని, వైద్యులు అందుబాటులో ఉండాలని, శానిటేషన్, జాతరకు వచ్చే అన్ని లింకు రోడ్ల మరమ్మతు, తదితర అంశాలపై చర్చించారు.

## అభివృద్ధి పనులు పరుగులు పెట్టించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీలో రూ.50 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు వేగవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంబంధింత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం భూపా లపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని పెండింగ్ లో ఉన్న పనులు పూర్తయిన పనుల శంకుస్థాపనల పై మున్సిపల్ అధికారులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, భూపాలపల్లి మున్సిపాల్టీకి ప్రభుత్వం 50 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, కొన్ని చోట్ల పనులు పూర్తి చేయడం జరిగిందని కొన్నిచోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయని, పూర్తి చేసిన పనులకు శంకుశాపనలకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. కొంత మంది కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టి సంవత్సరా లు గడుస్తున్న పూర్తి చేయడం లేదని అలాంటి కాంట్రాక్టర్ల కు 60 కింద నోటీసులు జారీ చేసి కాంట్రాక్ట్ రద్దు చేయాలని తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని ప్రమాదకరంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి మున్సిపాల్టీ ఆదాయం వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాల్లో పొరపాట్లు ఉండొద్దు



**ప్రజాపక్షం/జనగామ:** జనగామ మున్సిపల్ పరిధిలోని ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా చూడాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. ఓటర్లు, వార్డుల మ్యాపింగ్, పోలింగ్ స్టేషన్ల పురోగతిపై బుధవారం అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి పింకేష్ కుమార్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాల్లో పొరపాట్లు ఉండొద్దన్నారు. ప్రతి వార్డుకు సంబందించి ఓటర్ల వివరాలు సక్రమంగా మ్యాప్ కావాలన, ఎన్నికల నిర్వాహణకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో పారదర్శకత, సమర్థత అత్యంత కీలకమన్నారు.

**యాప్‌తోనే తేలికగా యూరియా కొనుగోలు**

జిల్లాలో రైతులకు యూరియా ఎరువుల సరఫరా వేగవంతంగా పంపిణీ అవుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. యాప్ ద్వారానే తేలికకగా యూరియా కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. జిల్లా కలెక్టర్ బుధవారం ఎరువులు విక్రయ కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా పంపణీ విధాంను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులు యాప్ ద్వారా పొందిన యూరియా బుకింగ్ ఐడిలను ధృవీకరించి, బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. స్వయంగా డీలర్ లాగిన్‌లో అమ్మకాల నిర్ధారణ ప్రక్రియను నిర్వహించి యాప్ ద్వారా యూరియా పంపణీ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని స్పష్టం చేశారు. యూరియా బుకింగ్ చేయని రైతులు నేరుగా విక్రయ కేంద్రాలకు వచ్చిన సందర్భాల్లో వారికి ఇబ్బందులు కలగకుండా ప్రతి యూరియా లభ్యత ఉన్న కేంద్రంలో వాలింటర్లను నియమించి అక్కడికక్కడే ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా బుకింగ్ చేయించే విధంగా ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబిక సోని, సహాయ సంచాలకులు అపర్ణ, వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

## విందులు చిందులు కాదు లక్ష్యం ముఖ్యం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జన జీవితాలలో రెండు దశాబ్దాలుగా క్రమేపి మార్పు కనిపిస్తుంది. ముఖ్యంగా యువత పాశ్చాత్య సంస్కృతి వైపు పరుగులు పెడు తుంది. భారతీయ సమాజం ఒకప్పుడు బాధ్యత కలిగిన యువతను దేశానికి అందించింది. బాధ్యతతో మెలిగిన యువత సమాజం పట్ల, కుటుంబం పట్ల కూడా బాధ్యతతో వ్యవహరిస్తుండడంతో ఒక మంచి సమాజం రూపు దిద్దు కునేది. కానీ ఇప్పటి యువత ఆలోచనల్లో మార్పు వచ్చింది. మనది మాది అనే ఆలోచన స్థానే నాది అన్న భావన యువతలో దినదినా ప్రవర్ధమాన మైంది. స్వార్థ చింతన ఉన్న వారిలో మాది అన్న భావనైనా గతంలో ఉండేది. మా బంధువులు, మా కుటుంబం అన్న ఆలోచనతో పని చేశారు. అప్పుడు అదే ప్రమాదమనుకుంటే ఇప్పుడు కుటుంబాన్ని కూడా పక్కనపెట్టి నాదెంటి అన్న సంకుచిత భావన పెరిగింది.పండుగలు, పబ్బాలు జన్మది నాల పేరుతో జల్సాగా గడిపేస్తున్నారు. ఇక కొత్త సంవత్సరం అంటే చెప్పా ల్సిన అవసరమే లేదు. విందులు, చిందులు మందుతో గడిపేస్తున్నారు. లక్ష్యం లేకపోతే ఏ వైపుకు పయనించాలో తెలియక జీవితమే వ్యర్థమవు తుంది. నూతన సంవత్సరంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్యం దిశగా పయనించాలని కోరుకుందాం.

## కూనంనేని నూతన సంవత్సర శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నూతన సం.ను పుర స్కరించుకుని కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు, జిల్లా ప్రజలకు హృదయ పూర్వక నూతన సం. శుభా కాంక్షలు తెలిపారు. ఈ నూతన ఏడాది ప్రతీ కుటుంబానికి శాంతి, సుఖ సంతోషాలు ఆరోగ్య తీసుకురావాలని ఆకాంక్షిం చారు. గత సం.లో ప్రజ సహకారంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు మరి ంత వేగవంతంగా చేయనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్య పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్మికులు, రైతులు, యువత, మహిళ లు, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.వైద్యం, ఉపాధి రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## టిజివోస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియే షన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. బుధవారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి టిజివోస్ యూనియన్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఉద్యోగు లకు అండగా ఉంటుందని, ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజివో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వ రరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, కేంద్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులు గంగవరపు నరేందర్, మల్లెల రవీం ద్రప్రసాద్, ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు, హౌజ్ బిల్డింగ్ సొసైటీ కార్య దర్శి పి. విజయ్‌కుమార్, మహిళా అధ్యక్ష, కార్యదర్శులు జి. ఉషశ్రీ, సుధా రాణి, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విఠల్ రావు నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు సిపిఐ,గ్రామస్తుల వినతి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని విఠల్ రావు నగర్ గ్రామంలో సిపిఐ నాయకులు, గ్రామస్తులు కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని బుధ వారం కలిసి వినతి పత్రం అందించారు. బుధవారం విఠల్ రావు నగర్ గ్రా మాని సందర్శించినటు పాయం వెంకటేశ్వర్లుని సిపిఐ మణుగూరు పట్టణ కార్యవర్గ సభ్యులు మంద కోటేశ్వరరావు, బొజ్జ సదానందం, నర్సయ్య, గ్రామ పెద్దలు గుడికందుల కుమార్, తీగల కొమరయ్య, గ్రామస్తులు కలిసి గతంలో విఠల్‌రావు నగర్ గ్రామానికి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుండి కొంత డబ్బులు కేటాయించబడిందని చేపట్టడంతో క మ్యూనిటీ హాలుకు ఉచితంగా గ్రామస్తులు కుమార్ అనే వ్యక్తి స్థలం ఉచి తంగా అందజేశారని ఎలక్షన్లు రావడంతో అవి ఆగిపోయాయన్నారు. కా వున సంబంధిత ఎమ్మెల్యే ఈ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు కృషి చేసి కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తే గ్రామ ప్రజలందరికీ చిన్నచిన్న ఫంక్షన్లకి అన్నింటికి గ్రామస్తులకు ఉపయోగకరంగా ఉంటుందని వారికి వివరించి, ఒక వినతి పత్రాన్ని అందజేశారు.

## నర్సరీ పనులు ప్రారంభించాలి : ఎంపిడిఒ



**ప్రజాపక్షం/పాల్వంచ :** నూతనంగా పదవీ బాద్యతలు చేపట్టిన సర్పంచ్‌ల ద్వారా నర్సరీ పనులను ప్రారంభించాలని ఎంపిడిఓ కుడుములు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామపంచాయితీ కార్య దర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలకు నీరు సరఫరా చేయాలన్నారు. వాచ్ అండ్ వార్డు పేమెంట్‌లను చెల్లించాలని సూచించారు. ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు అయిన ఇందిరమ్మ గృహాల లబ్దిదారులకు 90 రోజుల మస్టర్ పేమెంట్ చేయాలన్నారు. నర్సరీ పనులను వెంటనే ప్రారంభించి బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ చెన్నకేశవులు, ఏపిఓ పోరండ్ల రంగా, ఈసి. పుల్లయ్య, పంచాయితీ కార్య దర్శులు, క్షేత్ర, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెజొనెన్స్‌లో న్యూ ఇయర్ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీ నగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2026 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం పాఠశాలలో నిర్వహించిన వేడుకలు అంబరాన్ని అంటాయి. కేరింతలతో వేడుకలు నిర్వహించారు. డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవ త్సరంలో కొత్త కొత్త విషయాలు తెలుసుకుని మంచి అలవాట్లు అలవర్చుకో వాలని విద్యార్థులకు వివరించారు. గత సంవత్సర అనుభవాల స్ఫూర్తితో ఈ ఏడాది ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని అత్యున్నత స్థాయికి ఎదగాల న్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారుల నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని చిరు వ్యాపారుల నూతన కమి టీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మిరి యాల రమణగుప్తా ఆధ్వర్యంలో జరిగిన చిరు వ్యాపారుల సమావేశంలో ఈనూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతనన కమిటీ సభ్యులుగా పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, కెశంకరమ్మ, ఆదిమూలం పుల్లారావు, చిన్నంస్వామి, పెగళ్ళపాటి శ్రీనివాసరావు, షేక్.రబ్బానిలను ఎన్నుకు న్నారు. వీధి వ్యాపారుల శాశ్వత పరిష్కారం కోసం మిరియాల రమణ గుప్తా ఆధ్వర్యంలో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. గత 30 సంవత్స రాల నుండి మధిర పట్టణంలో రోడ్ల వెంట బడ్డీ కొట్లు పెట్టుకుని జీవనం సాగిస్తుండగా మున్సిపాల్టీ అధికారులు తొలగించడంతో జీవనం కోల్పో యామని వారు తెలిపారు. మాకు శాశ్వతంగా ఒక పరిష్కార మార్గం చూపించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమా ర్కను కోరారు. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

# పార్టీ విస్తృతిలో 'చావా' పాత్ర చిరస్మరణీయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కమ్యూనిస్టు పార్టీ విస్తృతిలో సుగుణమ్మ పాత్ర చిరస్మరణీయమని చావా వెంకటేశ్వరరావు కుటుంబం పార్టీకి అంకితమై పని చేసిన కుటుంబమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూ నంనేని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ చీలిక అనంతరం సిపిఐ నిర్మాణంలో చావా వెంక టేశ్వరరావు ఎనలేని కృషి చేశారని చావా వెంకటేశ్వరరావుకు ఆయన సతీమణి సుగుణమ్మ అన్ని విధాలా సేవలు అందించారని ఆయన తెలిపారు. చావా సుగుణమ్మ సంస్మరణ సభ బుధవారం కొక్కిరేణి గ్రామంలో జరిగింది. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ తిరుమలాయపాలెం సమితిగా ఉన్నప్పుడు చావా వెంకటేశ్వరరావు సమితి అధ్యక్షున్ని గెలిపించడంతో పాటు పాలేరు నియోజక వర్గం నుంచి సిపిఐ అభ్యర్థి గా పోటీ చేసిన భూపతిరావును కూడా గెలిపించి సిపిఐ బలమెంతో చూపించారన్నారు. పార్టీ విభజన తర్వాత అనేక మందిని పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు అనేక మందిని నాయకులుగా తీర్చిదిద్దడంలో చావా పాత్ర ప్రముఖమైందన్నారు. చావా రాజకీయాల్లో నిమగ్నమైనప్పుడు ఆయన సతీమణి సుగుణమ్మ అన్ని విధాలా ఆయనకు తోడ్పాటు నందించిందని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు ఎందరికో ఆమె నిత్యం భోజనాలు పెడుతూ ఎంతో ఆప్యాయంగా చూసుకునేదని కూనంనేని తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని ఒక పక్క ధన రాజకీయాలు, మరో పక్క మత రాజకీయాలు పెరిగి వ్యవస్థను కలుషితం చేస్తున్నాయన్నారు. పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్న నేపథ్యంలో ప్రజల కోసం పని చేసేందుకు కమ్యూనిస్టులు అవసరమని ఆయన తెలిపారు. రానున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేయడమే అందరి లక్ష్యం కావాలన్నారు.ఐఎఫ్‌టియు జాతీయ నాయకులు పోటు ప్రసాద్ (పుల్లయ్య), సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహలక్ష్మి , రిటైర్డ్ పోలీస్ అధికారి సుభాష్ చంద్ర బోస్, చావా తనయుడు చావా వేణు, సి పిఐ నాయకులు రాధాకృష్ణ, బాలరాజు, సిపిఎం నాయకులు శ్రీ ను పాల్గొన్నారు. వెంకటేశ్వరరావు, సుగుణమ్మ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## 2026లో తీపి జ్ఞాపకాలు

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అధికారం కోల్పోయినా విర్రవిగితే విజ్ఞత నేర్పక తప్పదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరిం చారు. అహంకారం తగ్గని కొందరు నాయకులకు కాలమే సమాధానం చెబుతుందని ఆయన అన్నారు. 2025 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అనేక తీపి జ్ఞాపకాలను మిగిల్చిందని ఆయన తెలి పారు. బుధవారం ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో పాలేరు నియోజక వర్గంలో గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ పాలేరు నియోజక వర్గంలో ప్రజలు ఎంతో చైతన్యవంతంగా ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. వచ్చిన ఫలితాలతో పొంగిపోకుండా గెలిచిన సర్పంచ్‌లు పల్లెలను ప్రగతి పథాన నడపాలని ఆయన సూచించారు. గెలిచిన వారు ఓడిన వారు కూడా నా దృష్టిలో సర్పంచులేనని ప్రతి ఒక్క రిని కంటి రెప్పలా కాపాడుకుంటామని ఆయన తెలిపారు. నియోజక వర్గంలోని 134 పంచాయతీలలో సుమారు 70 శాతం కాంగ్రెస్ మద్దతు దారులు గెలవడం శుభపరిణామమన్నారు. చిన్నపాటి విబేధాల కార ణంగా స్వల్ప తేడాతో కొన్ని పంచాయతీలు ఓడిపోయామని గతంలో ఏలిన వారు గెలిచిన స్థానాల సంఖ్య కనిష్ట స్థాయికి పడిపోవడంతో ప్రజలు ఎవరి పక్కన ఉన్నారో స్పష్టమైందన్నారు. మున్సిపల్ ఎన్నిక ల్లోనూ ఇదే రకమైన ఫలితాలు వస్తాయని పొంగులేటి ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర సాయం లేకున్నా 22,500 కోట్లతో ఇందిరమ్మ గృహ నిర్మాణం చేపట్టామని ప్రతి నియోజక వర్గంలోనూ 3,500 ఇండ్లు నిర్మి స్తామన్నారు. ఈ సభలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, వివిధ కార్పోరేషన్ల ఛైర్మెన్లు, వైస్ ఛైర్మెన్లు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో నవ భద్రాద్రి

మాస్టర్ ప్లాన్‌పై తుమ్మల చర్చ

మూడేళ్లలో విస్తరణ పనులు పూర్తి

ఆలయాభివృద్ధికి తుమ్మల మార్క్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాద్రి త్వరలో నవ భద్రాద్రిగా మారనుంది. ఇందుకు తుమ్మల మరో సారి మాస్టర్ ప్లాన్ పై బుధవారం చర్చించారు. గత బిఆర్ఎస్ పాలనలో మంత్రిగా ఉన్న తుమ్మల భద్రాద్రి సుందరీకరణకు తనదైన శైలిలోశ్రీకారం చుట్టారు. కానీ అడుగులు ముందుక పడ లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాద్రిని దేశానికే తలమానికంగా అభివృద్ధి చేస్తామని చెప్పగా, ఇప్పుడు అందుకు సంబంధించిన అడుగులు శరవేంగగా ముందుకు పడుతున్నాయి. ఈ మాఢ వీధులతో పాటు ఆలయాభివృద్ధి పనులను మూడేళ్ల లో పూర్తి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. దీం తో భద్రాద్రి ఆలయానికి కాంగ్రెస్ ప్రభుత్వ హ యాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారథ్యంలో నూతన శోభ సంతరించుకోనుంది. 2027 లో జరగనున్న గోదావరి పుష్కరాలను సైతం కుంభ మేళా తరహాలో జరిపించేందు కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2003 ,2015 లో జరిగిన గోదావరి పుష్కరాల సమయంలో తుమ్మల నాగేశ్వరరావుమంత్రిగానే ఉన్నారు. ఈ సారి 2027లో జరిగే పుష్కరాలకు సైతం ఆయన మంత్రిగా ఉండటం విశేషం. పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకు, ప్రస్తుత పరిస్థితులు, పెరిగే భక్తుల సంఖ్యకు అనుగుణంగా తుమ్మల దిశా నిర్దేశం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శానిటేషన్ అత్యంత కీలకం కావడంతో పాటు పుష్కరాలు వర్షాకాలంలో జరగుతుంటంతో కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోనున్నారు. గోదావరి పుష్కరాలు ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా ఉండాలని తుమ్మల దేవాదాయ కమీషనర్ హరీష్‌ను ఆదేశించారు.

**ఆలయాభివృద్ధికి తుమ్మల మార్క్ :** భద్రాద్రి ఆలయాభివృద్ధిపై తుమ్మల తనదైన మార్కు వేయనున్నారు. గత ప్రభుత్వం ఆయనే మాస్టర్ ప్లాన్‌లు తయారు చేయించి చర్యలకు పూనుకున్నప్పటికీ పరిస్థితులు అనుకూలించక పోవడంతో ముందడుగు పడలేదు. ఆ నాటి తెలుగుదేశంలో ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న తుమ్మల పట్టుపట్టి గోదావరి కరకట్ట నిర్మాణం చేపట్టారు. నవభద్రాద్రి మెరవాలని, మంత్రి తుమ్మల ఆలోచన ఆ శ్రీరాముని దివ్యాశిస్సులతో ముందుకు సాగాలని రామ భక్తులు కోరుకుంటున్నారు.

# యూరియా కొరతను నివారించండి

రైతు సంఘాల వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని కొరత లే కుండా యూరియాను అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు బొంతు రాంబాబు లు మాట్లాడుతూ ఏడాది కాలంగా యూరియా సరఫరా చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపుతుందన్నారు. వ్యవసాయ రంగాన్ని దివాళా తీయించేందుకు బిజెపి నేతృత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంతరం కుట్ర చేస్తుందని వారు ఆరోపించారు. ఒక పక్క ఎరువుల ధరలు పెం చడం, మరో పక్క యూరియా కొరతను సృష్టించడం వెనక కార్పొరేట్ల కుట్ర దాగి ఉందన్నారు. తక్షణమే యూరియా కొరతను నివారించేందుకు రైతులకు సరిపడ యూరియాను దిగుమతి చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు ఎస్‌కె మీరాసాహెబ్ పాల్గొన్నారు.

## స్మార్ట్‌కిడ్జ్‌లో నూతన సంవత్సర వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2026 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బుధవారం నిర్వహించిన వేడుకలు అంబరాన్ని అంటాయి. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ చిన్నారులు నృత్యాలు చేస్తూ ఆట పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. పాఠశాలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నూతన సంవత్సరం అందరికీ శుభాలు అందించాలని కృష్ణచైతన్య తెలిపారు. చదువుతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులు ఘన విజయాలను సాధించి పాఠశాలకు జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని కోరారు. డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యమాలు, త్యాగాలతో నూరేళ్లు పునీతం

18న ఖమ్మం కేంద్రంగా ముగింపు సభ

ఎస్.కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/చర్ల :** ఉద్యమాలు, త్యాగాలతో ఈ శతవసంతం పునీతంగా మారిందని, సిపిఐ నూరేళ్ల వేడుకను ఘనంగా నిర్వహించుకుందామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. మండల కౌన్సిల్ సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో పాలెం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యాతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దేశస్వతంత్రాని కంటే ముందే సిపిఐ ఆవిర్భవించిందని, ఆ నాటి నుండి నేటి వరకు ప్రజా క్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు సాగిస్తోందని తెలిపారు.సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాల రావు, నానిపల్లి భద్రం, మండల ఆర్గనైజర్ జాకీర్ హుస్సేన్, సర్పంచ్‌లు నూపా సునీత, శ్యామల తిరుపతిరావు, మడివి శ్రీనివాస్, కల్లూరి సీతారాములుతో పాటు వెంకట నర్సింహా, సీతారామయ్య, అనసూయ, రాజారావు, ముత్తయ్య, రాజు దేవయ్య, సుక్కయ్య, వెంకట్, సింగయ్య, లక్ష్మ య్య, శంకర్, వామనరావు, సీతారాములు, వెంకటేశ్వర్లు, నర్సయ్య, శంకర్, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెంలో :** సిపిఐ శతవంసతాల ముగింపు సభ జీపు జాతాను జయప్రథం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. మండల కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ నెల 3న చర్ల మండల కేంద్రంలో జీపు జాతాను సీనియర్ నాయకులు కే నారాయణ ప్రారంభిస్తారని, ఈ జాత 7వ తేదిన సుజాతనగర్ మండలంలో ముగుస్తుందన్నారు. 5 లక్షల మందితో ఖమ్మంలో జరిగే ముగింపు వేడుకకు భారీ జనసమీకరణ చేయాలన్నారు. సిపిఐ మండల కార్యదర్శి బొల్లోజు వేణు, సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, సీనియర్ నాయకులు రామిరెడ్డి, మందపాటి సుధాకర్ రెడ్డి, కాకా వెంకటేశ్వర రావు, పాయం రాజు, పాయం ఎర్రయ్య, గొంది నాగేశ్వరరావు, కొర్సా కోటేష్, నూతన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవ సభకు విస్తృత ప్రచారం

జిల్లా వ్యాప్తంగా భారీ హోర్డింగ్‌లు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరగనున్న భారీ బహిరంగ సభకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామ గ్రామాన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు అమరుల పేరుతో ప్రత్యేక హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మొదటి దశ గోడ రాత(వాల్ రైటింగ్స్)లను పూర్తి చేశారు. ఖమ్మం నగరానికి నలు మూలల నుంచి జనవరి 18న ప్రదర్శనలు వస్తుండడంతో నలువైపులా ప్రధాన రహదారులకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారుల వెంట భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. బైపాస్ రోడ్డు, వైరా రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు, బోనకల్ క్రాస్ రోడ్డు లలో ఫ్లెక్సీల ఏర్పాటు జరుగుతున్నాయి. జనవరి 18న జరిగే బహిరంగ సభ సందర్భంగా కాల్వొడ్డు నుంచి జనసేవాదళ్ కవాత్, ప్రజా సంఘాల ప్రదర్శన బోనకల్ రోడ్డు నుంచి కళాకారుల ప్రదర్శన సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ నుంచి ప్రజా ప్రదర్శన నలువైపుల నుంచి రానుంది.రెండు రోజుల పాటు జాతీయ కౌన్సిల్ కూడా జ రగనుండడంతో ఆ దిశగా కూడా ఏర్పాట్లను పూ ర్తి చేస్తున్నారు. 19, 20 తేదీలలో జాతీయ కౌ న్సిల్ సమావేశం ఖమ్మంలో జరగనుంది. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాతో పాటు సి పిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, వామపక్షాలకు చెందిన దీపాంకర్ భట్టాచార్య సహా పలువురు జాతీయ నేతలు హాజరవుతున్న నేపథ్యంలో ప్రచారానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు.

**మూడు నుంచి ప్రచార జాతా :** శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను పురస్కరించుకుని మూడు నుంచి ఏడు వరకు ప్రచార జాతాను నిర్వహించనున్నారు. మూడవ తేదీ ఉదయం 10 గంటలకు సత్తుపల్లిలో జాతా ప్రారంభమవుతుంది. జాతాను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రారంభించనుండగా ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్ పాల్గొననుండగా జాతాకు జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి నేతృత్వం వహించనున్నారు. సత్తుపల్లిలో ప్రారంభమై వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, కొణిజర్ల, వైరా మండలాల మీదుగా ఖమ్మంకు చేరుకోనుంది. ఈ జాతా మూడవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించనుంది.

## పువ్వాడ నగర్‌లో పర్యటించిన తుమ్మల యుగంధర్

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని పువ్వాడ నగర్ గ్రా మంలో కాంగ్రెస్ జిల్లా యూత్ నాయకులు తుమ్మల యుగంధర్ పర్యటించారు. బుధవారం తుమ్మల యుగంధర్ పువ్వాడ నగర్ గ్రామంలో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ సిద్దిఖ్ గ్రా మంలో ఉన్న నీటి సమస్యలతో పాటు ఇంటి పన్నులు, పట్టా సమస్యలను తుమ్మల యుగంధర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. తుమ్మల యుగంధర్ అధికారులతో మాట్లాడి సమ స్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధికి నా యకులు కృషి చేయాలని యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, పార్టీ ఇంచార్జి ఆస్రీఫ్, ఉప సర్పంచ్ ఆడూరి రాణి, వార్డు సభ్యులు మద్దిరాల శ్రీదేవి, సూరబోయిన రజిత, నాయకులు కాంపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ




## కివీస్‌తో వన్డేలకు శ్రేయాస్ డౌటే

స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ గ్రౌండ్‌లో అడుగుపెట్టడం మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో అతను గాయపడ్డ విషయం తెలిసిందే. క్యాచ్ అందుకోబోయి కింద పడ్డ అయ్యర్‌కు .. కడుపులో మోచేయి వత్తేసింది. దీంతో అతని ప్లీహం(స్ప్లీన్) దెబ్బతిన్నది. దాని నుంచి రక్తస్త్రావం జరిగింది. అయితే ప్రమాదం నుంచి ఇంకా కోలుకుంటున్న శ్రేయాస్ అయ్యర్.. న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉంటాడన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ ఓ నివేదిక ప్రకారం మాత్రం ప్రమాదం తర్వాత అయ్యర్ సుమారు ఆరు కిలోల బరువు తగ్గినట్లు తెలుస్తోంది. అతని మాంస కణజాలం తగ్గడం వల్ల బరువు చాలా వేగంగా కోల్పోయినట్లు డాక్టర్లు చెబుతున్నారు. విజయ్ హజారే ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్ ఆడే అవకాశాలు ఉన్నట్లు ఓ మీడియా కథనాన్ని రాసింది. జనవరి 3, 6వ తేదీల్లో జరిగే మ్యాచుల్లో అతను ఆడుతాడని డౌట్ వ్యక్తం చేసింది. దీంతో కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అయ్యర్ అందుబాటులో ఉంటాడని కూడా ఊహాగానాలు వినిపించాయి. అయితే శ్రేయార్ అయ్యర్ 50 ఓవర్ల మ్యాచ్ ఆడగలడా లేదా అన్నది సందేహంగా ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. కడుపు సర్జరీ కావడం వల్ల అతను ఫిజికల్‌గా గ్రౌండ్‌లో గడపడం ఎంత వరకు వీలు అవుతుందో తెలియదన్నారు. కానీ శ్రేయాస్ మాత్రం స్కిల్ ట్రైనింగ్ ప్రారంభించాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉన్నది. 50 ఓవర్లకు తగినట్లు అతను ఫీల్డింగ్ చేయగలిగితే అప్పుడు విజయ్ హజారేలో ఆడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

## కోమాలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామియన్ మార్టిన్.. కోమాలోకి వెళ్లారు. 54 ఏళ్ల వయసున్న ఆ మాజీ బ్యాటర్.. బాక్సింగ్ డే రోజున కోమాలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మెనింజిటిస్ వ్యాధితో బాధపడుతున్న అతను క్వీన్స్‌ల్యాండ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ అయిన డామియన్



మార్టిన్ ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరపున 67 టెస్టులు, 208 వన్డేలు ఆడాడు. ప్రస్తుతం డేమియన్ మార్టిన్‌కు ఇండ్యూస్డ్ కోమా పద్ధతిలో చికిత్స అందిస్తున్నారు. ఆసీస్ మాజీ క్రికెటర్లు సోషల్ మీడియాలో రియాక్ట్ అవుతున్నారు. మార్టిన్‌కు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నారని, ఫ్యామిలీ ధైర్యంగా ఉండాలని ఆడమ్ గిల్‌క్రిస్ట్ తెలిపారు.

1992 నుంచి 2006 మధ్య కాలంలో ఆస్ట్రేలియా తరపున డామియన్ మార్టిన్ 67 టెస్టులు ఆడాడు.2000 సంవత్సరంలో ఆరేళ్ల గ్యాప్ తర్వాత అతన్ని మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. స్టీవ్ వా నేతృత్వంలోని ఆసీస్ జట్టులో అతను కీలక బ్యాటర్‌గా కొనసాగాడు. 2006 యాషెస్ సిరీస్ మధ్యలో అతను అకస్మాత్తుగా రిటైర్ అయ్యాడు. టెస్టుల్లో అతను 46 సగటుతో 4406 పరుగులు చేశాడు. దీంట్లో 13 సెంచరీలు ఉన్నాయి. 2003లో ఆస్ట్రేలియా వన్డే వరల్డ్‌కప్ గెలిచింది. ఆ జట్టులో మార్టిన్ ఉన్నాడు. ఇండియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మార్టిన్ 88 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. రికీ పాంటింగ్‌తో కలిసి 234 రన్స్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వన్డేల్లో డామియన్ మార్టిన్ 40 సగటుతో 5346 రన్స్ చేశాడు. దీంట్లో అయిదు సెంచరీలు ఉన్నాయి.

## విజయ్ హజారే ట్రోఫీ.. మళ్లీ ఓడిన ఆంధ్ర, హైదరాబాద్

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 74 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఆంధ్రకు నాలుగు మ్యాచ్‌ల్లో ఇది మూడో ఓటమి. తొలుత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఆంధ్ర 47.2 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌటైంది. ఒక్క బ్యాటర్ కూడా కనీసం అర్ధ శతకం చేయలేదు. ఓపెనర్ సిఆర్ జ్ఞానేశ్వర్ (33) టాప్ స్కోరర్. కేఎస్ నరసింహ రాజు (30), నితీశ్ కుమార్ రెడ్డి (30), హేమంత్ రెడ్డి (29), జాగర్లపూడి రామ్ (20*) పరుగులు చేశారు. శ్రీకర్ భరత్ (4), రికీ భుయ్ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సౌరాష్ట్ర బౌలర్లలో అంకుర్ పన్వార్ (5/27) సత్తాచాటాడు. చిరాగ్ జైన్, హితేన్ కాన్బి, పార్థ్ భుట్, సమర్ గజ్జర్ ఒక్కో వికెట్ తీశారు.

విశ్వరాజ్ జడేజా (3), హెత్విక్ కోటక్ (7), ప్రేరక్ మన్కడ (13), సమర్ గజ్జర్ (0) వరుసగా పెవిలియన్‌కు చేరడంతో సౌరాష్ట్ర తొలుత తక్కువ స్కోరుకే ఆలౌటయ్యేలా కనిపించింది. 62 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆ జట్టును ఓపెనర్ హార్విక్ దేశాయ్ (61).. ఆరు, ఏడు స్థానాల్లో వచ్చిన చిరాగ్ జైన్ (69), రుచిత్ అహిర్ (76; 54 బంతుల్లో) ఆదుకున్నారు.ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు 3, కేఎస్ నరసింహ రాజు 2, నితీశ్ రెడ్డి, జాగర్లపూడి రామ్ చెరో వికెట్ పడగొట్టారు.

### హైదరాబాద్‌కు వరుసగా నాలుగో ఓటమి

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో బరోడా 37 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా 4 వికెట్ల నష్టానికి 417 పరుగులు చేసింది. టాప్3 బ్యాటర్లు నిత్య పాండ్య (122), అమిత్ పాసి (127), కృనాల్ పాండ్య (109; 63 బంతుల్లో) శతకాల మోత మోగించారు. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 49.5 ఓవర్లలో 380 పరుగులకు ఆలౌటైంది. అభిరత్ రెడ్డి (130), ప్రగ్యాన్ రెడ్డి (113) శతకాలు చేశారు. ఓపెనర్లు అమన్ రావు పేరాల (39), తన్మయ్ అగర్వాల్ (32) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.

# ఫోకస్ — చరిత్ర — ఇయర్ ఎండర్




చరిత్రపై 2025లో అధ్యయనాలు... పరిశోధనలు పెరిగాయి. కొన్ని కీలక అంశాలను కనుగొన్నారు కూడా. ఇవి మన పురాతన సాంస్కృతిక, జీవన విధానాలపై కొత్త అవగాహన ఇస్తున్నాయి.



## పెరిగిన అధ్యయనాలు..

ఇంగ్లాండ్‌లో 400,000 సంవత్సరాల క్రితమే నిప్పును వినియోగించారని నిరూపించే సాక్ష్యాన్ని కనుగొన్నారు, ఇది ప్రాథమిక మానవుల నైపుణ్యాలను చాటుతుంది. స్పెయిన్‌లో 20,000 సంవత్సరాల పూర్వపు తిమింగల ఎముకల పనిముట్లు, బెలీజ్‌లో మాయా రాజవంశానికి చెందిన ఒక సమాధి, ఈజిప్టులో 18వ రాజవంశపు ఫారోహ్ చివరి సమాధిని గుర్తించారు. అక్కడి పరిశోధించి తెలుసుకున్న కొత్త విషయాలు, పురాతన మానవ డిఎన్ఎ, పాత మైగ్రేషన్ సిద్ధాంతాలను సవాలు చేస్తోంది. అలాగే, ప్రారంభ మానవులు 8,500 సంవత్సరాల క్రితం మాల్టాకు నావ ద్వారా ప్రయాణించారని, పోంపేయ్‌లో వీసువియస్ అగ్నిపర్వత విస్ఫోటనం తర్వాత మానవ మస్తిష్కం కంచు వంటి స్థితిలో నిలిచినట్లు కనుగొన్నారు. జన్యు (జెనెటిక్) పరిశోధనలు 'సల్యూట్రియన్ హైపోథీసిస్'ను విరోధిస్తూ మొదటి అమెరికన్లు ఆసియా వంశస్థులే అని నిర్ధారించాయి. అలాగే, ప్రాచీన ఈజిప్/ వ్నఎ విశ్లేషణలు మల్టీ స్ట్రాటిజిక్ పూర్వీకుల సంబంధాలను సూచిస్తూ పాత వర్ణ ఆధారిత అభిప్రాయాలను సవాలు చేశాయి. ప్రపంచంలోని ఇతర ప్రాముఖ్యత కలిగిన చారిత్రక శిథిలాలు అనేకం బయటపడ్డాయి. బోల్వియాలో టోరో టోరో నేషనల్ పార్క్‌లో 16,600 డైనోసార్ కాళ్ల ముద్రలు, 1,378 ఈత ట్రాక్లు కనిపించాయి. స్కాట్లాండ్‌లో 6,000 సంవత్సరాల క్రితమైన నియోలిథిక్ హాల్ బయటపడింది. ఇది స్టోన్‌హెంజ్ కన్నా పూర్వకాలానికి చెందినది. పుస్తకాలు, చారిత్రక విశ్లేషణలలో కూడా కొత్త అధ్యయనాలు జరిగాయి. హార్లెమ్ పునరుజ్జీవన సమయం నాటి 'ఎ లెలియా వాకర్' గురించి 'ఎ లెలియా బండిల్స్' పుస్తకం, మహిళా డిటెక్టివ్స్, ప్రజా రవాణా చారిత్రక ప్రాముఖ్యతపై అధ్యయనాలు, సాంఘిక, సాంస్కృతిక భావాలను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతున్నాయి. ఈ ఏడాది జరిపిన కొన్ని చారిత్రక పరిశోధనల్లో కొన్ని సైన్స్ రహస్యాలకు పరిష్కారం లభించింది. ఆస్ట్రియాలో 18వ శతాబ్దపు ఓ చర్చ్ మాన్ ఎయిర్ డ్రైడ్ చాప్లెన్‌గా ఉన్న వ్యక్తి శవం ఇప్పటికీ పాడు కాకుండా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. అంతేకాదు, ఆ మమ్మీపై జరుపుతున్న అధ్యయనాల్లో, నాటి జీవన పరిస్థితులు... సంప్రదాయ 'మమ్మీఫికేషన్' గురించిన కొన్ని ప్రశ్నలకు సమాధానం రాబడుతున్నాయి. మొత్తం మీద ఈ ఏడాది జరిగిన చారైత్రక, జన్యు పరిశోధనలు ప్రాచీన మానవ జీవితాన్ని, అన్వేషణలను, మసాంస్కృతిక అభివృద్ధిని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ఒక గొప్ప దశగా నిలిచాయి. ఇవి భవిష్యత్తులో మనకి మన పురాతన వారసత్వం, అన్వేషణ పద్ధతులు, మరియు సాంస్కృతిక అవగాహనపై మరింత లోతైన అవగాహన ఇవ్వగలవని సూచిస్తున్నాయి. ఈ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా పురావస్తు పరిశోధనల, చారిత్రక పునఃవిమర్శలతో కూడిన అత్యంత ప్రభావితమైన సంవత్సరంగా నిలిచింది. ప్రాచీన నాగరికతలపై శర్చించింది అని తెలియజేసే నూతన కనుగొన్న అంశాలు.. వివరాలు వెలుగులోకి వచ్చాయి, ఇవి మన మనుష్యుల ప్రాచీన జీవన శైలి, ఆచారాలు, సమాజ నిర్మాణం పై అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నాయి. ఈ ఏడాది వెలిగిన కనుగొన్న అనేక విషయాలు కేవలం గతం గురించి, అదే విధంగా ఇప్పటి మనకు తెలిసిన మార్పులు, ధోరణుల గురించి మాత్రమే తెలియచేయడం లేదు. మన భవిష్యత్తు తరాల కోసం పూర్వీకుల జీవన శైలులు, సాంకేతిక పరిజ్ఞానం, తదితర అంశాలపై మరింత సమగ్రమైన అవగాహనను ఇవ్వగలదు. ఈ అన్వేషణలు ఇంకా కొనసాగుతుండగా, మన పురాతన వారసత్వం మరింత లోతుగా వెలుగులోకి వస్తుందని ఆశించవచ్చు.



- ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి జరిగిన ముఖ్యమైన ఆవిష్కరణల్లో ఒకటి టర్కీలోని అనేక ప్రాచీన నగరాల ఖనిజ పరిశోధనలలో వెలుగులో పెల్లి ప్రాచుర్యం పొందిన దేహాన్ని చూపిస్తుంది. ఈ శాఖలో నీఓలిథిక్ స్థలాల్లోని విగ్రహాలు, రోమన్, బైజాంటైన్, మధ్యయుగస్థాయి గుర్తుల వరకు విస్తరించిన అవశేషాలు కనబడ్డాయి. ఇవి అక్కడి పురాతన జీవన విధానాలు, ఆధ్యాత్మిక విశ్వాసాల మీద కొత్త సమాచారం ఇస్తున్నాయి.
- ఇజిప్టులో సక్కారా ప్రాంతంలో చాలా ప్రాచీనమైన శతాబ్దాలకు చెందిన సమాధిని కనుగొన్నారు. ఇది ఐజిప్టియన్ ఐతిహాసిక నిర్మాణాలు, రాజకుటుంబ సంబంధిత జీవన శైలి గురించి కొత్త సమాచారాన్ని అందిస్తున్నది.
- అల్బానియాలో కూడా క్రీస్తుశకం 3 లేదా 4వ శతాబ్దం నాటి ఒక భవన రోమన్ సమాధి ప్రత్యక్షమైంది, దీని ఉన్న విలక్షణ ద్విభాషా శిలాలిపి (గ్రీక్.. లాటిన్) మనకు ఆ కాలపు సంస్కృతుల పరస్పర సంబంధం గురించి విలువైన ఆరాధన సూచనలును అందిస్తుంది.
- స్కాట్లాండులో 3,300 సంవత్సరాల పూర్వం జరిగిన ఒక సంకల్ప ఘటనలో మరణించిన వ్యక్తుల కాలుష్య అవశేషాలను గుర్తించారు. ఇవి ఆ ప్రాకృతిక ఘటన లేదా వ్యక్తిగత సంఘటనపై పరిశోధనలకు దారితీస్తున్నాయి.
- లండన్‌లోనూ టీంకాలపు సమాధి అవశేషాలు వృద్ధి పొందడం చూసి, 1348లో ప్రసిద్ధ బ్లాక్ డిత్ సమయానికి సంబంధించిన మృతదేహాలు, ఇతర పునరుద్ధి సంగ్రహం పురాతన బ్రిటన్‌లోని సామాజిక, ఆరోగ్య పరిస్థితులపై కొత్త సూచనలు ఇస్తున్నాయి.
- కొంత మందికి బైబిలియన్ కథలతో సంబంధం ఉన్నట్లుగా భావించే అరారాట్ పర్వతం పక్కన ఉన్న ప్రాంతంలో నోయా యొక్క నౌక కథతో జత కలిగిన చెరమెంటరీ వస్తువులు కనబడటమూ, పరిశోధకులకు ఆ ప్రాంతంలో మానవ వసతి ఉండేదన్న అభిప్రాయానికి తావిస్తున్నది.
- పురావస్తు శాస్త్రం కూడా ఈ ఏడాది నూతన సాంకేతికతలను అపనమించి అభివృద్ధి చెందింది. డీప్‌లర్నింగ్, ఉపగ్రహ ఛాయాచిత్రాల విశ్లేషణ వంటి ఆధునిక ఉపకరణాలు వినియోగించి పూర్వ కాలపు లేదా మృగాల స్థలాలను కనుగొనడంలో సాయం చేశారు, ఇవి అధ్యయనాలు, పరిశోధనలు చేసేవారికి ఒక పెద్ద శాస్త్రపునర్విమర్శను అందిస్తున్నాయి.

## గ్రామగ్రామాన సిపిఐ సభ్యత్వ నమోదు

మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు



**ప్రజాపక్షం/చింతపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా యాదగిరిరావు హాజరై మాట్లాడారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే వంద సంవత్సరాల ముగింపు బహిరంగ సభకు పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. 2026 సంవత్సరానికి సంబంధించి సిపిఐ నూతన సభ్యత్వ నమోదును గ్రామగ్రామాన నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులుగా గెలిచిన ఉపసర్పంచ్, వార్డు మెంబర్లకు సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో శాలువాలతో ఉజ్జిని యాదగిరిరావు ఘన సన్మానం చేశారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పాండురంగారావు, సహాయ కార్యదర్శి మండల కార్యవర్గ సభ్యులు మల్లోజు శేఖరాచారి, జోగు శ్రీరాములు, కొడిదాల వెంకటయ్య, వేముల బుచ్చయ్య, పల్లపు లక్ష్మయ్య, షేక్ శంశోద్దీన్, బాదం మల్లేష్, కంబాలపల్లి లక్ష్మయ్య, ముస్కు వెంకటయ్య, వెంకటయ్య, మల్గం నరసింహ, ఇద్ది రాములు, వింజమూరి నరసింహ, నల్లగాసు నరసింహ, ముదిగొండ లక్ష్మయ్య, యాచారం శ్రీశైలం , కానూరు వీరయ్య, కుర్మేటి రాములు, జల్లెల వెంకటయ్య, గోడేటి నరసింహ, గ్యార పరశురాములు, కోడిదూటి సైదులు, మాధగోని యాదయ్య, పోలే లాలయ్య, గుణమోని రాములు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

ఎస్‌టియుటిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్



**ప్రజాపక్షం /నస్పూర్:** విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియుటిఎస్) 2026 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని, పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎస్‌టియుటిఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు భట్టారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఒడిగె కృష్ణ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ చీపెల్లి బాపు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పద్మ, మహాలక్ష్మి, మన్మోహన్, శ్రీరామ్, ఫైనాన్స్ సెక్రటరీ సుమన్, మంచిర్యాల మండల అధ్యక్షులు మల్లేష్, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బోడ సుదర్శన్ జీవితం ఆదర్శణీయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/వలిగొండ :** నిరంతరం ప్రజా ఉద్యమాలే ఊపిరిగా విద్యార్థి దశ నుంచి పోరాటం నిర్వహించిన బోడ సుదర్శన్ మరణం పార్టీకి మరియు ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, ఆయన జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం యాదాద్రి భువన గిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామంలో బోడ సుదర్శన్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందు గా సుదర్శన్ చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లింకటి సత్యం, జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మరియు డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, సుదర్శన్ కుటుంబ సభ్యులు పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ సుదర్శన్ పార్టీకి అంకితభావంతో సేవలందించారన్నారు.పార్టీ నిర్మాణం, ప్రజాసమస్యలపై పోరాటాలు, కార్మిక రైతు ఉద్యమాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన జీవితం పార్టీ శ్రేణులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. చిన్ననాటి నుండే విద్యార్థి సంఘం నాయకుడి గా, మూడు సార్లు వలిగొండ మండల పార్టీ కార్యదర్శి గా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, చేనేత సంఘానికి అనేక సేవలు అందించాలని కూనంనేని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని పిలుపునిచ్చారు. బోడ సుదర్శన్ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని, వారి కుటుంబానికి రాష్ట్ర పార్టీ, జిల్లా పార్టీ అండగా ఉంటుందని కూనంనేని తెలిపారు. ఆయన మృతికి సంతాపం మరియు వారి కుటుంబానికి ప్రగడ సానుభూతిని తెలియజేశారు. సంస్మరణ సభ కార్యక్రమంలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు, బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కళ్లెం కృష్ణ, ఎండి ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, పెరబోయిన మహేందర్, ఏశాల అశోక్ చిగుళ్ల లింగం, చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీనరసయ్య, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి జిల్లా కమిటీ సభ్యులు ఎలగందుల అంజయ్య, ఎల్లంకి మహేష్, పోలేపక యాదయ్య, పులిపలుపుల మల్లేశం, బాలగోని సత్యనారాయణ, బొడిగె సుదర్శన్, దుప్పెల్లి సర్పంచ్ ఎండి జావీద్, కట్ల యాదగిరి, సుద్దాల సాయి కుమార్, బోషానబోయిన బొందయ్య, డిసిసి ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, అడ్వకేట్ ఉయ్యాల హన్మాత్ గౌడ్, బోడ సుదర్శన్ భార్య సునీత కూతుర్లు నీలిమ, నిఖిత కుటుంబ సభ్యులు తండ్రి యాదగిరి, అన్న అంజయ్య, తమ్ముడు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## బస్‌డిపో, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని సిపిఐ నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** హెచ్‌ఎంటి ఖాళీస్థలంలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. కాగా బుధవారం జరిగిన దీక్షకు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి, మాజీ కౌన్సిలర్ చంద్రమ్మ, మహిళా సమైక్య మండల నాయకురాలు సత్యవతి, భాగ్యలక్ష్మి , పద్మ, సోమేశ్వరి, దీపిక, సుజాత, పార్వతమ్మ, అమృతమ్మ, దీప, ఉమా, సంధ్య, సుజాత, సౌమశ్రీలు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ రెండు రోజులుగా నిర్వహిస్తున్న నిరాహార దీక్షలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. దీనికి నిదర్శనమే పలువురు మహిళలు దీక్షలో కూర్చోవడం మంచి పరిణామం అని అన్నారు. ప్రజలందరూ ఏకమై బస్‌డిపో, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించేంత వరకు పోరాటం చేస్తే ఖచ్చితంగా జగద్గిరిగుట్టలో బస్ డిపో, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేసుకోవచ్చని అయన అన్నారు. ఈ అంశం ప్రభుత్వం దృష్టిలో ఉన్నందున ప్రతిఒక్కరూ సిపిఐ నిర్వహించే పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు వి.హరినాథ్‌రావు, రాములు, శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ నరసయ్య, సిపిఐ నాయకులు యాదయ్య, ఇమామ్, నారాయణ, బాబు, యువజన నాయకులు కీర్తి, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలను అణచివేసే కుట్ర

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** యాభై సంవత్సరాలుగా దేశంలో జరిగిన ప్రజా ఉద్యమాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షా రాష్ట్రాల డిజిపిలకు ఆదేశించడం ప్రజా ఉద్యమాల అణచివేతకు సమగ్ర కార్యాచరణ రూపొందించడంలో భాగమేనని స్పష్టమవుతుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక వీర భవన్‌లో చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు ప్రసంగిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ప్రజా ఉద్యమాలపై అణచివేత చర్యలు తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. దేశభక్తి ముసుగులో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. కోట్ల సంవత్సరాల చరిత్ర కలిగిన అరావళి పర్వతాలను ఆదాని మైనింగ్ కంపెనీకి బిజెపి ప్రభుత్వం కట్టబెడుతుందని విమర్శించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ వర్గాలకు దోచి పెడుతున్న బిజెపి ప్రభుత్వం చర్యలను ప్రతీ ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగిపోయారని, ప్రధాని మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తులపైనే ఉండటంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. జనవరి 18న సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఖమ్మంలో జరిగే భారీబహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతో మంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదన్నారు. దున్నే వాడికి భూమి దక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని చేపట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. దేశంలో వామపక్ష పార్టీల ఐక్యతా పోరాటాలను ఉధృతం చేస్తూ లౌకిక ప్రజాస్వామిక శక్తులను ఏకం చేస్తూ ప్రజాస్వామ్య పోరాటాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్, నల్లు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, తండా సందీప్, చొప్పరి శేఖర్, బందు మహేందర్, సారిక శ్రీనివాస్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి.ఫాతిమా, మేక వీరన్న, బానోతు లింగ్యానాయక్, కొమ్ము నారాయణ, జలగం ప్రవీణ్ ,ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, చిదిరాల జ్ఞానేశ్వర్, తోట రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం
REGIONAL NEWS



కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## గర్జనపల్లిలో పౌర హక్కుల దినోత్సవం



**ప్రజాపక్షం/వీర్నపల్లి :** మండల కేంద్రంలోని గర్జనపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ బుచ్చగారి రాకేష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో అవగాహన కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మండల తహాశల్థార్ ముక్తర్ పాషా, ఎస్ఐ వేముల లక్ష్మణ్‌లు మాట్లాడుతూ ప్రతి పౌరుడు హక్కులపై అవగాహన కలిగి ఉండి, శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి చేకుట వెంకటేష్, విఆర్ఓ శ్రీనివాస్, ఉప సర్పంచ్ న్యాత మోహన్, పంచాయితీ పాలకవర్గ సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ నగరపు దేవేందర్, రెవిన్యూ సిబ్బందితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## అర్హులకు సదరం సర్టిఫికెట్

సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రమం తప్పకుండా సదరం శిబిరాలు నిర్వహించాలని, అర్హులకు సదరం సర్టిఫికెట్లు అందించాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఆదేశించారు. సదరం శిబిరాల నిర్వహణ, యూడీఐడీ తదితర అంశాలపై అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఆర్డీఓలు, అధికారులతో సెర్ప్ సీఈవో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా సదరం శిబిరాల నిర్వహణ, పెండింగ్ అప్లికేషన్ల వివరాలపై ఆరా తీశారు. సదరం శిబిరాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, దరఖాస్తుదారులకు సమాచారం చేరవేయాలని, వారు ఆబ్సెంట్ కాకుండా చూసుకోవాలని సూచించారు. వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. భవనాలు, ఫర్నీచర్, ఇతర సౌకర్యాల కోసం నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తున్నదని, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం అవసరమైన వైద్యులను నియమించు కోవాలని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి వెంటవెంటనే నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. యూడీఐడీ కార్డుల జారీ, ఇతర అంశాలపై వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, పీడీ డీఆర్డీఏ శ్రీధర్ పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబు గురించి మాట్లాడే అర్హత లేదు

పెద్దపల్లి డిసిసి ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య

**ప్రజాపక్షం/పాలకుర్తి :** అంతర్జాతీయ వేదికల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో చేపడ్తున్న ప్రజా పాలన, జరుగుతున్న అభివృద్ధి గురించి చెప్పి రాష్ట్రానికి అత్యధికంగా నిధులు తెచ్చి పలు కంపెనీలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర ఐ.టి పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు గురించి మాట్లాడే అర్హత పుట్ట మధూకర్‌కు లేదని పెద్దపల్లి డి.సి.సి. ప్రధాన కార్యదర్శి, బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంటు కర్మాగారం కాంట్రాక్టు యూనియన్ మాజీ అధ్యక్షుడు సూర సమ్మయ్య అన్నారు. మంత్రి పట్ల మధూకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం పాలకుర్తి మండలం కన్నాల గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నైతిక విలువలను కోల్పోయి మంత్రి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఖండించారు. ఈ కార్యక్రమంలో బామ్లానాయక్‌తండా సర్పంచి అఖిల అంజినాయక్, ఉప సర్పంచులు రాజేశ్వరి సారయ్య, మతిన్, మాజీ ఉప సర్పంచులు జ్యోతి శంకర్ నాయక్, కొమురెల్లి గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ సక్కల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరి గౌస్యబేగం, నాయకులు భూతగడ్డల ప్రవళిక, కొండ్రా శంకర్, దండుగుల శ్రీకాంత్, భూతగడ్డల రమేష్, వార్డు సభ్యులు రాజేష్, రమేష్, సంపంగి కుమార్, భూమన్న, దాసరి సాగర్, రాజేష్, మల్క సురేందర్, జైపాల్‌లు పాల్గొన్నారు.

## 'యూనివర్సల్'లో గ్రాండ్ పేరెంట్స్ డే




**ప్రజాపక్షం/పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్‌శ్యామ్‌దాస్ నగర్‌లోని యూనివర్సల్ ఐఐటి, నీట్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను బుధవారం నిర్వహించారు. విద్యార్థుల చేతుల మీదుగా వారి తాతలు, అమ్మమ్మలు, నానమ్మలను వేదికపై శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్‌కు ఆటల పోటీలు నిర్వహించి విజేతలందరికి పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన రైమ్స్, ఉపన్యాసాలు, నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంటు మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్ మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తుకై తల్లిదండ్రులు తమ జీవితాలను త్యాగం చేస్తారని, అదే సమయంలో తల్లిదండ్రులు కూడ తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరవకుండా వృద్ధ్యాప్యంలో వారికి అండగా నిలువాలన్నారు. పెద్దలను చూసి పిల్లల్లో కూడ చిన్నప్పటి నుంచి తమ తల్లిదండ్రులు, తాతలు, నానమ్మలు, అమ్మమ్మల పట్ల బాధ్యతతో మెలగాలని తెలుసుకుంటారని వారికి తగిన గౌరవాన్ని ఇస్తారని తెలిపారు.

## జెన్‌కో 1535 యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం పట్టణంలోని జెన్‌కో 62.5 మెగావాట్ల బిథర్మల్ విద్యుత్తు కేంద్రం పరిపాలన కార్యాలయంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) నూతన సంవత్సరం 2026 క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. డిఈ(ఒఅండ్ఎం) కె.శ్రీనివాస రావు, డిఈ(స్టోర్స్) టి.కృష్ణమూర్తి, ఈఈ(సివిల్) జి.సూర్యనారాయణరెడ్డి, ఎఈఈ(సివిల్) శశికాంత్‌సింగ్, సిహెచ్.అనిల్‌కుమార్‌లు 1535 యూనియన్ రాష్ట్ర, రీజినల్ నాయకులతో కలిసి క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు జెన్‌కో ఉద్యోగులు, కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.కుమారస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ తఖీ, రీజినల్ అధ్యక్షుడు అబ్దుల్ నజ్మీ, నాయకులు ఎండి.మోయిజ్‌పాషా, ఎస్‌డి.సమీయోద్దీన్, డి.మురళిమోహన్, ఎ.దుర్గయ్య, ఎస్‌డి.బద్రొద్దీన్, ఎండి.నయీమ్ పాషా, ఎండి.రహీమ్, ఎస్.చక్రవర్తి, జి.అంజద్‌ఖాన్, అన్వర్ హుస్సేన్, నయింపాషా, ఆసీఫ్, కృష్ణ, రమేష్, ఆర్ఎం.గుణశేఖర్‌లు పాల్గొన్నారు.

ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కొండగట్టు పర్యటనకు

# భద్రతా ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/మల్యాల :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జనవరి 3న జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, హెలిప్యాడ్ ప్రాంతం, వాహనాల పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ రూట్లు, బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన ముఖ్య ప్రదేశాలు తదితర అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ అక్కడ ఉన్న పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులతో సమావేశమై, బందోబస్తు పరంగా చేపట్టాల్సిన చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన సమయంలో భక్తులకు ఎలాం టి ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల రాకపోకలు సజావుగా నిర్వహించాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో అదనపు పోలీస్ బలగాలను మోహరించాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ముత్యం పేట సర్పంచ్ ఆది రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ఆలయ ఈవో శ్రీకాంత రావు, ఆర్డీఓ మధుసూధన్, డిఎస్పీ రఘు చందర్, సిఐ నీలం రవి, ఎస్సై నరేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ముత్యపు శంకర్, సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియ వందశాతం పూర్తి



జిల్లా కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/దుబ్బాక:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా చేపట్టిన ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులకు ఆదేశించారు. బుధవారం దుబ్బాక మున్సిపాలిటీ కార్యాలయంలో ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియనుజిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయా వార్డుల వారిగా బిల్ కలెక్టర్‌లు, సూపర్‌వైజర్, బీఎల్‌ఓలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు సంబంధించిన పనులను ఫీల్డ్ స్థాయిలో ఇంటింటి తనిఖీలతో వేగవంతం చేయాలని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రెండు చోట్ల ఓటు ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి, ఒక్క ప్రాంతంలోనే ఓటు హక్కు ఉండేలా చూడాలన్నారు. ఒక్క వ్యక్తికి ఒక్క ప్రాంతంలో మాత్రమే ఓటు హక్కు ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి రోజు ఎలక్టోరల్ మ్యాపింగ్ వివరాలను తప్పనిసరిగా కంప్యూటర్‌లో నమోదు చేయాలని సూచించారు. నమోదు ప్రక్రియను పరిశీలించారు.

**రోగులకు మెరుగైన వైద్యం అందించాలి**

మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను పరిశీలించారు. ఓపి రిజిస్టర్‌ను పరిశీలించారు. అనుమతులు లేకుండా ఎవరూ కూడా సెలవు తీసుకోకూడదని ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం ప్రతి సిబ్బంది సెలవులు వినియోగించుకోవాలని సూచించారు. ఫార్మాసి గదిలో మందులను తనిఖీ చేశారు. ఆయా సీజన్‌లకు సంబంధించిన అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని కాలం చెల్లిన మందులు వాడకూడదని సిబ్బందికి ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

# 91 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత

కరీంనగర్ కమిషనరేట్‌లో ఏడాదిలో

2,056 ఫోన్ల అప్పగింత

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను వెలికితీయడంలో సిఈఐఆర్ పోర్టల్ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ బాధితులకు ఊరట కలిగిస్తున్నారు. బుధవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ (సీపీ) గౌష్ ఆలం ముఖ్య అతిథిగా పాల్గొని, సుమారు రూ.18 లక్షల 20 వేల విలువ గల 91 రికవరీ మొబైల్ ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, ఫోన్లను ట్రేస్ చేయడంలో అద్భుత ప్రతిభ కనబరిచిన రూరల్ పోలీస్ స్టేషన్ టెక్నికల్ టీమ్ సభ్యులు కానిస్టేబుళ్ళు విశ్వతేజ, రాంసాయి, కీర్తనలను ప్రత్యేకంగా అభినందించారు. వీరి కృషిని గుర్తించి వారికి త్వరలోనే రివార్డులు అందజేయాలని అధికారులకు సూచించారు. సిఈఐఆర్ పోర్టల్ ద్వారా కరీంనగర్ కమిషనరేట్ సాధించిన పురోగతిని సీపీ వివరించారు.

**మొత్తం ఫిర్యాదులు:** 6,700. గుర్తించిన ఫోన్లు: 3,939. బాధితులకు అప్పగించినవి: 2,056 (52 సక్సెస్ రేటు) రికవరీ ప్రక్రియలో ఉన్నవి: 1,883




**స్టేషన్ల వారీగా ప్రతిభ..** రికవరీలలో మానకొండూర్ (75), కరీంనగర్ రూరల్ (73) అత్యుత్తమ ఫలితాలు సాధించగా, చొప్పదండి, ఇల్లందకుంట, రామడుగు స్టేషన్లు 70 రికవరీతో మెరుగ్గా నిలిచాయి. కరీంనగర్ వన్ టౌన్ అత్యధికంగా 1,011 ఫోన్లను గుర్తించి రికార్డు సృష్టించింది. ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయకుమార్, ఇన్స్‌పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సైలు నరేష్, లక్ష్మా రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చొప్పదండి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా



చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో అత్యధిక స్థానాలను గెలిచి కార్పొరేషన్ లో కాంగ్రెస్ జెండా ఎగు వేస్తామని, జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యులు అంజన్ కుమార్‌లతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ మేము ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను 80 శాతం వరకు అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే 60 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగులను ఆదుకున్నామన్నారు. ప్రభుత్వంలో ఏమైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి కోరినప్పటికీ అసెంబ్లీ సమావేశాలకు హాజరైన కేసీఆర్ ప్రజా సమస్యల గురించి రాష్ట్రం గురించి మాట్లాడుతారని ప్రజలందరూ వేచి చూస్తుంటే కేవలం రెండు నిమిషాలు హాజరు వేసుకొని వెళ్లిపోయారన్నారు. చొప్పదండి నియోజకవర్గం లో గత పది సంవత్సరాలలో పాలనను పూర్తిగా గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని నారాయణపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి 43 కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండగా 10 సంవత్సరాలలో ఒక్క రూపాయి విడుదల చేయలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక ఇటీవల 23 కోట్ల రూపాయలు విడుదల చేయించానని, వారం రోజుల్లో మరో 20 కోట్ల రూపాయలు విడుదల చేయించి నిర్వాసితులందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. కొంతమంది బిఆర్ఎస్ నాయకులు దేవుని దగ్గర అబద్ధాలు చెబుతున్నారని, బిఆర్ఎస్ హయాంలో కొండగట్టు దేవాలయానికి ఒక్క రూపాయి నిధులు తీసుకువచ్చినా నేను రాజకీయాల నుండి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి కొండగట్టు అంజన్న దేవాలయానికి సహాయం చేయాలని కోరగా పవన్ కళ్యాణ్ స్పందించి దాదాపు రూ.36 కోట్లు కొండగట్టు ఆలయానికి కేటాయించినారని, 100 గదుల వసతి గృహంతో పాటు మాల విరమణ మండపం కట్టిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. జనవరి 3న పవన్ కళ్యాణ్‌తో కలిసి 100 గదుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేయనున్నట్లు సత్యం తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజ్, బానోతు శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, పురం రాజేశం, ముత్యం శంకర్ గౌడ్, పత్తి మధుకర్ రెడ్డి, వెన్నం రజిత రెడ్డి, పంజాల కృపాసాగర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దన్ను సింగ్, రోళ్ల సతీష్, మిరాజ్, మంద మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# సర్వే ఆధారంగా గెలుపు గుర్రాలకే టిక్కెట్లు

మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల్లో కాషాయ జెండా ఎగరేయడమే బీజేపీ ముందున్న లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లోని పట్టణ, జోన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో బుధవారం మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేష్,



వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ టిక్కెట్ల విషయంలో పైరవీలు, మొహమాటాలకు తావులేదని, సర్వే రిపోర్టుల ఆధారంగా గెలుపు గుర్రాలకే పార్టీ నాయకత్వం బీజేపీ టిక్కెట్లు కేటాయిస్తుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున బోగస్ ఓట్లు ఉన్నాయని వార్తలు వస్తున్నాయని, వెంట నే ఓటర్ల ముసాయిదా జాబితాను డివిజన్లు, వార్డుల వారీగా సేకరించి ఇంటింటికీ వెళ్లి పరిశీలించి, బోగస్ ఓట్లు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు.



## అక్రమ కూల్చివేతలు.. మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గత రెండు సంవత్సరాలుగా రామగుండం నియోజకవర్గంలో చట్టాన్ని తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా దుకాణాల కూల్చివేతలు జరుగుతున్నాయని అక్రమ కూల్చివేతలపై రామగుండం మున్సిపల్ కమీషనర్ అరుణ శ్రీపై చర్యలు తీసుకోవాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకు మున్సిపల్ కమిషనర్‌పై మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అక్రమ కుల్చవేతలు చేపడుతున్నరని కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారో ఎంత చేస్తున్నరో చెప్పకుండా మున్సిపల్ కార్పొరేషన్ ఇష్టం వచ్చినట్లు కూల్చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో 43 మైసమ్మ గుళ్లను కూల్చివేసారని ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. చిరు వ్యాపారుల దుకాణాలకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా వారి జీవితాలను రోడ్డుపై పడవేసారని అన్నారు. అక్రమ కూల్చివేతలు చేపడుతున్న కమిషనర్ అరుణ శ్రీపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పర్లపల్లి రవి, నారాయణదాసు ,మారుతి ,నీరటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో విజయాలను నమోదు చేయాలని, సమాజ హితంగా కార్యక్రమాలను చేపట్టి ముందంజలో నిలవాలని ప్రధానంగా విద్యార్థులందరూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కృషిచేసి లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. 2025 సంవత్సరంలో అద్భుతమైన విజయాలు సాధించడం జరిగిందని ప్రతి పల్లెలో, జిల్లాలో, రాష్ట్రాలను, మన భారతదేశంలో అనేక విజయాలు చోటు చేసుకున్నాయని అన్నారు. విద్యార్థులందరూ అన్ని రంగాలలో నైపుణ్యం సాధించే విధంగా ప్రణాళికలను రూపొందించి, అమలుపరిచి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, తల్లిదండ్రులు సైతం పిల్లలకు నైతిక విలువల పట్ల అవగాహన పెంపొందించాలని, అసాంఘిక కార్యక్రమాల చేయడం వల్ల కలిగేటువంటి నష్టాలను మరియు వాటి యొక్క ప్రభావాలను చక్కగా తెలియపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమన్వయంతో మహిళా, శిశు సేవలు అందించాలి



మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సమీక్ష సమావేశంలో

అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**ప్రజాపక్షం/కరీంనగర్ :** మహిళ శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మహిళలకు, శిశువులకు మెరుగైన సేవలు అందించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాల సేవలపై సమీక్ష సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. మిషన్ వాత్సల్య, పోషణ్ అభియాన్, మహిళ సాధికారత, సఖి కేంద్రం, బాలసదనం, శక్తి సదన్ తదితర విభాగాల అధికారులతో మహిళలు శిశువులకు అందిస్తున్న సేవలను అడిషనల్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యతోపాటు పోషకాహారం అందిస్తున్న అంగన్వాడీల్లో పిల్లల నమోదు హాజరు ఎక్కువగా ఉండేలా చూడాలని అన్నారు. అంగన్వాడికి హాజరయ్యే పిల్లల బరువు ఎత్తు కొలుస్తూ వారిని వయసుకు తగిన బరువు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహ సందర్శనలు చేస్తూ తల్లిదండ్రులకు పోషకాహారం ప్రాముఖ్యతను వివరించాలని అన్నారు. గర్భిణీలు బాలింతల ఆరోగ్యం, తీసుకోవలసిన ఆహారం గురించి అవగాహన కల్పించాలని అన్నారు. సాధారణ ప్రసవాల ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అయ్యేలా ప్రోత్సహించాలని తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల ఫిర్యాదు కమిటీలను తరచుగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆపరేషన్ స్మైల్ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల్లో భాగంగా పని నుండి విముక్తి కల్పించిన పిల్లల వివరాలను వారి ప్రస్తుత పరిస్థితిని గురించి ఐసిపిఎస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సఖి కేంద్రాన్ని ఆశ్రయించిన మహిళలకు తగిన వైద్య న్యాయసహాయం అందించాలని, అవసరమైన వారికి ఆశ్రయం కల్పించాలని అన్నారు. జనవరి ఒకటి నుండి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మార్త సరస్వతి, సీడీపీవోలు సుగుణ, శ్రీలత, డీసీపీవో పర్వీన్, చైల్డ్ హెల్ప్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, మహిళ సాధికారాత కేంద్రం కో ఆర్డినేటర్ కట్కూరి శ్రీలత, సఖి అడ్మిన్ లక్ష్మి, బాల సదన్ సూపరెండెంట్ సంతోషిని, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి సహకారం



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్ గ్రామంతో మత్స్య సంపదను పెంపొందించే దిశగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఠానాకలాన్ గ్రామ సర్పంచి గెంటే లావణ్య, ధర్మారం సర్పంచి సుందు కిషన్‌తో కలిసి చెరువులోకి వదిలారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం మత్స్య శాఖ సంయుక్తంగా చేపడుతున్న ఈ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామంలోని చెరువులను వినియోగించుకొని మత్స్యకారులు లబ్ధి పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు,మత్స్యశాఖ అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాపింగ్ వారం లోపు పూర్తి




**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లోభాగంగ చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్ వేగవంతం చేసి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు ,తహసీల్దార్లు ఎన్నికల విభాగపు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఓటర్ మ్యాపింగ్ పురోగతి భూ భారతి దరఖాస్తుల స్థితి గతులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని బిఎల్వోలు ,బిఎల్వో సూపర్వైజర్లు సమన్వంతో ఫీల్డ్ స్థాయిలో ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని సూచించారు. ఏఈ ఆర్ఓ వారిగా రోజువారీ పురోగతి నివేదికలు తీసుకొని రెగ్యులర్‌గ సమీక్షించాలని ఆర్డీలకు సూచించారు. జాప్యం జరగకుండా వేగవంతంగా పూర్తియ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ భారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాదురి ,సబ్ కలెక్టర్ ఉమా హారతి రెవెన్యూ డివిజనల్ అధికారులు తహసీల్దార్లు ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాల్వల మరమ్మతుకు రూ. 32. 55కోట్ల మంజూరు

**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లాలోని శ్రీ రామ సాగర్ ప్రాజెక్టు, కాకతీయ, వరద కాలువ మరమ్మత్తుల కోసం రూ. 32కోట్ల 55లక్షల 60వేలు మంజూరయ్యాయని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. ఇప్పుడు ఈ ప్రజాప్రభుత్వం ప్రాజెక్టు కాకతీయ, వరద కాలువ మరమ్మతుల కోసం రూ. 32కోట్ల 55లక్షల 60వేలు తెలంగాణ ప్రభుత్వం నీటి పారుదల శాఖ వారు మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేయడం జరిగిందన్నారు. కాకతీయ కెనాల్ 0 కిలో మీటర్ నుంచి 25కిలో మీటర్ వరకు వివిధ మరమ్మతులకు రెండు కోట్ల 30లక్షలు, అలాగే వరద కెనాల్ గాండ్లపేట్ వద్ద పడిన గండి పూడ్చడానికి 8కోట్ల 52లక్షలు, ఎస్ఆర్ఎస్‌పి ఎర్త్ డ్యాం వద్ద వివిధ పనుల కోసం రూ. 89లక్షల 60వేలు, డ్యాం వద్ద మేజర్ పనుల కోసం రూ. 18కోట్ల 27లక్షల 50వేలు, ప్రాజెక్టు గేట్ల వద్ద ఎలక్ట్రికల్ కేబుల్స్, వివిధ పనులకు రూ. రెండు కోట్ల 56లక్షల 50వేలు మంజూరు కావడం జరిగిందని తెలిపారు. ప్రాజెక్టు గేట్ల వద్ద ఎలక్ట్రికల్ కేబుల్స్, వివిధ పనులకు రూ. 2కోట్ల 56లక్షల 50వేలు మంజూరు కావడం జరిగిందని తెలిపారు.

## నస్తీపూర్‌లో స్వచ్ఛభారత్



**ప్రజాపక్షం/ హత్నూర :** హత్నూర మండలంలో బుదవారం నాడు నస్తీపూర్ గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోక్ నాథ్ తమ విద్యార్థులతో మాట్లాడుతూ పిల్లలకు చిన్న తనం నుంచే పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడంతో పాటుగా మన ఊరును మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మనచెత్తను చెత్త కుండీలలో మాత్రమే వేయాలని ఆయన సూచించారు. పిల్లల చేత 'చెత్త వేయకు పాపం చేయకు 'అని నినాదాలు చేయించారు. ఈ కార్యక్రమంలో నస్తీపూర్ సర్పంచ్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఊరు ఊరంతా శ్రమదానం చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్ వార్డు సభ్యులు ఎపిఎం రాజశేఖర్ సీసి సావిత్రి కార్యదర్శి యాదయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి ,గ్రామ సంఘం ఓబిలు ,గ్రూప్ లీడర్లు, విద్యార్థులు ,గ్రామ పెద్దలు యువత యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అధికారులపై చేసిన ఆరోపణలు అవాస్తవం



ప్రజాపక్షం/శివ్వంపేట : అటవీ అధికారులపై చేసిన ఆరోపణలు అవాస్తవమని డిప్యూటి రేంజ్ ఆఫీసర్ సిద్ధిరాంసింగ్, వెంకట్‌రావు పేట సెక్షన్ ఆఫీసర్ కరీమోద్దిన్‌లు అన్నారు. ఇటీవల మండలంలోని రూప్లతండా పరిధిలో బానవత్ లక్ష్మి , భిక్షపతి అక్రమంగా అటవీభూమిలోకి ప్రవేశించి ట్రాక్టర్ సహాయంతో దున్నకం చేపడుతుండగా గత మూడు రోజుల క్రితం అటవీశాఖ అధికారులు అడ్డుకోగా అవే భూములను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ కరీమోద్దిన్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం అటవీహక్కుల ద్వారా బానవత్ లక్ష్మి , భిక్షపతికి రెండెకరాల భూమిని కేటాయించగా దానిని సాగు చేసుకుంటూనే అదే పట్టాను చూపిస్తూ వెంకటాపూర్ బీట్ కంపార్టుమెంట్ 53 లో మరో రెండు ఎకరాలను అక్రమంగా దున్నేస్తున్నారని ఆయన వివరించారు. గతంలో కూడా భూముల అక్రమణలపై అందులో చిన్న ఇంటి నిర్మాణం చేపట్టడంపై భిక్షపతి, పురుషోత్తంలపై అటవీచట్టం ప్రకారం కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని ఆయన వివరించారు. అక్రమంగా అటవీ భూమిని సాగుచేస్తున్న విషయం తెలుసుకొని గత 27 న అటవీ అధికారులకు తండాకు వెళ్లగా అధికారుల విధులకు భంగం కలిగించినందుకు సదరు వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. అటవీశాఖ అధికారులపై భిక్షపతి కుటుంబసభ్యులు చేసిన ఆరోపణలలో ఎలాంటి నిజం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు శ్రీధర్‌కుమార్, రాజమణి, బీట్ ఆఫీసర్లు మౌనిక, శిరీషబాయి, వాచర్ బాను తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో సమృద్ధిగా యూరియా స్టాక్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ;** జిల్లాలో యూరియా పూర్తి స్థాయిలో సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. జిల్లాలోని అన్ని పిఏసిఎస్ (పిఎసిఎస్) సోసైటీలు, సహకార సంఘాలు ,అగ్రో కేంద్రాలు ,హెచ్ఎసిఎ, డిసిఎమ్ఎస్ కేంద్రాలు ,ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 4598 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని అందులో సహకార సంఘాల వద్ద 312 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లు వద్ద 621 మెట్రిక్ టన్నులు ,మార్క్‌ఫెడ్ స్టాక్ 3665 మెట్రిక్ టన్నులు యురియా స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. యురియా సరఫరా విడదల వారీగా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల ముసాయిదా
# ఓటర్ల జాబితా నేడు విడుదల

### పారదర్శకంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**జిల్లాలో మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది.ఇందులో భాగంగా పోలింగ్ స్టేషన్ల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ,సవరణలు,ప్రచురణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం చేపడుతున్న ఎన్నికల ఏర్పాట్లను ఆమె ప్రతినిధులకు వివరించారు.సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ,రాబోయే మున్సిపల్ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా,నిష్పక్షపాతంగా,ఎటువంటి సాంకేతిక లేదా క్షేత్రస్థాయి లోపాటు లేకుండా నిర్వహించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించేలా,జాబితాలో ఎటువంటి తప్పులు దొర్లకుండా పక్కాగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు.మున్సిపాలితటీలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల వారీ ముసాయిదా ఓటర్ల జాబితాను రేపు,అనగా గురువారంటసంబంధిత మున్సిపల్ కా ర్యాలయాల నోటీసు బోర్డులపై ,ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల సం దర్శనార్థం ప్రచురించడం జరుగుతుందని వివరించారు.జాబితా ప్రచురణ అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు,ప్రజలు దానిని క్షుణ్ణంగా పరిశీలి ంచాలని కోరారు.ఓటర్ల పేర్లు,చిరునామాలు,వార్డుల కేటాయింపు లేదా ఇతర వివరాల్లో ఏవైనా అభ్యంతరాలు ఉన్నా,తప్పులు దొర్లినా నిబంధనల ప్ర కారం నిర్ణీత గడువులోగా సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు లేదా జిల్లా స్థాయి అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించా రు.అందిన ప్రతి అభ్యంతరాన్ని క్షేత్రస్థాయిలో విచారించి,అర్హత మేరకు సవరణలు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం,అభ్యంతరాల స్వీకరణ,పరిష్కార ప్రక్రియ ముగిసిన తర్వాత,మున్సిపాలిటీల వారీగా తుది ఓటర్ల జాబితాను 2026 జ నవరి 10వ తేదీన అధికారికంగా ప్రచురించనున్నట్లు కలెక్టర్ వెల్లడించా రు.సమగ్రమైన,దోషరహితమైన ఓటర్ల జాబితా తయారీలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమని,ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ పూ ర్తి సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్,ఆర్డీఓ రత్న కళ్యాణి,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,పాల్గొన్నారు.వీరితో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అప్పల గణేష్,శ్రావణ్‌రెడ్డి,అజంబిన్ యహీయా, రాము, సయ్యద్ హైదర్,నాందేడపు చిన్ను,భరత్వి,జ య్,మ జా ర్,వినోద్,సాదిక్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను అధికారులకు తెలియజేశారు.

## ఇండ్ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలి

### సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు



**ప్రజాపక్షం/బెజ్జూర్/కాగజ్ నగర్:**లబ్ధిదారులు అందరూ వెంటనే ఇళ్ల పనులు మొదలుపెట్టాలని, లేని పక్షంలో మంజూరు పత్రాలు రద్దు చేసి వేరే వారికి కేటాయిస్తామని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. బుధవారం బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో 66 మంది గిరిజన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం గిరిజనుల కోసమే తాను ముఖ్యమంత్రితో మాట్లాడి 500 అదనపు ఇండ్లు మంజూరు చేయించామని, గిరిజనులు శాశ్వత నీడ పొందేందుకు సహకరిస్తున్నామని తెలిపారు. మండలంలో ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రామ్ మోహన్ రావు, ఎంపిఓ శ్రీనివాస్, సర్పంచులు తేలే సుశీల, నందిపేట రాజయ్య, దుర్గం సరోజ, మన్నెంపల్లి మల్లేష్, కుమ్మరి రామకృష్ణ, సోయం చిన్నయ్య, పెగడపల్లి సరిత, కడప శంకర్, సెండే పద్మ, బండి సోనా, తొర్రెం చిరంజీవి, వడ్డేపల్లి లావణ్య, ఎనుక శ్రీహరి, బుజాడి అనసూయ, మండల అధ్యక్షులు జాడి తిరుపతి, మాజీ ఎంపిపి కొప్పుల శంకర్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు..

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/పాపన్నపేట;**పాపన్నపేట మండల పరిధిలోని లక్ష్మీ నగర్ గ్రోమోర్ కేంద్రాన్ని బుధవారం రోజు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువులు, విత్తనాల స్టాక్ వివరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఎరువుల నాణ్యత,నిల్వ విధానం, విక్రయ ధరలు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఉన్నాయా లేదా అన్న అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఎరువులు సకాలంలో అందించాలని, అక్రమ నిల్వలు,అధిక ధరలకు విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు ఎవరైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందొద్దనీ, రైతులకు సరిపడా యూరియా ప్రభుత్వం అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. అక్టోబర్ 2025 జనవరి 26 సంవత్సరానికి మన జిల్లాకు 12,000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుందని రాష్ట్రానికి ప్రతి పాదానాలు పంపామన్నారు. డిసెంబర్ 30 నాటికి మెదక్ జిల్లాకు 12663 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. 8000 మెట్రిక్ టన్నుల యూరియా రైతులు ఇప్పటివరకు కొనుగోలు చేయడం కూడా జరిగిందనీ, ఇంకా జిల్లాలో 4000 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. జిల్లాలో మన అవసరానికి మించి యూరియా జనవరికి కూడా రాబోతుందనీ రైతులు గమనించాలన్నారు. రైతులు యూరియా దొరకదేమోనని ఆందోళన చెందవలసిన అవసరం లేదనీ అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



**ప్రజాపక్షం/దండేపల్లి:**కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గూడెం ఎత్తిపోతల పథకం పనులు సకాలంలో పూర్తి కాక రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకం పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ ప్యానల్ పనులు ప్రారంభమై మూడు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కాకపోవడంతో రైతులకు సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతులకు సాగునీరు అందించక మోసం చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రెండేళ్లుగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి జనవరి 5వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బందెల రవి గౌడ్, ప్రధాన కార్యదర్శి పత్తిపాక సంతోష్, నాయకులు మాధవరపు వెంకట రమణ రావు, గడ్డం స్వామి రెడ్డి, గోపతి రాజయ్య, వీరమల్లు హరి గోపాల్, ఎనగందుల కృష్ణ మూర్తి, బియ్యాల సతీష్ రావు, రమేష్ జైన్, బేతు రవి, మొరుపుటాల తులసి, బత్తుల శేఖర్, చుంచు గిరిధర్, దుమ్మని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## విమర్శలు చేసే వారికి తగిన సమాధానం చెబుతాం

### ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :**గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండేళ్లు గడుస్తున్నా కార్మికుల సమస్యలు, హామీల అమలుపై చర్చించకుండా ఐఎన్‌టియుసి, కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు అక్కసుతో విమర్శలు చేయడం దురదృష్టకరమని ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన ఏడాది తర్వాత ఏర్పాటు చేసిన స్ట్రక్చర్ మీటింగ్‌ను బహిష్కరించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టియుసి చొరవ తీసుకుని మళ్లీ సమావేశం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో వయో పరిమితి పెంపు, కాంట్రాక్టు కార్మికులకు బోనస్, ప్రమాద బీమా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వంటి పథకాలను అమలు చేశామని తెలిపారు. గత వారం మంత్రులను కలిసి సొంత ఇంటి పథకం, పెర్క్స్‌పై ఆదాయపన్ను మాఫీ, ఇతర సమస్యలపై చర్చించామని పేర్కొన్నారు. పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్, విజిలెన్స్ కేసుల పరిష్కారం, కొత్త గనుల ప్రారంభం, తొలగించిన కార్మికుల పునర్నియామకం వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. కార్మికుల సమస్యలను పక్కనపెట్టి అనవసర విషయాల్లో జోక్యం చేసుకుంటున్న బిఆర్ఎస్ అనుబంధ సంఘం తీరును తప్పుబట్టారు. ఈ సమావేశంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు కాంపల్లి సమ్మయ్య, జెట్టి శంకర్ రావు, నాయకులు కలవేన శ్యామ్, ఏనుగు రవీంద్ర రెడ్డి, తిరుపతి రాజు, భీమ్ రావు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ప్యానల్ బృందాల తనిఖీలు



**ప్రజాపక్షం / కౌటాల:**విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం మండలంలోని బారేవాడ, ముత్తంపెట్ ప్రాథమిక పాఠశాలల్లో ప్యానల్ బృందాల సభ్యులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం బృందం సభ్యులు నాయికిని శ్రీనివాస్, ఆదే శివాజీ, సిహెచ్ శైలజ పాఠశాలలను సందర్శించి విద్యా బోధన పద్ధతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడి తాగు నీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ప్రహరీ, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని అంశాలపై నివేదిక రూపొందిస్తామని సభ్యులు తెలిపారు.

## అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు




**ప్రజాపక్షం / మందమర్రి :**ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శివాని శ్రీరామ్ స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రి మండల విద్యాశాఖ అధికారికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి మండల పరిధిలో శివాని స్కూల్ పేరుతో నడుస్తున్న విద్యాసంస్థ, విద్యాశాఖ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా, భవన నిర్మాణం పూర్తి కాకముందే శివాని శ్రీరామ్ స్కూల్ పేరుతో కొత్తగా స్కూల్ నిర్వహణకు సిద్ధమవుతోందని తెలిపారు. జిఒ నెం 1 ప్రకారం ఉండవలసిన కనీస మౌలిక వసతులు, ఫైర్ సేఫ్టీ, ప్లే గ్రౌండ్ లేకుండానే, ఒకే ప్రాంగణంలో స్కూల్, కళాశాల నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా టీచర్ల నియామకాలు చేపడుతున్నారని, దీనివల్ల విద్యార్థుల భద్రతకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. తక్షణమే విచారణ చేపట్టి, అనుమతులు వచ్చేవరకు ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టివిజెఎస్ జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్ కుమార్, టివియువి రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, బిసివిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షైక్ సల్మాన్ పాషా పాల్గొన్నారు.

## పటాన్‌చెరు కేంద్రంగానే సర్కిల్ కార్యకలాపాలు

### జిహెచ్ఎంసి కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/ పటాన్‌చెరు:**దశాబ్దాల చరిత్రతో పాటు నియోజకవర్గ కేంద్రంగా కలిగిన పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిహెచ్ ఎంసి పటాన్చెరు సర్కిల్ కార్యాలయాన్ని స్థానికంగనే కొనసాగించాలని లేని పక్షంలో ప్రజలతో పాటు పాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు నెలకొంటాయని జిహెచ్ ఎంసి కమీషనర్ ఆర్ వి కర్ణన్ ను పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. బుదవారం హైదరాబాదులోని బల్దియా ప్రధాన కార్యాలయంలో జిహెచ్ఎంసి కమీషనర్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. బల్దియా పునర్విభజన ప్రక్రియలో భాగంగా పటాన్చెరు కేంద్రంగా ఏర్పాటు చేసిన బల్దియా సర్కిల్ కార్యాలయాన్ని ఇటీవల పరిపాలన సౌలభ్యం పేరుతో తెల్లాపూర్ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలోకి మార్చారని కమీషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు మొత్తం పటాన్చెరు కేంద్రంగా సేవలు అందిస్తున్నాయని సర్కిల్ కార్యాలయాన్ని తెల్లాపూర్ కి మార్చడం ద్వారా పరిపాలనాపరంగా ఇబ్బందులో పాటు పటాన్చెరు జేపి కాలనీ ,ముత్తంగి డివిజన్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. పరిపాలన పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆధునిక వసతులతో ప్రజలందరు అందుబాటులో ఉండే విధంగా గతంలోని పటాన్చెరు పట్టణంలో సర్కిల్ కార్యాలయాన్ని నిర్మించామని తెలిపారు. నూతన సర్కిల్ ఏర్పడే వరకు సైతం పటాన్చెరు కేంద్రంగానే పాత సర్కిల్ కార్యకలాపాలు కొనసాగాయని తెలిపారు. తక్షణమే పటాన్చెరు కేంద్రంగా సర్కిల్ కార్యకలపాలు, నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కమీషనర్ కర్ణన్ ను ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కమీషనర్ ప్రజలకు మెరుగైన పరిపాలన సేవలు అందించడమే తమ లక్ష్యమని అతి త్వరలో పటాన్చెరు కేంద్రంగా సర్కిల్ కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు.

## మిన్నంటిన నూతన సంవత్సర వేడుకలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**నిర్మల్ పట్టణంలోనిఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో నూతన సంవత్సర వేడుకలు అత్యంత ఉత్సాహంగా,ఆనందోత్సాహాల మధ్య జరిగాయి.రాబోయే 2026 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు నిర్వహించిన ఈ వేడుకలు వారిలోని ఐక్యతను,సానుకూల దృక్పథాన్ని ప్రతిబింబించాయి.కాలేజీ ప్రాంగణంలో క్రమశిక్షణతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ సంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి విద్యార్థులు,అధ్యాపక బృందానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కృషి,క్రమశిక్షణ,లక్ష్యంపై నిరంతర దృష్టిని కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు,అధ్యాపకుల్లో నూతన ఉత్సాహాన్ని,ప్రేరణను నింపుతూ ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# రీల్

## 'సిన్నారి కోన' పాట విడుదల



టాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ ఇప్పుడు నటనతో కూడా అలరిస్తున్నారు. ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం, సహజమైన హాస్యం, ప్రధానంగా గ్రామీణ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్‌పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'సిన్నారి కోన' అనే పాటను రిలీజ్ చేశారు. పెళ్ళైన తరువాత జరిగే అప్పగింతల బ్యాక్ డ్రాప్‌లో ఈ పాట ఉంటుంది. సంగీత దర్శకుడు జయ కృష్ణ ఈ సాంగ్ బ్యూటీఫుల్ మెలోడీగా స్వరపరిచారు. జయ కృష్ణ, అనన్య భట్, ఎం.జి.నరసింహ వోకల్స్ పాటకు ఫీల్ ని తీసుకొచ్చాయి. భరద్వాజ్ గాలి రాసిన సాహిత్యం అందరినీ ఆకట్టుకుంది. 'ఓం శాంతి శాంతి శాంతిః' జనవరి 23న వరల్డ్ వైడ్‌గా రిలీజ్ కానుంది.

## 'ఘంటసాల' సినిమాకు ప్రసంశలు



ప్రముఖ గాయకుడు ఘంటసాల జీవితాన్ని ఆధారంగా చేసుకుని 'ఘంటసాల ది గ్రేట్' అనే చిత్రాన్ని తెరకెక్కించారు. అన్యుక్త్ రామ్ పిక్చర్స్ బ్యానర్ మీద శ్రీమతి సి.హెచ్. ఫణి నిర్మించారు. ఈ చిత్రంలో ఘంటసాల వారి పాత్రను సింగర్ కృష్ణ చైతన్య పోషించారు. కీలక పాత్రలో సుమన్ నటించారు. ఈ మూవీని జనవరి 2న ఘనంగా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో 'ఘంటసాల ది గ్రేట్ స్పెషల్ మ్యూజికల్ నైట్' ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ.. 'మహోన్నతమైన వ్యక్తి ఘంటసాల. ఆయన జీవిత చరిత్ర ఆధారంగా తీసిన ఈ 'ఘంటసాల ది గ్రేట్' మూవీ ఘన విజయం సాధించాలి. ఎన్ని అడ్డంకులు ఏర్పడినా సరే ఈ చిత్రం గొప్ప విజయం సాధించాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు రఘు కుంచె, కౌసల్య, విజయలక్ష్మి, దర్శకుడు సి.హెచ్. రామారావు, శోభా రాణి, నిర్మాత టీఎస్ రావు, వకుళాభరణం కృష్ణ మోహన్, దర్శకుడు సముద్ర, రైటర్ వెన్నెగల రాంబాబు, సంగీత దర్శకుడు రవి శంకర్, కర్రి బాలాజీ, దర్శకుడు మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

## 'మ్యాజిక్' హిట్ కావాలి

### దర్శకుడు మెహర్ రమేష్



టు త్రీ వెంచర్స్ బ్యానర్ మీద రాజు సత్యం నిర్మించిన మరాఠీ చిత్రం 'మ్యాజిక్'. జితేంద్ర జోషి హీరోగా రానున్న ఈ మూవీకి రవింద్ర విజయ కర్మార్కర్ దర్శకత్వం వహించారు. ఈ మూవీని నేడు రిలీజ్ చేయబోతోన్నారు. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, దర్శకుడు మెహర్ రమేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. మెహర్ రమేష్ మాట్లాడుతూ.. 'రాజు సత్యం నాకు చాలా మంచి స్నేహితుడు. స్వర్గీయ పునీత్ రాజ్ కుమార్‌తో నేను చేసిన 'వీర కన్నడిగ' చిత్రంలో రాజు నటించాడు. అప్పటి నుంచి మా స్నేహం కంటిన్యూ అవుతూనే ఉంది. ఆయన ఇప్పుడు 'మ్యాజిక్' మూవీని నిర్మించారు. ట్రైలర్ చూశాను. నాకెంతో గ్రిప్పింగ్‌గా అనిపించింది. పూరి చిత్రాల్లో రాజ్ నటించాడు. ఇప్పుడు ప్యాషనేట్ ప్రొడ్యూసర్‌గా మారిపోయారు. బాలీవుడ్ అంతా కదిలి వచ్చి ఈ చిత్రం కోసం సపోర్ట్ చేశారు. హైదరాబాద్‌లోని మరాఠీ ప్రేక్షకులకు కూడా స్క్రీన్స్ ఉంటాయి. ఇక్కడి వారంతా 'మ్యాజిక్' మూవీని చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు. ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. 'మ్యాజిక్' నిర్మాత రాజు సత్యంకి ఆల్ ది బెస్ట్. ఇండియన్ సినిమాల్లో మరాఠీ ఇండస్ట్రీకి ప్రత్యేక స్థానం ఉంటుంది. అక్కడి నుంచి అద్భుతమైన ఆర్టిస్టులు బయటకు వచ్చారు. అలాంటి ఇండస్ట్రీ నుంచి నేరుగా 'మ్యాజిక్' సినిమా రాబోతోంది. రిలీజ్‌కు ముందే ప్రపంచ వ్యాప్తంగా 9 అంతర్జాతీయ అవార్డుల్ని దక్కించుకుందని అన్నారు. అరవింద్, నిర్మాత రాజు సత్యం, జితేంద్ర జోషి పాల్గొన్నారు.

## సిద్ధుగాడి లవ్‌స్టోరీ పోస్టర్ ఆవిష్కరణ

మహాన్, శృతి, మోహన సిద్ధి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'సిద్ధుగాడి లవ్‌స్టోరీ'. ఈ సినిమాను బాలబ్రహ్మాచారి సమర్పణలో శివ బ్రహ్మేంద్ర క్రియేషన్స్ బ్యానర్‌పై సావిత్రమ్మ.సి. నిర్మిస్తున్నారు. రమేష్.సి. దర్శకత్వం వహిస్తున్నారు. వేణు గోపాల చారి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. 'సిద్ధు గాడి లవ్ స్టోరీ' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 'సిద్ధుగాడి లవ్‌స్టోరీ' మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ.. డైరెక్టర్ కావాలనే తన కొడుకు రమేష్ కలను 'సిద్ధుగాడి లవ్‌స్టోరీ' సినిమాతో సావిత్రమ్మ నిజం చేశారు. రమేష్‌ను యూఎస్‌లో కలిశాను. సినిమా మీద ప్యాషన్ ఉన్న వ్యక్తి ఆయన. అక్కడ తన ప్రొఫెషనల్ కెరీర్ కంటిన్యూ చేస్తూ ఇండియా వచ్చి ఈ సినిమా కంప్లీట్ చేశారు. సిద్ధు సిద్ధార్థ్ రాయ్ లవ్ స్టోరీని ఖుషి సినిమాలో చూసి హిట్ చేశాం. 'సిద్ధుగాడి లవ్‌స్టోరీ' పాటలు చాలా బాగున్నాయి. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో మహాన్, హీరోయిన్ మోహన సిద్ధి, హీరోయిన్ శృతి, మ్యూజిక్ డైరెక్టర్ అధిరవ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## చిన్న-పెద్ద కాదు.. కంటెంట్ ఉండాలి

### 'ఈషా' సక్సెస్ మీట్‌లో సురేష్ బాబు



చిన్నసినిమా, పెద్ద సినిమా అనేది ఉండదు. కంటెంట్ బాగుంటే సినిమా ఆడుతుంది. కంటెంట్ ఉన్న చిత్రాల్నే ఆడియెన్స్ చూస్తారు. ఆడియెన్స్ పెట్టే డబ్బులు, వెచ్చించే సమయానికి తగ్గ కంటెంట్‌ను మనం ఇస్తున్నామా? లేదా? అన్నది చూసుకోవాలి. ఎవరో మీ కథను రిజెక్ట్ చేశారని నిరుత్సాహ పడొద్దు.. సరైన టైంకి అన్నీ జరుగుతాయి. పాజిటివ్‌గా ఉండండి. అంతా మంచే జరుగుతుంది. దాముకి హిట్ రావడం ఆనందంగా ఉంది' అని తెలుగు ఫిలిం ఛాంబర్ నూతన అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు అన్నారు. విడుదలైన రోజు నుంచి సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న ఈషా సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సినిమా సమర్పకుడు దామోదర్ ప్రసాద్ ఫిలిం ఛాంబర్ కార్యదర్శిగా భాధ్యతలు చక్కగా నిర్వర్తించారని సురేష్ బాబు అన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన దామోదర్ ప్రసాద్ సహాయ సహకారాలు ఉంటాయని ఆయన అన్నారు. కెవిల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. 'బన్నీ వాస్, వంశీలకు దిష్టి తీయాలి. పిలిచిన వెంటనే వచ్చిన నా స్నేహితులు సురేష్, అశోక్‌లకు థాంక్స్. అల్లు అరవింద్ ఇచ్చే ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఈ ఏడాదిలో చిన్న చిత్రాలుగా వచ్చి హిట్టు కొట్టిన వారిని పిలవాలని అనుకున్నాను. అసలు సినిమాల్లో చిన్నా, పెద్ద అన్నది లేదు. ఏది ఆడితే అది పెద్ద సినిమా. ఆడకపోతే చిన్న చిత్రం. 'ఈషా' జర్నీ చాలా పెద్దది. ఈ ప్రయాణంలో శ్రీనివాస్ చాలా కష్టపడ్డాడు. గత 15 ఏళ్లుగా అతడి జర్నీని నేను చూస్తున్నాను. శ్రీను తనని తాను నిరూపించుకున్నాడు. ఇక నుంచి శ్రీను వెనక్కి తిరిగి చూసుకునే పరిస్థితి రాకూడదు. సహనంతో ఉంటే ప్రతీ ఒక్కరికీ విజయం దక్కుతుందని అన్నారు. నటుడు, నిర్మాత, ఫిలిం ఛాంబర్ కార్యదర్శి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. 'నేను సినిమాలు చూడటం చాలా వరకు తగ్గించేశాను. కానీ ఇక్కడ మాట్లాడిన వారి మాటలన్నీ వింటే నా తొలి రోజులు గుర్తుకు వచ్చాయి. వెంకటేష్‌తో నేను తీసిన 'రక్త తిలకం' సంక్రాంతి పోటీలో రిలీజ్ చేసి రిస్క్ తీసుకున్నాం. యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు భయపడాల్సిన పని లేదు. బన్నీ వాస్ పేరు పడితే సినిమాకి ఓ గ్లామర్ వస్తుంది. మా కాలంలో ఇప్పటిలా సోషల్ మీడియా, నెగెటివిటీ అనేది లేదు. పాజిటివ్‌గా ముందుకు వెళ్తే కాస్త స్లోగా అయినా సరే సక్సెస్ కచ్చితంగా వస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో దర్శకుడు శ్రీనివాస్ మన్నె, బన్నీ వాస్, వంశీ నందిపాటి, నిర్మాత హేమ వెంకటేశ్వర రావు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్ఆర్ ధృవన్, నటుడు అఖిల్ రాజ్, నటి సిరి, నటి ఉషా శ్రీ, 'కోర్ట్' డైరెక్టర్ రామ్ జగదీష్, రచయిత లక్ష్మీ భూపాల, కళ్యాణీ మాలిక్, నిర్మాత బెక్కెం వేణుగోపాల్, తెలుగు టైటాన్ సీఈవో త్రినాథ్ రెడ్డి, నటుడు హర్షిత్, డైరెక్టర్ యదు వంశీ వంటి పాల్గొన్నారు.

## రాజు గారి పెళ్లి రిసెప్షన్ వేడుక



మూడు వరుస ఘన విజయాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. అసలుసిసలైన పండగ చిత్రంగా జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టనున్న 'అనగనగా ఒక రాజు' సినిమా ప్రమోషన్ కోసం 'రాజు గారి పెళ్లి రిసెప్షన్ వేడుక'ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. హీరో, హీరోయిన్ నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి 'అనగనగా ఒక రాజు' చిత్రంలోని 'భీమవరం బాల్మా', 'రాజు గారి పెళ్లిరో' పాటలకు వేదికపై నృత్యం చేసి అందరిలో ఉత్సాహం నింపారు. అనంతరం అతిథులందరికీ స్వాగతం పలికి, నిజంగానే పెళ్లి రిసెప్షన్ వేడుకను తలపించారు. ఇక నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి నూతన వధూవరుల్లా వేదికపై కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ.. వరుసగా మూడు విజయాలు అందుకున్న తర్వాత అదే ఉత్సాహంలో మీ ముందుకు మరో అదిరిపోయే సినిమాని తీసుకొద్దాం అనుకున్నాను. కానీ, ఒక యాక్సిడెంట్ జరగడం వల్ల నేను షూటింగ్ కి దూరమయ్యాను. మానసికంగా, శారీరకంగా కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. అయితే అదే సమయంలో మా బృందంతో కలిసి ఈ 'అనగనగా ఒక రాజు' కథ రాసుకోవడం జరిగింది. మీ అందరి ప్రేమ, మద్దతు వల్లే నేను త్వరగా కోలుకోగలిగాను. మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ఇది నా మూడో సంక్రాంతి సినిమా. 'అనగనగా ఒక రాజు'లో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాపై మీరు చూపించే ప్రేమ కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నాను. జనవరి 14న థియేటర్లలో కలుద్దాం' అన్నారు.



## జనవరి 2న 'వామ్మో వాయ్యో..'

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో ఈ సంక్రాంతికి అద్భుతమైన వినోదాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' నుంచి 'వామ్మో వాయ్యో' సాంగ్ జనవరి 2న వరంగల్‌లో నిర్వహిస్తున్న ఈవెంట్‌లో లాంచ్ చేయనున్నారు. రవితేజ, ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కలర్ ఫుల్ అవుట్ ఫిట్స్‌లో మాస్ అండ్ స్టైలిష్‌గా డాన్స్ చేస్తూ కనిపించిన ఈ పోస్టర్ పర్ఫెక్ట్ ఫెస్టివల్ వైబ్‌ని సెట్ చేసింది. సాంగ్ ప్రోమో అదిరిపోయింది. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో సంక్రాంతికి పర్ఫెక్ట్ మూవీగా ప్రేక్షకుల్ని అలరించబోతుంది. జనవరి 13న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

# మోదీ విధ్వంస పాలన

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. 'సంవత్సరం చివరి రోజున బిజెపి పాలనలో 11వ సంవత్సరమైన 2025లో దేశాన్ని ఎలా పరిపాలించారో అందరికీ గుర్తు చేయడం చాలా అవసరం' అని ఖర్గే (గతంలో ట్విట్టర్)లో హిందీలో పేర్కొన్నారు. వివిధ రంగాలలో ప్రభుత్వ వైఫల్యాలుగా ఆయన అభివర్ణించిన అనేక అంశాలను ఆయన జాబితా చేశారు. ఎన్నికల ప్రక్రియలు, జాతీయ భద్రత, విదేశాంగ విధానం, సంక్షోభ నిర్వహణలో వైఫల్యాలను, అలాగే అణగారిన వర్గాలపై పెరుగుతున్న అకత్యాలు, తీవ్రమవుతున్న పర్యావరణ, వాయు కాలుష్య సమస్యలను కూడా ఆయన ఎత్తి చూపారు. 'ఎంజిఎన్ఆర్ఇజిఎను రద్దు చేయడం ద్వారా, లక్షలాది మంది పేదల నుంచి 'పని హక్కు'ను లాక్కున్నారు. ఎలాంటి సన్నాహం లేకుండా, బిఎల్‌ఒలకు శిక్షణ ఇవ్వకుండా, ఎస్ఐఆర్ ద్వారా లక్షలాది మంది నుంచి 'ఓటు హక్కు'ను లాక్కున్నారు. బిజెపి ఓట్ల దొంగతనంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఆర్థిక అసమానతల అగాధం మరింతగా పెరిగింది. భారతదేశ సంపద 40 శాతం అగ్రశ్రేణి 1 శాతం మంది చేతిలో ఉంది. రూపాయి పాతాళానికి పడిపోతోంది. ఆర్‌బిఐ 32 బిలియన్ డాలర్లు (2.8 లక్షల కోట్ల రూపాయలు) విలువైన అమెరికన్ డాలర్లను విక్రయించినప్పటికీ, దానివల్ల ఎలాంటి మార్పు రాలేదు. యువతలో నిరుద్యోగం గరిష్ఠ స్థాయిలో ఉంది. ప్రశ్నపత్రాల లీక్ మాఫియా ఆట నిరాటంకంగా కొనసాగుతోంది. మోదీ స్నేహితుడు 'నమస్తే ట్రంప్' మన దేశంపై ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను విధించారు. పుల్వామా ఉగ్రదాడి తర్వాత మన శక్తివంతమైన సైన్యం తగిన ప్రతీకారం తీర్చుకుంది. కానీ బిజెపి మంత్రులు మన కల్నల్ గురించి సిగ్గుచేటయిన వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కనీసం 60సార్లు 'మధ్యవర్తిత్వం' గురించి చెప్పారు. ఇప్పుడు చైనా కూడా 'మధ్యవర్తిత్వం' గురించి మాట్లాడుతోంది. కానీ మోదీ మౌనంగా ఉన్నారు' అని విమర్శించారు. 'పెరుగుతున్న సామాజిక, ఆర్థిక సంక్షోభానికి కారణమవుతూనే, పరిపాలనా లోపాలు, మానవ విషాదాలకు ప్రభుత్వం జవాబుదారీతనం నుంచి తప్పించుకుందని ఖర్గే ఆరోపించారు. మణిపూర్‌లో మోదీషా వైఫల్యం చెందారు. దానిని కప్పిపుచ్చడానికే రాష్ట్రపతి పాలన విధించారు. ద్రవ్యోల్బణం నుంచి ఎలాంటి ఉపశమనం లేదు. జిఎస్‌టి నుంచి తగ్గింపు కేవలం లెక్కల గారడీ అని తేలింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలపై అకత్యాలు పెరిగిపోయాయి. చివరికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా వదల్లేదు. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశమంతా విషపూరిత వాయు కాలుష్యంతో సతమతమవుతోంది. ఎలాంటి కార్యాచరణ ప్రణాళిక లేదు. కేవలం డొల్ల మాటలే. అరావళి పర్వతాలను మైనింగ్ మాఫియాకు అప్పగించే కుట్ర. నికోబార్, హస్డియో, ముంబై మడ అడవులపై దాడులు. కుంభమేళా తొక్కిసలాట అయినా, ఢిల్లీ స్టేషన్ గందరగోళం అయినా, దగ్గు మందు వల్ల అమాయక ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అయినా ఎవరూ బాధ్యత వహించడం లేదు' అని పేర్కొన్నారు. తన విమర్శలను ముగిస్తూ 'మొత్తం మీద, 2025లో కూడా బిజెపి దోపిడీ, అవినీతి, దుర్మార్గపు పాలన దేశ ప్రజలపై తీవ్రంగా కొనసాగింది' అని ఖర్గే తెలిపారు.


# నిరంతర పర్యవేక్షణ

(మొదటి పేజీ తరువాయి)

యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ నెల అమ్మకాలతో పోలిస్తే, ఈ డిసెంబర్‌లో రైతులు లక్ష మెట్రిక్ టన్నుల మేరకు అదనంగా యూరియా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఏడాది రబీ సీజన్‌లో 79.54 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 13.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో ప్రధాన పంటలైన వరి 3.94 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తవగా, మొక్కజొన్న 5.45 లక్షల ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు. ప్రస్తుతం దుక్కిలో వేసుకునే డి.ఎ.పి, కాంప్లెక్స్ ఎరువులను రైతులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని, మొక్కజొన్న సాగు చేస్తున్న జిల్లాలలో మరియు కొన్నిచోట్ల రైతులు ముందస్తు జాగ్రత్తగా యూరియా బస్తాలు కూడా కొనుగోలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. అయితే ముందుగానే అవసరమైన మేరకు ఎరువులను రాష్ట్రానికి తెప్పించి నిల్వ ఉంచినందున రైతులకు ఎక్కడా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఇప్పటికే రైతులకు సుమారు 4లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. సొసైటీకి గానీ, రిటైల్ షాప్‌కు గానీ వచ్చే ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందుతున్నాయని చెప్పారు. మండల అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సహాయ సంచాలకులు అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా యూరియా సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. డీలర్ల వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని, అందరూ ఒకే కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా మండలాల్లో ఉన్న అన్ని రిటైల్ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు. యాప్ అమలవుతున్న జిల్లాలలో యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 5 జిల్లాల్లో దాదాపు లక్ష మంది రైతులు యాప్ ద్వారా 3.19 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

# చైనా వాదనపై ప్రధాని స్పందించాలి

### కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్



**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్తాన్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు చైనా చేస్తున్న వాదనలపై భారత ప్రజలకు స్పష్టత అవసరమని కాంగ్రెస్ బుధవారం పేర్కొంది. ఈ వాదనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మౌనం వీడాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కోరారు. ఈ ఆరోపణ దేశ జాతీయ భద్రతను అపహాస్యం చేసేలా ఉందన్నారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మే 10, 2025న ఆపరేషన్ సిందూర్‌ను ఆపడానికి తాను వ్యక్తిగతంగా జోక్యం చేసుకున్నానని చాలా కాలంగా చెబుతున్నారు. కనీసం ఏడు వేర్వేరు దేశాలలోని వివిధ వేదికలలో 65 వేర్వేరు సందర్భాలలో ఆయన అలా చేశారు. తన మంచి స్నేహితుడు అని చెప్పుకునే వ్యక్తి చేసిన ఈ వాదనలపై ప్రధాన మంత్రి ఇప్పటికీ మౌనం వీడలేదు' అని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి కూడా ఇలాంటి వాదనే చేస్తున్నారు. చైనా కూడా మధ్యవర్తిత్వం వహించిందని చెబుతున్నారు. జులై 4, 52 2025న డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశం వాస్తవానికి చైనాను ఎదుర్కొంటోందని, పోరాడుతోందని బహిరంగంగా ప్రకటించారు. 'చైనా పాకిస్థాన్‌తో నిర్ణయాత్మకంగా పొత్తు పెట్టుకున్నందున, భారతదేశం, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించినట్లు చైనా వాదనలు ఆందోళన కలిగిస్తున్నాయి. అవి మన దేశ ప్రజలు నమ్ముతున్న దానికి ప్రత్యక్షంగా విరుద్ధంగా ఉండటం వల్లనే కాదు. వారు మన జాతీయ భద్రతనే ఎగతాళి చేస్తున్నట్లు కనిపిస్తున్నందున' అని ఆయన తెలిపారు. చైనాతో మన సంబంధం సందర్భంలో కూడా ఈ వాదనను అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. 'మేము వారితో తిరిగి చర్చలు ప్రారంభించాము. కానీ దురదృష్టవశాత్తు అది చైనా నిబంధనలపై ఉంది. జూన్ 19, 2020న చైనాకు ప్రధాన మంత్రి క్లీన్ చిట్ ఇవ్వడం భారతదేశం చర్చల స్థానాన్ని గణనీయంగా బలహీనపరిచింది' అని ఆయన అన్నారు. మన వాణిజ్య లోటు రికార్డు స్థాయిలో ఉందని, దేశ ఎగుమతులలో ఎక్కువ భాగం చైనా నుండి దిగుమతులపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌కు సంబంధించి చైనా రెచ్చగొట్టే చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయన్నారు. 'ఇటువంటి అసమానమైన, శత్రుత్వంతో కూడిన సంబంధాల మధ్య ఆపరేషన్ సిందూర్‌కు ఆకస్మికంగా అంతరాయం కలగడంలో చైనా పోషించిన పాత్రపై భారత దేశ ప్రజలకు స్పష్టత అవసరం' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ ఏడాది చైనా మధ్యవర్తిత్వం వహించిన కీలక సమస్యల జాబితాలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కూడా ఉన్నాయని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మంగళవారం అన్నారు. మే 710 తేదీల మధ్య భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన సంఘర్షణ రెండు దేశాల సైన్యాల డీజీఎంఓల (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా పరిష్కరించబడిందని న్యూఢిల్లీ చెబుతూ వస్తోంది. అయితే భారత్, పాకిస్థాన్‌కు సంబంధించిన విషయాలలో ఏ మూడవ పక్షం జోక్యానికి తావు లేదని కూడా భారతదేశం నిలకడగా చెబుతోంది.

# రైతు కళ్లల్లో కారం కొట్టి రూ.25 లక్షల దోపిడీ

**భోపాల్:** మధ్యప్రదేశ్‌లోని అశోక్ నగర్ జిల్లా తమోయియా చక్ గ్రామంలో దొంగలు దారి కాచి ఓ రైతు కళ్లల్లో కారం కొట్టి అతడి నుంచి రూ.25లక్షలు దోచుకున్నారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. లఖ్వీందర్ (47) అనే రైతు అశోక్‌నగర్‌లోని బంధువుకు ఇవ్వడానికి రూ. 25 లక్షలు తీసుకొని ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయల్దేరాడు. మార్గంమధ్యలో ముగ్గురు దొంగలు రైతు ను అడ్డగించారు. తమ వెంట తెచ్చుకున్న కారం లిఖ్వీందర్ కళ్లలో కొట్టి అతడి వద్ద ఉన్న రూ.25 లక్షల నగదు బ్యాగును తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. తమోయియా చక్‌మోహ్రి గ్రామాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్దిసేపటికి తేరుకున్న రైతు... పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వివేక్ శర్మ తెలిపారు.

# కశ్మీర్ లోయలో మంచు దుప్పటి

**శ్రీనగర్:** కశ్మీర్ లోయలో మంచు దుప్పటి పరుచుకుంది. కశ్మీర్ వ్యాలీలోని ప్రసిద్ధ టూరిస్ట్ ప్రాంతమైన సోనామార్గ్‌లో తెల్లటి దూది వెదజల్లినట్టుగా మంచు కనిపిస్తోంది. దాంతో కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ అందంగా, ఆహ్లాదకరంగా, అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఆ సుందర దృశ్యాలు టూరిస్టులకు కనువిందు చేస్తున్నాయి. కశ్మీర్ వ్యాలీలో పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో గత కొన్ని రోజుల నుంచి మంచు విపరీతంగా కురుస్తుంది. సన్నని దూది పింజాల్లా రాలుతున్న మం చును యాత్రికులు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ తెల్లని మంచు పరుచుకోవడంతో అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.


# 11మంది ఉగ్రవాదుల అరెస్ట్

**గుహతి:** అసోంలో ఉగ్రవాదుల భారీ కుట్రను అధికారులు భగ్నం చేశారు. అసోం, త్రిపురలో దాడులకు కుట్ర పన్నిన 11 మంది ఉగ్రవాదులను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్ కేంద్రంగా ఈ టెర్రరిస్ట్ క్యాంపు నడుస్తోందని, భారీదాడులకు వీరు పథకం వేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన సందర్భంలో ఉగ్రవాదుల వద్ద జిహదీ సాహిత్యంలో పాటు కీలక ఆధారాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా ఇటీవల దిల్లీ ఎర్రకోట బాంబు దాడుల నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ దేశవ్యాప్తంగా దర్యాప్తును ముమ్మరం చేసింది. అనుమానిత ప్రాంతాలలో ప్రత్యేక సోదాలు నిర్వహించింది. ఈ దాడులలో ఉగ్రవాద దాడులకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించడంతో పలువురిని అరెస్ట్ చేసింది.

# 'పరీక్ష సక్సెస్'

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ సెంటర్ ఈ ప్రయోగానికి వేదిక అయ్యింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వెల్లడించిన ప్రకారం ఈ పరీక్ష మంగళవారం జరిగింది. ఎస్ఎస్ఎల్‌వి అనేది ఇస్రోఅభివృద్ధి చేసిన మూడుదశల పూర్తి ఘన ప్రయోగ వాహనమని, ఇది పారిశ్రామిక ఉత్పత్తికి అనుగుణంగా ఉంటుందని, ప్రయోగాల మధ్య శీఘ్ర టర్న్‌రౌండ్ టైమ్‌తో డిమాండ్‌పై ప్రయోగాన్ని తీర్చగలదని ఇస్రో విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. మూడు దశల ఆల్ సాలిడ్ లాంచ్ వెహికిల్ ఎస్ఎస్ఎల్‌వి పనితీరును విశ్లేషించడంతో పాటు డేటాను సేకరించినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ తెలిపింది. చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి వేగంగా ప్రయోగించడం కోసం ఈ ఎస్ఎస్ఎల్‌వి మూడవ దశను రూపొందించారు. అధిక స్థాయి ఉత్పత్తికి కూడా ఇది అనుకూలంగా ఉంటుందని, పేలోడ్‌కు సెకన్‌కు 4కి.మీ.ల వేగాన్ని అందించడంలో ఈ ఎస్ఎస్ఎల్‌వి ఎస్ఎస్3 కీలకపాత్ర పోషిస్తుంది అని అధికారులు తెలిపారు. పేలోడ్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని చెప్పారు. కార్బన్ ఎపాక్సీ మోటార్ కేసుతో కూడిన ఎస్ఎస్ఎల్‌వి మూడవ దశ యొక్క మెరుగైన వెర్షన్‌ను ఈ స్టాటిక్ పరీక్ష ధృవీకరించిందన్నారు. ఇది దశ యొక్క ద్రవ్యరాశిని గణనీయంగా తగ్గించిందని, తద్వారా ఎస్ఎస్ఎల్‌వి పేలోడ్ సామర్థ్యాన్ని 90 కిలోలు మెరుగుపర్చిందని ఇస్రో తెలిపింది. విక్రమ్‌సారాభాయ్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం కాంపోజిట్స్ ఎంటిటీలో అధికబలం కలిగిన కార్బన్ ఫిలమెంట్ దెబ్బతిన్న మోటార్ కేసును గమనించామని, సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డిఎస్‌సి)లోని సాలిడ్ మోటార్ ఉత్పత్తి సౌకర్యాలలో సాలిడ్ మోటార్‌ను వేశామని అది జోడించింది. కొలిచిన అన్ని పారామీటర్లను 108 సెకన్ల పరీక్ష వ్యవధిలో అంచనాకు దగ్గరగా గమనించామని, ఈ విజయవంతమైన స్టాటిక్ ఫైరింగ్ పరీక్షలతో ఎస్ఎస్3 మోటార్ మెరుగైన వెర్షన్ విమానంలో ఇండక్షన్‌కు అర్హత పొందిందని ఇస్రో విడుదల చేసిన ప్రకటన తెలిపింది. ఇస్రో ప్రకారం ఈ సంవత్సరం అంతరిక్ష కార్యక్రమం కోసం ఘన మోటార్లను గ్రహించే సామర్థ్యం పెంచడానికి దేశంలో బహుళ సౌకర్యాలు ప్రారంభించబడ్డాయి. 2025 జులైలో సామర్థ్యాన్ని పెంచడానికి శ్రీహరికోటలో సాలిడ్ మోటార్ ఉత్పత్తి కార్యక్రమాలను ప్రారంభించారు. సాలిడ్ మోటార్ ప్రొడక్షన్ లైన్ కోసం 10టన్నుల స్వదేశీ నిలువు మిక్సర్ ఈ ఏడాది సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో ప్రారంభించబడిందని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సాలిడ్ ప్రొపెల్లెంట్ మిక్స్‌డ్ పరికరం అని అధికారులు తెలిపారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com